

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 1-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 167 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.7:01 తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.8:06 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.4:28-6:08, దుర్ముహూర్తం: ఉ.11:41-12:28, అమృతఘడియలు: రా.2:31-4:11, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:00 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారత్ శుభారంభం

శ్రీలంకపై ఘనవిజయం

దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో ● మహిళల వన్డే వరల్డ్‌కప్



స్కోరుబోర్డు

భారత్: ప్రతికా (సి) గుణరత్నే (బి) రణవీర 37, మంధాన (సి) గుణరత్నే (బి) ప్రబోధని 8, హర్లీన్ (సి) దిల్హరి (బి) రణవీర 48, హర్మన్‌ప్రీత్ (సి) సంజీవని (బి) రణవీర 21, జెమీమా (బి) రణవీర 0, దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) కులసూర్య 53, రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) ఆటపట్టు 2, అమన్‌జోత్ (సి) గుణరత్నే (బి) ప్రబోధని 57, స్నేహ్ రాణా (నాటౌట్) 28, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 47 ఓవర్లలో 269/8; వికెట్ల పతనం:** 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269; **బౌలింగ్:** కులసూర్య 8-0-42-1, ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, దిల్హరి 8-0-51-0, రణవీర 9-0-46-4, ఆటపట్టు 3-0-24-1.

శ్రీలంక: హాసిని పెరీరా (బి) క్రాంతి 14, ఆటపట్టు (బి) దీప్తి 43, సమరవిక్రమ (ఎల్బీ) శ్రీచరణి 29, విష్మి గుణరత్నే (ఎల్బీ) అమన్‌జోత్ 11, దిల్హరి (సి) రిచా (బి) దీప్తి 15, నీలాక్షిక సిల్వా (బి) స్నేహ్ రాణా 35, సంజీవని (సి) హర్మన్ (బి) దీప్తి 6, సుగంధిక (బి) స్నేహ్ రాణా 10, కులసూర్య (సి) మంధాన (బి) శ్రీచరణి 17, ప్రబోధని (నాటౌట్) 14, రణవీర (ఎల్బీ) ప్రతిక 3, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 45.4 ఓవర్లలో 211 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211; **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతీకా రావల్ 2.4-0-6-1,

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో తొలి టైటిల్ వేటను భారత్ ఘనంగా ఆరంభించింది. దీప్తి శర్మ ఆల్‌రౌండ్‌షో (53; 3/54)తో అదరగొట్టగా మంగళవారం శ్రీలంకతో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 59 రన్స్ తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌కు రెండుసార్లు వర్షం ఆటంకం కలిగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47 ఓవర్లలో 8 వికెట్లకు 269 పరుగులు చేసింది. అమన్‌జోత్ (57), హర్లీన్ (48), ప్రతీకా రావల్ (37), స్నేహ్ రాణా (28 నాటౌట్) రాణించారు. అటు ఫీల్డింగ్‌లో నిరాశపరిచిన లంక అమన్‌జోత్ నాలుగు క్యాచ్‌లను జారవిడిచి మూల్యం చెల్లించుకుంది. స్పిన్నర్ ఇనోక రణవీరకు నాలుగు, ప్రబోధనికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంకకు డ/లూ పద్ధతిన 271 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (43), నీలాక్షి (35), హర్షిత (29) మాత్రమే రాణించారు. స్నేహ్, శ్రీచరణిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దీప్తి శర్మ నిలిచింది.

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా x న్యూజిలాండ్

శతక భాగస్వామ్యం: టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగగా నాలుగో ఓవర్‌లోనే మంధాన (8) అవుట్‌తో షాక్ తగిలింది. అయితే హర్లీన్, ప్రతీకా రెండో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. 26వ ఓవర్‌లో హర్లీన్, జెమీమా (0), హర్మన్‌ప్రీత్ (21)లను స్పిన్నర్ రణవీర అవుట్ చేయగా, తర్వాతి ఓవర్‌లోనే రిచా (2) సైతం వెనుదిరిగింది. దీంతో కేవలం నాలుగు పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి 124/6 స్కోరుతో భారత్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 200 రన్స్ అసాధ్యంగానే అనిపించింది. కానీ దీప్తి-అమన్‌జోత్ జోడీ లంక బౌలర్లను పట్టుదలగా ఎదుర్కొంది. సమన్వయ ఆటతీరుతో ఇద్దరూ అర్ధసెంచరీలు పూర్తి చేయడంతో పాటు ఏడో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. ఇక స్నేహ్ రాణా ధనాధన్ బ్యాటింగ్‌తో ఆఖరి రెండు ఓవర్లలో 34 పరుగులు సమకూర్చగా భారత్ 260+ స్కోరు దాటింది.

కోహ్లీని అనుసరిస్తా..

ఆంధ్రజ్యోతితో తిలక్ వర్మ



ఆసియా కప్ ఫైనల్లో కోట్లాది అభిమానుల ఆశలను మోస్తూ బరిలోకి దిగిన తిలక్ వర్మ అద్భుత విజయాన్నందించి భారత్‌ను సమున్నతంగా నిలిపాడు. జట్టును విజయతీరాలకు చేర్చాక అంతులేని ఉద్వేగంతో సింహనాదం చేశాడు. భారత క్రికెట్ నయా చేజ్ మాస్టర్‌గా అభిమానుల నుంచి నీరాజనాలందుకుంటున్న ఆసియా కప్ హీరో, తెలుగు తేజం ఠాకూర్ తిలక్ వర్మ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న విశేషాలు.. అతడి మాటల్లోనే..

- విరాట్‌తో పోల్చడాన్ని గౌరవంగా భావిస్తున్నా
- దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించాలనేది కల
- ఫైనల్లో చెప్పలేని భాషలో పాక్ స్లెడ్జింగ్
- అరునూరైనా దేశాన్ని గెలిపించాలనుకున్నా

2025 సెప్టెంబరు 28.. నా జీవితంలో మర్చిపోలేని రోజు. ఆసియా కప్.. అందులోనూ పాకిస్థాన్‌ను ఓడించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. నా టీ20 కెరీర్‌లోని రెండు సెంచరీల కంటే ఈ ఫైనల్‌లో సాధించిన 69 పరుగులు చాలా ప్రత్యేకమైనవి. జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఇది. ఊహకందని ఒత్తిడి, భారీ అంచనాల నడుమ జరిగిన ఫైనల్లో కడవరకు బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించడం కంటే మధురానుభూతి ఇంకేముంటుంది. ఆసియా కప్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో ఎదురయ్యే సవాళ్లకు మానసికంగా సిద్ధమై ఉన్నాం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరుగుతున్న టోర్నీ కావడంతో పాక్‌తో మ్యాచ్‌ల్లో ఉండే పరిస్థితుల గురించి కోచ్ గౌతం గంభీర్ మమ్మల్ని సన్నద్ధం చేశారు. ఫైనల్లో బ్యాటింగ్‌కి రాగానే స్టేడియంలోని ఆ తీవ్రత చూసి కొంచెం ఒత్తిడికి లోనయ్యా. స్వల్ప స్కోరుకే మూడు వికెట్లు కోల్పోవడంతో ఎడాపెడా షాట్లు కొట్టకుండా బాధ్యతగా ఆడాల్సిన పరిస్థితి. ఒక ఓవర్ పూర్తయిన తర్వాత క్రీజులో ఒకసారి కళ్లు మూసుకోగానే 140 కోట్ల మంది ప్రజలు జట్టుపై పెట్టుకున్న ఆశలు, నమ్మకం మదిలో మెదిలాయి. ఒక్కసారి గట్టిగా ఊపిరి తీసుకొని ఆఖరి పరుగు సాధించే వరకు క్రీజు వదలకూడదని అనుకుని పట్టుదలగా ఆడా.

చెప్పలేని భాషలో స్లెడ్జింగ్..

ఆటతోనే కాకుండా ప్రత్యర్థి జట్టు క్రికెటర్లు మమ్మల్ని చాలా కవ్వించారు. చెప్పలేని భాషలో స్లెడ్జింగ్‌కు దిగారు. నా ఏకాగ్రతను దెబ్బతీయడానికి తీవ్రంగా యత్నించారు. మాటలతో మానసికంగా దెబ్బకొట్టి పైచేయి సాధించాలని చూశారు. నేను మాత్రం ఏకాగ్రత కోల్పోకుండా బంతిపైనే దృష్టి పెట్టి బ్యాటింగ్ చేశా. వారి చేష్టలకు, మాటలకు నేను ఆవేశపడి ఒక్క చెత్త షాట్ ఆడినా మ్యాచ్ ఫలితమే తారుమారయ్యే అవకాశం ఉండడంతో సంయమనంతో ఆడా. ఒత్తిడి సమయాల్లో ఎలా ఆడాలో కోచ్ సలాం బయాష్ సార్ వద్ద బాల్యం నుంచి నేర్చుకున్నదాన్ని ఫైనల్లో ఆచరణలో పెట్టా. మనం మూడో వికెట్ కోల్పోయాక పాక్ ఆటగాళ్లు మైదానంలో బాగా రెచ్చిపోయారు. గెలుపు తమదే అన్నట్టు ప్రవర్తించారు. అయినా నేను నా నోటితో కాకుండా బ్యాట్‌తోనే స్పందించా. కోట్లాది భారతీయుల ముఖాల్లో ఆనందం చూడాలని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని ఆడా.

కోహ్లీ అడుగుజాడల్లో నడుస్తా..

2011 వన్డే వరల్డ్‌కప్‌ను టీమిండియా గెలిచిన తర్వాత ఆ స్ఫూర్తితో నేను క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పటి నుంచి నేను కోహ్లీ ఆట చూస్తూ అతడిని చాలా విషయాల్లో అనుకరించేవాణ్ణి. బ్యాటింగ్‌లోనే కాకుండా మైదానంలోనూ కోహ్లీ చూపించే దూకుడు తాలుకూ ప్రభావం నాపై ఉంది. నా ఆరాధ్యుడైన కోహ్లీతో అభిమానులు నన్ను పోలుస్తుండడం గౌరవంగా భావిస్తున్నా. కానీ కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయడం ఆషామాషీ కాదు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌ను దేశానికి అందించడమే నా లక్ష్యం. ప్రతి రోజు ఆ ఆలోచనలు నన్ను ప్రేరేపిస్తూనే ఉంటాయి. ఆ ట్రోఫీ సాధించాకే ప్రశాంతంగా నిద్రపోగలను. అప్పటిదాకా నిద్రలో కూడా అవే ఆలోచనలు వస్తుంటాయి. ప్రస్తుతానికి కొద్దిరోజులు కుటుంబంతో గడిపి, తర్వాత ఆస్ట్రేలియా సిరీస్‌కు సన్నద్ధమవుతా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఐదు బోర్డుల చెంతకు ట్రోఫీ వివాదం

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రదానం చేయాల్సిన ట్రోఫీ విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయారు. ఈ సమస్య పరిష్కార బాధ్యతలను ఏసీసీలోని ఐదు టెస్ట్ దేశాలకు వదిలేశారు. దీంతో భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ బోర్డులు చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోనున్నాయి. ఈ వివాదంపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని బీసీసీఐ ఈపాటికే హెచ్చరించింది. ఏసీసీ చీఫ్‌గా ఉన్న మొహిసిన్ నక్వీ పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఉండడంతో.. ఆదివారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ గెలిచిన అనంతరం అతడి చేతుల మీదుగా ట్రోఫీని అందుకొనేందుకు భారత్ నిరాకరించింది. దీంతో ట్రోఫీతోపాటు టీమిండియాకు ఇవ్వాల్సిన మెడల్స్‌ను నక్వీ తన హోటల్ రూమ్‌కు తరలించినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా, నక్వీ అధ్యక్షతన జరిగిన ఏసీసీ ఏజీఎంలో బీసీసీఐ ప్రతినిధులుగా రాజీవ్ శుక్లా, ఆశిష్ షేలర్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

నెట్స్‌లో చెమటోడ్చిన టీమిండియా

అహ్మదాబాద్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత్.. స్వదేశానికి చేరుకొన్న వెంటనే వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం ప్రాక్టీస్ ఆరంభించింది. మంగళవారం జరిగిన నెట్ సెషన్స్ నుంచి బుమ్రా, కుల్దీప్, అక్షర్ విరామం తీసుకోగా.. మిగతా టీమ్ మూడు గంటలు సాధన చేసింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా విండీస్‌తో తొలి టెస్ట్ గురువారం నుంచి జరగనుంది. ప్రాక్టీస్ తర్వాత గంభీర్ మరోసారి పిచ్‌ను పరిశీలించాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో చిత్తయిన నేపథ్యంలో తొలి టెస్ట్ కోసం ఎలాంటి పిచ్‌ను రూపొందించారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో భారత బలానికి తగ్గట్టుగా స్పిన్ వికెట్‌ను తయారు చేసేవారు. మరి గిల్ హయాంలో పాత ఫార్ములాకే కట్టుబడతారా? లేక ప్రయోగాలు చేస్తారా? చూడాలి.

హిమాన్షు జోడీకి పసిడి

□ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. మంగళవారం జరిగిన పోటీల్లో భారత్‌కు ఓ స్వర్ణం, రజతం, కాంస్యంతో కలిపి మూడు పతకాలు దక్కాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత ద్వయం హిమాన్షు/ఇషా అనిల్ తక్సాలే విజేతగా నిలిచింది. నరేన్/శాంభవి రన్నరప్‌గా నిలవడంతో రజతం భారత్ ఖాతాలో చేరింది. ట్రాప్ ఈవెంట్‌లో వినయ్ చంద్రావత్ కాంస్యం దక్కించుకున్నాడు.

సుమీత్ హ్యాట్రిక్

● సందీప్‌కు స్వర్ణం ● ఫైనల్‌కు అకీరా

ప్రపంచ పారా అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఫేవరెట్ సుమీత్ అంటిల్ వరుసగా మూడో పసిడి సాధించగా.. ఎఫ్-44 విభాగంలో సందీప్ సంజయ్ సాగర్, సందీప్ చౌధురి స్వర్ణ, రజతాలు కొల్లగొట్టారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64 ఫైనల్లో సుమీత్ 71.37 మీ. దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. 2023, 2024లో కూడా అంటిల్ పసిడి పతకాలు నెగ్గాడు. పురుషుల ఎఫ్-44 కేటగిరీలో సందీప్ సాగర్ 62.82 మీటర్లు విసిరి టాప్‌లో నిలిచాడు. చౌధురి 62.67 మీటర్ల దూరం విసిరి రజతం దక్కించుకొన్నాడు. పురుషుల ఎఫ్-56 డిస్కస్ త్రోలో యోగేష్ కథూనియా 42.49 మీ. దూరం విసిరి రజతం సాధించాడు. కాగా, తెలంగాణకు చెందిన బానోతు అకీరా నందన్ పురుషుల 400 మీ. టీ38 కేటగిరి హీట్-1లో 50.55 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్‌కు అర్హత సాధించాడు.

6 నెలలు రూ.23 లక్షల కోట్లు

మార్కెట్ తిరోగమనంలో సంపద నష్టం | ఆగని 'ఎఫ్‌పీఐ'ల అమ్మకాలు



ఎనిమిదో రోజూ నష్టాలే


దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా ఎనిమిదో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 97.32 పాయింట్ల నష్టంతో 80,267.62 వద్ద, నిఫ్టీ 23.80 పాయింట్ల నష్టంతో 24,611 వద్ద ముగిశాయి. గత ఎనిమిది రోజుల్లో సెన్సెక్స్ 2,746.34 పాయింట్లు నష్టపోయింది. ఎడతెగని ఎఫ్‌పీఐ అమ్మకాలు, బుధవారం వెలువడే ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధానం ఎలా ఉంటుందోననే ఆందోళన, గురువారం ముగిసే సెప్టెంబరు నెల డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ మంగళవారం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ప్రధాన సానుకూల అంశాలేవీ లేకపోవడమూ మార్కెట్‌కు కలిసి రాలేదు.

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్ మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి వేస్తోంది. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల కాలంలో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయి రూ.451.6 లక్షల కోట్లకు చేరింది. అయినా గత ఆరు నెలల్లో సెన్సెక్స్ 4.6%, నిఫ్టీ 3.7% లాభపడ్డాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం తర్వాత సూచీలు ఇంత కనిష్ఠ లాభాలతో ట్రేడవడం ఇదే మొదటిసారి. ఆ సమయంలో ఈ రెండు ప్రధాన సూచీలు దాదాపు రెండు శాతం వరకు నష్టపోయాయి. అయితే గత ఆరు నెలల్లో నిఫ్టీ మిడ్‌క్యాప్-100, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీలు మాత్రం తొమ్మిది శాతం వరకు లాభాలు పంచాయి.

ఆదుకుంటున్న డీఐఐలు : అంతర్జాతీయ ఉద్రిక్తతలతో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత ఆరు నెలల్లో దాదాపు రూ.37,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. భారత్ కంటే చైనా మార్కెట్ చౌకగా ట్రేడవడం ఇందుకు దోహదం చేస్తోంది. ఎఫ్‌పీఐలు అమ్మకాలు చేస్తుంటే దేశీయ సంస్థలు (డీఐఐ) మాత్రం మార్కెట్‌ను ఆదుకుంటున్నాయి. గత ఆరు నెలల్లో ఈ సంస్థలు దాదాపు రూ.4 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేసినట్టు అంచనా. డీఐఐలు ఆదుకోకపోతే సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలకు లోనయ్యేవి.

సత్తా చాటిన రంగాలు: గత ఆరు నెలల్లో ఆటో మొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్ కంపెనీల షేర్ల మాత్రం మదుపరులకు మంచి లాభాలే పంచాయి. ఐటీ, సిమెంట్, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లు మాత్రం బేర్‌మంటున్నాయి. ఐటీ ఇండెక్స్ దాదాపు తొమ్మిది శాతం నష్టపోయింది.

బంగారం...14 సంవత్సరాల్లో అత్యుత్తమ నెలవారీ వృద్ధి



ముంబై: బంగారం, వెండి ధరలు తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోతూనే ఉన్నాయి. మంగళవారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర మరో రూ.500 పెరిగి రూ.1.20 లక్షలకు చేరింది. ఆభరణాల బంగారం (99.5%) సైతం రూ.500 పెరిగి 1,19,400 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.500 పెరిగి రూ.1,50,500 స్థాయిని తాకింది. స్వల్పకాలిక ఫండింగ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో ప్రభుత్వ షట్ డౌన్ తప్పకపోవచ్చునన్న భయాలు ఇన్వెస్టర్ల దృష్టిని ఈక్విటీల నుంచి బులియన్ వైపు ఆకర్షించేందుకు దోహదపడ్డాయి. బంగారం ధరలకు ఇది 14 సంవత్సరాల కాలంలో అత్యుత్తమ నెలవారీ వృద్ధి అని చెబుతున్నారు. సెప్టెంబరు నెలలో బంగారం ధర 11.4% పెరిగింది. 2011 ఆగస్టులో నమోదైన అత్యధిక నెలవారీ వృద్ధి 15% తర్వాత ఒక నెలలో ధర ఈ స్థాయిలో పెరగడం ఇదే ప్రథమం. అయితే అంతర్జాతీయ విపణిలో ధరలు మాత్రం రికార్డు స్థాయిల నుంచి దిగజారాయి. స్పాట్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 0.55% దిగజారి 3813.14 డాలర్ల వద్ద స్థిరపడింది. వెండి ధర కూడా 1.51% దిగజారి ఔన్సు 46.22 డాలర్లు పలికింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో పసిడి మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు పసిడి ధర 23.5 శాతం పెరిగింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,310 ▲	1,08,450 ▲	1,61,000 ▲
విజయవాడ	1,19,000 ▼	1,12,000 ▼	1,46,500 ▼
విశాఖపట్నం	1,19,240 ▲	1,08,450 ▲	1,61,000 ▲
రాజమండ్రి	1,17,400 ▲	1,07,650 ▲	1,49,300 ▲
ప్రొద్దుటూరు	1,22,100 ▲	1,12,330 ▲	1,50,000 ▲
ముంబై	1,15,450 ▼	1,05,660 ▼	1,42,434 ▼

ఎల్ఐసీ ఎండీగా ఆర్.చందర్

ఎఫ్ఎస్ఐబీ సిఫారసు ● రెండు బ్యాంకులకు కొత్త సారథులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో డైరెక్టర్లను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ).. జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవికి ఆర్. చందర్‌ను సిఫారసు చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక పదవి కోసం మొత్తం ఐదుగురు అభ్యర్థులను బోర్డు ఇంటర్వ్యూ చేయగా, వారి పనితీరు, సమగ్ర అనుభవం, నియామక ప్రమాణాల ఆధారంగా చందర్‌ను ఎంపిక చేసినట్లు ఎఫ్ఎస్ఐబీ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామక వ్యవహారాల కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది.

యూనియన్ బ్యాంక్ సీఈఓగా ఆశీష్ పాండే: రెండు ప్రభుత్వరంగ బ్యాంకులకు కొత్త సారథులను ప్రభుత్వం నియమించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓగా ఆశీష్ పాండేను, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధిపతిగా కల్యాణ్ కుమార్‌ను మూడు సంవత్సరాల కాలానికి నియమించింది. పాండే ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పనిచేస్తుండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉన్న కల్యాణ్ కుమార్, జూలైలో పదవీ విరమణ చేసిన ఏం.వీ రావు స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇ-కామర్స్ సంస్థలపై ప్రభుత్వ నిఘా

జీఎస్‌టీ తగ్గింపు అమలుపై ఆరా

న్యూఢిల్లీ: జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారులకు చేరాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా ఇ-కామర్స్ సంస్థలు రోజువారీ వినియోగంలో ఉన్న దాదాపు 54 వస్తువుల ధరలను తగ్గించిందీ లేనిదీ నిశితంగా గమనిస్తోంది. ఇందుకోసం ఆ సంస్థల అమ్మకాల పైనా నిఘా పెట్టినట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఇప్పటికే దాదాపు ప్రతి ప్రధాన ఎఫ్ఎంసీజీ కంపెనీ జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్టు ప్రకటించాయి. అయితే ఆన్‌లైన్‌లో కొన్ని కంపెనీలు ఇంకా ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయలేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అలైడ్ బ్లెండర్స్ పెట్ బాటిల్స్ యూనిట్ ప్రారంభం

రూ.115 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ వనపర్తి జిల్లాలోని రంగాపూర్ వద్ద ప్రముఖ దేశీయ మద్యం తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ లిమిటెడ్ (ఏబీడీ) ఏర్పాటు చేసిన పెట్ బాటిల్స్ తయారీ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించింది. రూ.115 కోట్ల పెట్టుబడితో ఏటా 60 కోట్ల పెట్ బాటిల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు కంపెనీ ఎండీ అలోక్ గుప్తా చెప్పారు. దీంతో తమ కంపెనీకి చెందిన అన్ని యూనిట్ల పెట్ బాటిల్స్ అవసరాలు తీరతాయన్నారు. రంగాపూర్‌లో కంపెనీ ఇప్పటికే ఒక డిస్టిలరీ, బాట్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ సమగ్ర యూనిట్‌లో సింగిల్ మాల్ట్ ప్లాంట్ ఏర్పాటు కూడా పూర్తవుతుందన్నారు. దీంతో ప్రపంచంలో ఇదే తొలి సమగ్ర మద్యం తయారీ ప్లాంట్ అవుతుందని గుప్తా చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏబీడీకి అతి పెద్ద మార్కెట్లన్నారు.

బిజినెస్

చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లు యథాతథం

న్యూఢిల్లీ: చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను ప్రభుత్వం మరోసారి యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే త్రైమాసికంలో ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీరేట్లే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించింది. చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించడం ఇది వరుసగా ఏడో సారి.

ముఖ్య పథకాలపై ప్రస్తుత వడ్డీ రేట్లు

పథకం పేరు	వడ్డీ రేటు
సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)	8.2 %
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ)	7.7 %
కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)	7.5 %
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎమ్ఐఎస్)	7.4 %
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)	7.1 %
3-సంవత్సరాల టర్మ్ డిపాజిట్	7.1 %
పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్	4 %

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	117
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	122	అనంతపురం	107
గోదావరి	117		

ఆంధ్రా యువతిపై తమిళ ఖాకీల అత్యాచారం

ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణం

దర్శనానికి వెళ్తున్న అక్కాచెల్లెళ్లను వాహనంలో నుంచి దింపి బైక్‌పై తీసుకెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లు

అక్కను బెదిరించి చెల్లెలిపై అత్యాచారం

ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

'చిత్తూరు' అటవీశాఖ పార్కులో ఒంటరి జంటను బెదిరించి ఘాతుకం

12



బుధవారం | 1-10-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**



వెల్‌కం.. ఎయిర్ బస్!



మంగళవారం ఢిల్లీలో ఎయిర్ బస్ చైర్మన్, ఎండీ, ఇతర బోర్డు సభ్యులతో రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

పెట్టుబడులతో ఏపీకి రండి 11

దిగ్గజ సంస్థకు మంత్రి లోకేశ్ ఆహ్వానం

ప్రపంచ స్థాయి తయారీ కేంద్రం పెట్టండి

పూర్తిగా సహకరిస్తాం.. ప్రధాన యూనిట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌నూ ఏర్పాటు చేయండి

ఎయిర్ బస్ బోర్డు ముందు మంత్రి ప్రతిపాదన

ఢిల్లీలో ఆ సంస్థ చైర్మన్, ఎండీలతో భేటీ

రండి.. చూడండి

ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి: సీఎం

ఏపీలో అపార అవకాశాలు.. మాకు సుదీర్ఘ తీరప్రాంతం

పరిశ్రమలకు అనుకూల విధానాలు

నైపుణ్యం కలిగిన యువశక్తి.. 'స్పీడ్'గా అనుమతులు

విశాఖ భాగస్వామ్య సదస్సుకు తరలిరండి

ఢిల్లీ సీఐఐ సదస్సులో ముఖ్యమంత్రి పిలుపు

సంస్కరణల శిల్పి చంద్రబాబు: కేంద్ర మంత్రి పీయూష్



సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, కేంద్రమంత్రి పీయూష్ గోయల్

రాష్ట్రానికి పెద్దఎత్తున మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మా రాష్ట్రాన్ని సందర్శించిన తర్వాతే పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరుతున్నాను. పెట్టుబడులను ఆకర్షించడంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, ఏరో స్పేస్ హబ్‌లు మా ప్రాధాన్య రంగాలు.

\- ముఖ్యమంత్రి చంద్రబాబు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): "మా రాష్ట్రానికి రండి. మా విధానాలు పరిశీలించండి. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రమని అన్నారు. సుదీర్ఘ తీరప్రాంతం, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలతో కూడిన పెట్టుబడి-స్నేహపూర్వక వాతావరణం, సాంకేతిక నైపుణ్యం కలిగిన యువశక్తి వంటివి రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతులిస్తామని తెలిపారు. వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను, ప్రత్యేక ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలని

మిగతా 11వ పేజీలో...

అమెరికా వద్దన్నదని ఆగాం!



ముంబై దాడులకు ప్రతీకారం చేద్దామనుకున్నాం

పాకిస్థాన్‌తో యుద్ధంపై ప్రధానితో చర్చించాను

మన్మోహన్ సింగ్ కూడా సుముఖత చూపారు

అయితే, అమెరికా ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది

ఆ దాడుల సమయంలో 'హోం' బాధ్యతలు అయిష్టంగానే స్వీకరించా: చిదంబరం

దాడుల నిర్ణయాన్ని అడ్డుకుంది సోనియానా?

నిలదీసిన బీజేపీ నాయకులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: ముంబై ముట్టడి తర్వాత పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుందామనుకున్నా అమెరికా వారించడంతో ఆగిపోయామని మాజీ హోంమంత్రి పి.చిదంబరం తెలిపారు. అప్పట్లో తననూ, ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్‌నూ ఒప్పించడానికి నాటి అమెరికా విదేశాంగ మంత్రి కండోలిజా రైస్ భారత్‌కు వచ్చారని పేర్కొన్నారు. పాక్‌పై దాడులు చేయొద్దని ఆమె కోరారని, అలాగే అంతర్జాతీయంగానూ తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఓ ఆంగ్ల చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చిదంబరం తెలిపారు. 2008 నవంబరు 26న ముంబైలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఉగ్ర దాడుల్లో 175 మంది మరణించారు. ఈ ఘటన జరిగిన వెంటనే అప్పటి కేంద్ర హోంమంత్రి శివరాజ్‌పాటిల్ రాజీనామా చేయగా, చిదంబరం ఆ బాధ్యతలు స్వీకరించారు. "అప్పట్లో యుద్ధాన్ని నివారించడం కోసం ప్రపంచమంతా ఢిల్లీపై వాలింది. నేను బాధ్యతలు

మిగతా 2వ పేజీలో...

హమాస్‌కు డెడ్‌లైన్

శాంతి ప్రణాళికపై 3-4 రోజుల్లో స్పందించాలి

లేదంటే వారి కథ విషాదాంతమే

అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

'గాజా' శాంతి ప్రణాళికను స్వాగతించిన ప్రధాని మోదీ

ఎనిమిది అరబ్, ముస్లిం దేశాలు కూడా..

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. హమాస్‌కు డెడ్‌లైన్ విధించారు. తాను ప్రతిపాదించిన 21 సూత్రాల శాంతి ప్రణాళికపై స్పందించేందుకు హమాస్‌కు మూడు నుంచి నాలుగు రోజులు గడువిస్తున్నానని

మిగతా 2వ పేజీలో...

'పూర్వోదయ' నిధులివ్వండి

వెనుకబడ్డ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఆ నిధులే కీలకం

నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు వినతి.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తోనూ భేటీ.. పోలవరం పురోగతిని వివరించిన సీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్రానికి పూర్వోదయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాల్సిందిగా కేంద్రమంత్రిని ఆయన కోరారు. మంగళవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా నిర్మలను ఆమె కార్యాలయంలో చంద్రబాబు కలిసి, వినతిపత్రం ఇచ్చారు. "పూర్వోదయ పథకం కింద బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశాతోపాటు ఆంధ్రప్రదేశ్‌ను కూడా కేంద్రం ఎంపిక చేసింది. ఈ పథకం నిధులతో ఏపీలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు; కోస్తాంధ్రలో ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించాం" అని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకం నిధులను కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ పథకం రాష్ట్రంలో వెనుకబడిన

మిగతా 11వ పేజీలో...



అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

రాజకీయ పరిణామాలు, అభివృద్ధిపై 45 నిమిషాలపాటు చర్చించిన సీఎం 11



2

68.5 లక్షల ఓట్లు తొలగింపు

బిహార్‌లో ఓటర్ల తుది జాబితా వెల్లడి

కొత్తగా 21.53 లక్షల ఓటర్ల నమోదు

మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు



2

భారత ఔషధాలపై సుంకాలు

ఎత్తేసిన చైనా

30 శాతంగా ఉన్న దిగుమతి సుంకం పూర్తిగా తొలగింపు

అమెరికా నిర్ణయాల వేళ భారత ఫార్మా రంగానికి ఊరట



చెప్పలేని రీతిలో

పాక్ స్లెడ్జింగ్

నా ఏకాగ్రతను దెబ్బతీయాలని చూశారు

నేను ఆవేశపడి ఒక్క చెత్త షాట్ ఆడినా ఫలితం తారుమారయ్యే ముప్పు.. అందుకే సంయమనం వహించా

తొలుత ఒత్తిడికి లోనైనా పట్టుదలగా ఆడా

ఆరునూరైనా భారత్‌ను గెలిపించాలనుకున్నా

నా రెండు టీ-20 సెంచరీల కన్నా ఈ 69 పరుగులు మిన్న

పాకిస్థాన్‌ను ఓడించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను 11

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నేను ఆరాధించే కోహ్లీతో పోలికను గౌరవంగా భావిస్తున్నా

ఆయన అడుగుజాడల్లో నడుస్తా..

'ఆంధ్రజ్యోతి'తో క్రికెటర్ తిలక్ వర్మ

చిన్న కాంట్రాక్టర్లకు శుభవార్త

రూ. 400 కోట్ల బిల్లుల చెల్లింపునకు ఓకే 2

జగన్ పాలనలో రైతు ఘోష

నెలకు 77 మంది చొప్పున బలవన్మరణం

2023లో 925 మంది రైతులు, కూలీలు మృతి

దేశంలోనే మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్

శ్మశానాలుగా సాగు భూములు: ఎన్‌సీఆర్‌బీ

మహిళల ఆత్మగౌరవ భంగంలో దేశంలోనే తొలి స్థానం 12



భారత ఔషధాలపై సుంకాలు ఎత్తేసిన చైనా

- 30 శాతంగా ఉన్న దిగుమతి సుంకం పూర్తిగా తొలగింపు
- అమెరికా నిర్ణయాల వేళ భారత ఫార్మా రంగానికి ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో భారత ఫార్మా రంగానికి ఊరటనిచ్చేలా చైనా కీలక ప్రకటన చేసింది. భారత్ నుంచి తమ దేశానికి దిగుమతయ్యే ఔషధాలపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. భారత్ నుంచి వచ్చే ఔషధాలపై ఇన్నాళ్లూ 30% దిగుమతి సుంకాన్ని వసూలు చేసిన చైనా ఇప్పుడు దానిని సున్నా చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో భారత ఫార్మా పరిశ్రమలు ఎలాంటి దిగుమతి సుంకాలు చెల్లించకుండానే తమ ఉత్పత్తులను చైనాకు ఎగుమతి చేసుకోవచ్చు. తమ దేశానికి దిగుమతయ్యే బ్రాండెడ్ ఔషధాలపై 100% దిగుమతి సుంకం విధిస్తామని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో చైనా తీసుకున్న ఈ నిర్ణయం భారత ఫార్మా రంగానికి కొత్త శక్తినిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చైనా నిర్ణయంతో భారత ఫార్మా రంగం మరింత విస్తరించనుందని, అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ మార్కెట్ రూపరేఖలు మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రపంచానికే ఫార్మసీగా పేరొందిన భారత్ నుంచి అందుబాటు ధరల్లో ఉండే జనరిక్ ఔషధాలు, టీకాలు పెద్ద ఎత్తున ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుంటాయి. దిగుమతి సుంకాలు అధికంగా ఉండడంతో ఇన్నాళ్లూ భారత ఫార్మా పరిశ్రమలు చైనాలో పరిమిత స్థాయిలో వ్యాపారం చేసేవి. ఇప్పుడు దిగుమతి సుంకాలు పూర్తిగా ఎత్తేయడంతో ప్రపంచంలోని రెండో అతి పెద్ద ఫార్మాస్యూటికల్ మార్కెట్ అయిన చైనాలో భారత పరిశ్రమలు ధర, నాణ్యత అంశాల్లో ఇతరులతో పోటీ పడే అవకాశం ఏర్పడింది. చైనా తీసుకున్న విధానపరమైన నిర్ణయం భారత్, చైనా మధ్య వాణిజ్య సంబంధాల్లో సమతుల్యత తీసుకువస్తుందని, నూతన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ఫార్మా పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

లద్దాఖ్‌ను దగా చేసిన మోదీ సర్కార్

- పోలీసు కాల్పులపై న్యాయ విచారణ జరిపించాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: లద్దాఖ్‌ను మోదీ సర్కారు దగా చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఉద్యమకారులపై పోలీసులు జరిపిన కాల్పులపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. పోలీసు కాల్పుల్లో నలుగురు మరణించారని, అందులో ఒకరు కార్గిల్ పోరాట వీరుడు ఉండడం మరింత విషాదకరమని పేర్కొంది. కార్గిల్‌లో యుద్ధంలో పాల్గొన్న సెవాంగ్ థార్చిన్ ప్రాణాలు కోల్పోయారని, ఆయన తండ్రి కూడా మాజీ సైనికుడేనని తెలిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో థార్చిన్ తండ్రి వీడియోను పోస్టు చేశారు. లద్దాఖ్ విషాదం దేశమంతటికీ విషాదమని పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణ అమెరికా పర్యటనలో ఉన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా సామాజిక మాధ్యమాల్లో థార్చిన్ తండ్రి వీడియో పోస్టు చేశారు. 'తండ్రి సైన్యంలో పని చేశారు. కుమారుడు కూడా సైనికుడే. దేశభక్తి వారి రక్తంలో ఉంది. కానీ బీజేపీ ప్రభుత్వం భారత మాత వీర కుమారుడిని కాల్చి చంపింది. కారణం..లద్దాఖ్ హక్కుల కోసం నిలబడడమే. బాధతో నీరు నిండిన ఆ తండ్రి కళ్లు ఒకే ప్రశ్న అడుగుతున్నాయి...దేశ సేవకు ఇదా ప్రతిఫలం అని.." అంటూ హిందీలో పోస్టు పెట్టారు.

బీజేపీ సీనియర్ నేత విజయ్ కుమార్ మల్హోత్రా కన్నుమూత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా(93) సోమవారం ఉదయం ఢిల్లీలో కన్నుమూశారు. కొంతకాలంగా వయసు సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందారు. బీజేపీకి ఒకప్పుడు ఢిల్లీలో పెద్దదిక్కుగా వ్యవహరించిన ఆయన, తన రాజకీయ జీవితంలో పలు కీలక స్థానాల్లో సేవలందించారు. ఐదు సార్లు ఎంపీగా, రెండు సార్లు ఢిల్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై పోటీ చేసి గెలవడం ఆయన రాజకీయ జీవితంలో ముఖ్య ఘట్టంగా నిలిచింది. 2008 ఢిల్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, ఆ ఎన్నికల్లో షీలా దీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రజల సందర్శనార్థం మల్హోత్రా పార్థివ దేహాన్ని బుధవారం ఢిల్లీలోని పండిత్ మార్గ్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఉంచనున్నారు. మల్హోత్రా మృతి పట్ల ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సంతాపం వ్యక్తం చేశారు.

పాక్‌లోని క్వెట్టాలో కారుబాంబు పేలుడు

- 14 మంది మృతి.. 32 మందికి గాయాలు

క్వెట్టా/పెషావర్, సెప్టెంబరు 30: పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా నగరంలో సంభవించిన భారీ కారుబాంబు పేలుడులో 14 మంది మరణించారు. 32 మందికి పైగా గాయపడ్డారు. మంగళవారం ఫ్రాంటియర్ కాన్‌స్టాబ్యులరీ (పారామిలిటరీ) దళాల ప్రధాన కార్యాలయం సమీపంలో ఈ దాడి జరిగింది. పేలుడు అనంతరం కాల్పుల శబ్దం కూడా వినిపించడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు ధాటికి సమీపంలోని ఇళ్లు, భవనాల కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ పేలుడుకు సంబంధించి ఇప్పటివరకు ఏ గ్రూపు బాధ్యత వహించలేదు. మరోవైపు.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన రెండు వేర్వేరు బాంబు పేలుళ్ల ఘటనల్లో నలుగురు మిలిటెంట్లు సహా తొమ్మిది మంది మరణించారు. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న సౌత్ వజీరిస్థాన్ జిల్లాలో మంగళవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

తొలిసారి లైంగిక సంపర్కం పేరిట

వాట్సాప్ గ్రూపులో పోస్టు

- రూ.20లక్షలకు బాలిక విక్రయానికి యత్నం
- దుశ్చర్యకు పాల్పడిన దంపతుల అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తొలిసారి లైంగిక సంపర్కం పేరిట వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టి మరీ పన్నెండేళ్ల బాలికను విక్రయానికి ఉంచిన దంపతులకు బేడీలు పడ్డాయి. బెంగళూరుకు చెందిన శోభ, తులసికుమార్ దంపతులు మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బాలికను విక్రయానికి ఉంచారు. రూ.20 లక్షలు ఇచ్చినవారికి బాలికను అప్పగిస్తామని వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మైసూరుకు చెందిన ఒడనాడి సేవా సంస్థ ప్రతినిధులు వారిని సంప్రదించారు. తాము రూ.20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధమని, బాలికను మైసూరుకు తీసుకురావాలని సూచించారు. వారు అంగీకరించగానే బెంగళూరులోని విజయనగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, సంస్థ ప్రతినిధులు జాయింట్ ఆపరేషన్ చేశారు. పోలీసులు ఆ దంపతులను అరెస్టు చేశారు.

చిన్న కాంట్రాక్టర్లకు శుభవార్త

రూ.400 కోట్ల బిల్లుల చెల్లింపునకు ఓకే

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పండుగ వేళ చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2014-19 మధ్యకాలంలో పనులు చేసి.. రూ.5 కోట్లలోపు ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉన్న వారికి, 2019 తర్వాత పనులు చేసి రూ.5 లక్షల్లోపు పెండింగ్ బిల్లులున్న కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. వీటి విలువ రూ.400 కోట్లు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2014-19 మధ్యకాలంలో చేసిన పనుల పెండింగ్ బిల్లులను చెల్లించలేదు. అలాగే తన ఐదేళ్ల హయాంలో రూ.1.35 లక్షల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచింది. ఇప్పుడీ బిల్లులను చంద్రబాబు ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తోంది. ఇప్పటి వరకు దాదాపు రూ.25,000 కోట్ల వరకు చెల్లించింది. సంక్రాంతి సమయంలోనూ చిన్న కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేసింది. ఇప్పుడు దసరాకూ చెల్లించబోతోంది.

అఫ్ఘానిస్థాన్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం!

- దేశవ్యాప్తంగా మొబైల్ సర్వీసులూ బంద్
- అనైతిక కార్యకలాపాలను నిరోధించే పేరుతో తాలిబన్ సర్కార్ కఠిన చర్యలు

కాబూల్/ఇస్లామాబాద్, సెప్టెంబరు 30: తాలిబన్ల పాలనలోని అఫ్ఘానిస్థాన్‌లో దేశవ్యాప్తంగా దాదాపు అన్ని మొబైల్ ఫోన్లు మూగబోయాయి. ఇంటర్నెట్ సదుపాయం బంద్ అయింది. దేశంలో అనైతిక కార్యకలాపాలను నిరోధించేందుకు తాలిబన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలే ఇందుకు కారణం! దేశవ్యాప్తంగా సోమవారం నుంచి మొబైల్ ఫోన్ సర్వీసులు, ఇంటర్నెట్ నిలిచిపోగా.. మంగళవారం కూడా కొనసాగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ పేమెంట్లు, విమాన సర్వీసులు, ఆన్‌లైన్ విద్య వంటి వాటిపై ప్రభావం పడింది. ఈ షట్‌డౌన్ తదుపరి నోటీసులు వచ్చే వరకు అమల్లో ఉంటాయని ఒక ప్రభుత్వాధికారి పేర్కొన్నట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ నివేదించింది. అయితే సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన ఇంటర్నెట్ షట్‌డౌన్‌కు తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా కారణంగా చెప్పాల్సిఉంది. తాలిబన్లు సెప్టెంబరు మధ్య నుంచే ఇంటర్నెట్‌పై నియంత్రణ చర్యలు చేపట్టారు. వీటి ప్రభావం టెలిఫోన్ సేవలపై కూడా పడింది. కాగా, దేశవ్యాప్త ఇంటర్నెట్ షట్‌డౌన్ నేపథ్యంలో అఫ్ఘాన్‌లో ప్రధానమైన కాబూల్ విమానాశ్రయం స్తంభించిపోయింది. రాజధానిలోని ఎయిర్‌పోర్టు దాదాపు నిర్మానుష్యంగా కనిపించిందని, ఇక్కడకు వచ్చే లేదా ఇతర చోట్లకు వెళ్లే విమానాలు కనిపించలేదని స్థానికుడు ఒకరు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, టెలీ కమ్యూనికేషన్ సేవలను పునరుద్ధరించాలని అఫ్ఘానిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి మిషన్ తాలిబన్ ప్రభుత్వాన్ని కోరింది.

లోకం తీరు



మనమే రూటు మారుద్దాం!

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో భారత్‌లోని జీసీసీలవైపు అమెరికా దిగ్గజ కంపెనీల చూపు

- ఇక్కణ్నుంచీ కార్యకలాపాలను పెంచే ప్రణాళికలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అనుకున్నదే అవుతోంది. భారత్‌ను బెదిరించడానికో.. లేక నిజంగానే అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలపడానికో.. అమెరికన్లకే ఎక్కువగా ఉద్యోగాలు రావాలనే ఉద్దేశంతోనో.. హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం బెడిసికొడుతున్నట్టు కనిపిస్తోంది! ఎందుకంటే.. వ్యాపారాలకు సెంటిమెంట్లు కాదు.. లాభాలే ముఖ్యం. ఈ క్రమంలోనే.. చాలా వరకూ అమెరికా కంపెనీలు ఈ అడ్డంకిని అధిగమించేందుకు దారులు వెతుకుతున్నాయి. 'ట్రంప్ ఇక్కడికి ఉద్యోగుల్ని రానివ్వకపోతే.. మనమే ఉద్యోగులు ఎక్కువగా దొరికే చోటుకు వెళ్దాం' అనుకుంటున్నాయి. అందులో భాగంగా.. భారత్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీల) నుంచి (ఆఫ్‌షోర్) కార్యకలాపాలను క్రమంగా పెంచుతున్నాయి. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో సగానికిపైగా.. అంటే 1700 జీసీసీలు ఒక్క భారతదేశంలోనే ఉన్నాయి. ఐటీ, కృత్రిమ మేధ నుంచి ఔషధాలు, టీకాల అభివృద్ధి దాకా ఎన్నో రంగాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజ సంస్థల గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు మనదేశంలో ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, పుణె, గుర్గావ్ వంటి నగరాలు ఈ జీసీసీలకు కేంద్రాలుగా ఉన్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గోల్డ్‌మ్యాన్ శాక్స్, జేపీ మోర్గాన్, షెల్, జీసీ, సీమన్స్, బోష్ వంటి దిగ్గజ సంస్థలు మనదేశంలో పెద్ద ఎత్తున జీసీసీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అమెజాన్‌కైతే ప్రపంచంలోనే అతిపెద్ద జీసీసీ మనదేశంలోనే (అమెజాన్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్) ఉంది. జీసీసీలంటే కేవలం ఔట్‌సోర్సింగ్ కేంద్రాలు కావు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ నుంచి అత్యంత అధునాతన పరిశోధనల దాకా అన్ని కార్యకలాపాలూ జరుగుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలను నిరంతరాయంగా నిర్వహించుకోవడానికి కంపెనీలు ఏర్పాటు చేసుకునే వ్యవస్థలివి. బెంగళూరులో అత్యధికంగా ఐటీ జీసీసీలు ఉండగా.. హైదరాబాద్‌లో టెక్నాలజీ, డేటా, ఏఐ కంపెనీలకు సంబంధించిన జీసీసీలున్నాయి. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు కలిగిన సిబ్బంది దొరకడం భారత్‌లో సులువు కాబట్టే కంపెనీలు వాటిని ఇక్కడ ఏర్పాటుచేస్తున్నాయి. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో.. ఇప్పుడా కంపెనీలన్నీ తమ కార్యకలాపాలను ఈ జీసీసీల ద్వారా మరింత విస్తరించుకునే ప్రణాళికల్లో ఉన్నాయని డెలాయిట్ ఇండియాకు చెందిన రోహన్ లోబో తెలిపారు. నిజానికి ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజుల పెంపు నిర్ణయంతో సంబంధం లేకుండానే భారత్‌లోని జీసీసీల సంఖ్య భారీగా పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయని.. 2030 నాటికి ప్రపంచంలోని 2200 కంపెనీల జీసీసీలు ఇండియాలో ఏర్పాటవుతాయని, జీసీసీ మార్కెట్ విలువ 10 వేలకోట్ల డాలర్లకు (దాదాపు రూ.9 లక్షల కోట్లకు) చేరుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో అది ఇంకా జోరందుకునే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు.

ఫిబ్రవరిలోగానే హెచ్1బీలో గణనీయ మార్పులు

- లాటరీ విధానంతో వారిని తెచ్చుకోవడం ఏంటి?
- అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ వ్యాఖ్యలు

న్యూయార్క్, సెప్టెంబరు 30: హెచ్1బీ వీసాలపై అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరిలోగానే హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియలో పలు గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. చౌకైన టెక్ నిపుణుల కోసం ఈ వీసాలు జారీ చేయడం అనే ఆలోచన తప్పు అని, వారితో పాటు వారి కుటుంబాలు కూడా దేశంలోకి వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ వీసాల జారీ ప్రక్రియపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్1బీలో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. న్యూస్‌నేషన్ మీడియాతో లుట్నిక్ మాట్లాడుతూ, కొత్త నిబంధనలు ఫిబ్రవరి 2026 నుంచి అమల్లోకి వచ్చే లోగానే పలు గణనీయమైన మార్పులు ఉంటాయని, వీసాల జారీలో పలు వైవిధ్యమైన మార్పులు చూస్తారని చెప్పారు. లక్ష డాలర్ల ఫీజుతోనైనా వీసాదారులతో దేశం నిండిపోకుండా ఉండాలన్నారు. నైపుణ్యం ఉన్న వాళ్లని లాటరీ విధానంతో తెచ్చుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఆ విధానంలోనూ మార్పులు ఉంటాయన్నారు. హెచ్1బీ కేవలం టెక్ నిపుణుల కోసమే ఉన్నట్లుందని, వాటిలో 74% వారే ఉన్నారని వివరించారు. డాక్టర్లు, విద్యానిపుణులు కేవలం 4% మాత్రమే ఉన్నట్లు చెప్పారు. ఉన్నత డిగ్రీలున్న డాక్టర్లు, విద్యా నిపుణులు ఎక్కువగా రావాల్సి ఉందన్నారు. కానీ కంపెనీలు ఇంజనీర్లను మాత్రమే నియమించుకోవాలని అనుకుంటే అధిక జీతం పొందే వారిని మాత్రమే తెచ్చుకోవాలని లుట్నిక్ స్పష్టం చేశారు.

హమాస్‌కు డెడ్‌లైన్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'హమాస్ ఒప్పుకుంటుందా సరే.. లేదంటే వారి కథ విషాదాంతమే అవుతుంద'ని హెచ్చరించారు. గాజా యుద్ధానికి ముగింపు పలికేందుకు ట్రంప్ ఈ ప్రణాళికను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. హమాస్ ఆయుధాలను వదిలేయడం, 72 గంటల్లో బందీలను విడిచిపెట్టడం, గాజా నుంచి ఇజ్రాయెల్ దళాలవారీగా వైదొలగడం, గాజా పునర్నిర్మాణానికి చర్యలు ట్రంప్ ప్రణాళికలో ప్రధాన ప్రతిపాదనలు. ఈ ప్రణాళికను శ్వేత సౌధంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమక్షంలో ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇప్పటికే ఇజ్రాయెల్‌తో పాటు అరబ్, ముస్లిం దేశాలు అంగీకరించాయని, హమాస్ స్పందనకోసం ఎదురుచూస్తున్నామని ట్రంప్ తెలిపారు. అయితే ట్రంప్ ప్రణాళికపై అధ్యయనం చేసిన తర్వాత స్పందిస్తామని హమాస్ ప్రకటించింది. ట్రంప్ డెడ్‌లైన్ విధించకముందు హమాస్ ప్రకటన వెలువడింది. ఇదిలా ఉండగా.. ట్రంప్ ప్రణాళికను ప్రధాని మోదీ స్వాగతించారు. అది పశ్చిమాసియాలో శాంతి నెలకొనడానికి బాట వేయడంతో పాటు పాలస్తీనా, ఇజ్రాయెల్ ప్రజల భద్రతకు, అభివృద్ధికి దోహదపడుతుందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అన్ని భాగస్వామ్య పక్షాలు ట్రంప్ వెనక కలసికట్టుగా నిలబడతాయని, యుద్ధానికి ముగింపు పలికేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నానికి మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. మోదీ స్పందనపై ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ హర్షం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రణాళికతో భారత్ వంటి దేశాలు తమ ప్రాంతంలో పునర్నిర్మాణ కార్యకలాపాలు చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. మరోవైపు, 8 అరబ్, ముస్లిం దేశాలు కూడా ట్రంప్ ప్రణాళికను స్వాగతించాయి. ఈ మేరకు జోర్డాన్, ఖతార్, యూఏఈ, ఇండోనేషియా, పాకిస్థాన్, తుర్కియే, సౌదీ, ఈజిప్టు విదేశాంగ మంత్రులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో అమెరికాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ట్రంప్ కృషి విజయవంతం కావాలని ఆశిస్తున్నట్టు రష్యా తెలిపింది. గాజా యుద్ధంలో ఇప్పటికే 66 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

ఆ 14 మంది చిన్నారుల మృతికి మెదడువాపు వ్యాధే కారణమా?

- తీవ్ర జ్వరం, కిడ్నీల వైఫల్యంతో మరణాలు
- ఏఈఎస్‌గా అనుమానిస్తున్న నిపుణులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్, మధ్యప్రదేశ్‌లోని చింద్వారా ప్రాంతంలోని ఆస్పత్రుల్లో చేరిన 15 ఏళ్లలోపు చిన్నారుల్లో 14 మంది మృతిచెందడం తీవ్ర చర్చనీయాంశమైంది. తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరిన కొన్ని గంటల్లోనే వారి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. కొందరు స్పృహ కోల్పోయారు. చాలామందికి కిడ్నీలు ఫెయిలయ్యాయి. దీంతో వారిని వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో చింద్వారాలోని గ్రామీణ ప్రాంతమైన పరాసియా నుంచి వచ్చిన ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారంతా 3 నుంచి 10 ఏళ్లలోపు వారే. కాగా, ఈ మరణాలకు అక్యూట్ ఎన్సెఫాలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. మెదడు అకస్మాత్తుగా వాపునకు గురైనప్పుడు లేదా పనిచేయడం ఆగిపోయినప్పుడు ఏఈఎస్‌గా భావిస్తారు. అయితే ఈ ప్రాంతంలో ఈ తరహా మరిన్ని కేసులు వెలుగు చూస్తుండడంతో జాతీయ బృందాలు రంగంలోకి దిగాయి. చింద్వారా ప్రాంతాన్ని ప్రస్తుతం హై అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. కాగా, బాధితులకు నిర్వహించిన సెరెబ్రోస్పానియల్ ఫ్లూయిడ్ (సీఎస్ఎఫ్), రక్త పరీక్షల్లో ఏఈఎస్‌కు కారణమయ్యే బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లు ఏమీ కనిపించలేదు. దీంతో జ్వరాల వ్యాప్తికి సరైన కారణాన్ని నిర్ధారించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (పుణె), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) బృందాలను ఇక్కడకు పంపారు.

68.5 లక్షల ఓటర్ల తొలగింపు

- బిహార్‌లో ఓటర్ల తుది జాబితా వెల్లడి
- కొత్తగా 21.53 లక్షల ఓటర్ల నమోదు
- మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు



బిహార్ ఓటర్ల జాబితా 2025:

- తొలగించిన పేర్లు: 65 లక్షలు (ముసాయిదా జాబితా)
- కొత్తగా తొలగించిన ఓటర్లు: 3.66 లక్షలు (ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత)
- మొత్తం ఓటర్ల తొలగింపు: 68.5 లక్షల మంది
- కొత్తగా జత కలిసిన ఓటర్లు: 21.53 లక్షల మంది
- నికరంగా తగ్గిన ఓటర్లు: 46.97 లక్షల మంది

న్యూఢిల్లీ/పట్నా, సెప్టెంబరు 30: వచ్చే నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దాదాపు 68.5 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించింది. గత జూన్ 24న 7.89 కోట్ల మంది ఓటర్లుండగా, మంగళవారం ప్రకటించిన తుది జాబితాలో 7.42 కోట్ల మందే ఉన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తుది జాబితాలోనూ మరో 3.66 లక్షల మంది పేర్లను తొలగించడంతోపాటు కొత్తగా 21.53 లక్షల మందిని జత చేసింది. కేంద్రంలోని అధికార బీజేపీ ఆదేశాల మేరకే బిహార్‌లో పౌరసత్వ తనిఖీ తరహాలో ఎస్ఐఆర్ నిర్వహిస్తోందని విపక్షాలు దుమ్మెత్తిపోశాయి. కానీ, ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దీంతో పౌరసత్వ తనిఖీ తరహాలో ఎస్ఐఆర్‌ను ఈసీ నిర్వహిస్తోందని, దీనికి చట్టబద్ధత ఉందా? అని సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. కాగా, 3 నెలలు సాగిన ఎస్ఐఆర్ తర్వాత గత ఆగస్టు ఒకటో తేదీన ప్రకటించిన ఓటర్ల జాబితాలో 65 లక్షల మందిని తొలగించింది. మృతులు, శాశ్వతంగా ఇల్లు మారిన వారు, పలు చోట్ల పేర్లు నమోదు చేసుకున్న వారు, జాడ తెలియని వారి పేర్లను పోలింగ్ బూత్ స్థాయి అధికారుల నిర్ధారణతో తొలగించినట్లు ఈసీ పేర్కొంది. ఇక, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రకటించే అనుబంధ జాబితాతో తుది ఓటర్ల జాబితాలో స్వల్పంగా మార్పులు చేర్పులుండొచ్చునని ఈసీ వివరించింది. ఎస్ఐఆర్‌లో భాగంగా ఈసీ ఆదేశాల ప్రకారం 7.89 కోట్ల మంది ఓటర్ల జాబితాలో 2003 తర్వాత ఓటర్లుగా నమోదైన వారు పౌరసత్వంతోపాటు తమ అర్హతలను రుజువు చేసే పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టనున్నట్లు గత జూన్ 24న ప్రకటించిన ఈసీ.. తొలుత వచ్చే నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో ప్రారంభించింది. రెండు దశాబ్దాలుగా వార్షిక ఓటర్ల సవరణ మినహా తాజా ఓటర్ల జాబితాను రూపొందించేందుకే ఎస్ఐఆర్ చేపట్టామని గత జూన్ 24న ప్రకటించింది. దీనికి శరవేగంగా పట్టణీకరణ, తరచూ వలసలు, ఓటర్లుగా నమోదైన యువజనులు, మృతుల పేర్లు నివేదించకపోవడం, విదేశీ అక్రమ వలసదారుల పేర్ల నమోదు వంటి అంశాలు కారణాలని వివరించింది. ఈసీ ఆదేశాల ప్రకారం 1987 జూలై ఒకటో తేదీ నుంచి 2004 డిసెంబర్ రెండో తేదీ మధ్య జన్మించిన ఓటర్లు.. తమతోపాటు తల్లిదండ్రుల పత్రాలు సమర్పించాలి. ఈ నిబంధనలన్నీ 1955లోని పౌరసత్వ చట్టంలోనివే కావడం గమనార్హం. ఓటర్ల పౌరసత్వ తనిఖీకి ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం ప్రస్తుతం ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు వినియోగిస్తున్న ఫామ్-6 ప్రకారం పౌరసత్వ ధ్రువీకరణ అవసరం లేదు.

పట్నాలో పెరిగిన 1.63 లక్షల మంది ఓటర్లు

బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా జిల్లాలో కొత్తగా 1.63 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. పట్నా జిల్లాలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఆగస్టు ఒకటో తేదీన ప్రకటించిన 48.15 లక్షల మంది ఓటర్లకు ఇది అదనం. జిల్లాలో 22.75 లక్షల మంది మహిళా ఓటర్లు ఉండగా, డిఘా సెగ్మెంట్‌లో అధికంగా 4.56 లక్షల మంది ఉన్నారు.

కక్ష సాధించాలనుకుంటే.. నన్ను ఏమైనా చేయండి

- మా కార్యకర్తల జోలికి రావొద్దు
- తమిళనాడు సీఎం స్టాలిన్‌కు టీవీకే అధినేత విజయ్ విజ్ఞప్తి



చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో 41 మంది మృతి కారణమైన తొక్కిసలాట దుర్ఘటనపై 'తమిళగ వెట్రి కళగం(టీవీకే)' అధినేత విజయ్ ఎట్టకేలకు స్పందించారు. ఇలాంటి బాధాకరమైన స్థితిని తన జీవితంలో ఎన్నడూ చూసి ఎరుగనని, త్వరలోనే బాధితులను కలుసుకుంటానని చెప్పారు. కరూర్‌లో ఏం జరిగిందో ప్రజలు చూస్తూనే ఉన్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కక్ష సాధించాలనుకుంటే తనను ఏమైనా చేయాలని, కానీ తన అనుచరులను మాత్రం వదిలేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. తన రాజకీయ పయనం మరింత దృఢంగా, మరింత ధైర్యంగా కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం 4 నిమిషాల 45 సెకండ్ల నిడివి కలిగిన వీడియో సందేశాన్ని విజయ్ విడుదల చేశారు. "అందరికీ నమస్కారం. నా జీవితంలో ఇలాంటి బాధాకరమైన స్థితి ని చూసి ఎరుగను. హృదయమంతా ఒకటే బాధ. నామీద పెట్టుకున్న అభిమానానికి, ఆప్యాయతకు ప్రజలకు ధన్యవాదాలు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని మాకిచ్చిన స్థలంలోనే ప్రచారం చేశాం. ఈ విషయంలో మేమెలాంటి తప్పూ చేయలేదు. అయినా జరగకూడనిది జరిగిపోయింది" అని విజయ్ పేర్కొన్నారు. కాగా, తన అభిమాన నటుడిపై విమర్శలు రావడంతో తట్టుకోలేని టీవీకే నేత, విల్లుపురం జిల్లా వీరపట్టు గ్రామానికి చెందిన అయ్యప్పన్(50) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నారు.

అమెరికా వద్దన్నదని ఆగాం

(మొదటీ పేజీ తరువాయి)

తీసుకున్న రెండు, మూడు రోజులకు కండోలిజా భారత్‌కు వచ్చి నన్ను, ప్రధానిని కలిశారు. ఆ దాడులపై ప్రతిస్పందించొద్దని ఆమె విజ్ఞప్తి చేయగా, దీనిపై నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని నేను తెలిపాను. ప్రతీకారంగా ఏదో ఒకటి చేయాలని నాకు ఉంది. ఇదే విషయం ప్రధానితోను, తత్సంబంధ వ్యక్తులతోను చర్చించాను. ప్రధాని కూడా సానుకూలంగానే స్పందించారు. పాక్‌పై ఎప్పుడు దాడులు మొదలుపెట్టాలి..ఎలా ముగించాలనేది కూడా ఆయన చర్చించారు. అయితే, విదేశాంగశాఖ, ఐఎఫ్ఎస్ గట్టిగా పట్టుబట్టడంతో ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది" అని ఆయన గుర్తుచేసుకున్నారు. హోంమంత్రిగా తాను బాధ్యతలు తీసుకోవడం వెనుక నేపథ్యాన్ని ఆయన వివరించారు. "ఒకరోజు నాకు ప్రధాని మన్మోహన్‌సింగ్ ఫోన్ చేశారు. 'హోంమంత్రిగా మీరు బాధ్యతలు తీసుకోవాలని ఉమ్మడిగా మేం (సోనియా, మన్మోహన్) నిర్ణయించాం' అని తెలిపారు. అప్పటికి ఆర్థిక మంత్రిగా ఐదు బడ్జెట్‌లు సమర్పించి, మరో ఏడాదిలో ఎన్నికలకు వెళుతున్న సమయంలో శాఖ మారాలని నాకు లేదు. అయిష్టంగానే కొత్త బాధ్యతలు స్వీకరించాను" అని వివరించారు.

ఇప్పుడు వాపోతే ప్రయోజనమేంటి? : బీజేపీ

ముంబై దాడులపై స్పందించడంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం విదేశీ శక్తుల ఒత్తిడికి గురయి, తప్పుగా వ్యవహరించిందని బీజేపీ ఆక్షేపించింది. 'ఇప్పుడు వాపోతే ప్రయోజనమేంటి' అంటూ చిదంబరాన్ని ఉద్దేశించి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు. ప్రతీకారం తీర్చుకోవాలని చిదంబరం అనుకున్నా ఇతరులు నిరోధించారని, ఆ ఇతరులు సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్‌లేనా అనేది చిదంబరం స్పష్టతను ఇవ్వాలని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా డిమాండ్ చేశారు. ముంబై దాడులు, 2007 సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల ఘటనలకు సంబంధించి పాకిస్థాన్‌కు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్‌చిట్ ఇచ్చి, వాటి వెనుక హిందూ ఉగ్రవాద హస్తం ఉన్నట్టు విస్తృతంగా ప్రచారం చేసిందని ఆరోపించారు. పైగా పాక్‌పై మోదీ ప్రభుత్వ దాడులను నిత్యం అనుమానిస్తూ వస్తోందన్నారు. యూపీఏ హయాంలో పాకిస్థాన్‌ను అత్యంత ప్రయోజనకర దేశంగా గుర్తించారని పూనావాలా దుయ్యబట్టారు. పాక్‌తో వ్యవహారంలో భారత్ మొగ్గు ఎలా ఉందనేది చిదంబరం వ్యాఖ్యలు తేటతెల్లం చేశాయని, ముంబై దాడులు జరిగిన తొమ్మిది నెలలకు పాక్‌తో భారత్ 'షర్మ్ ఎల్ షేక్' ఒప్పందం చేసుకుందని బీజేపీకి చెందిన మరో ప్రతినిధి శుధాంసు త్రివేది ఆరోపించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కరూర్ పాపం ఎవరిది?

'నా హృదయం ముక్కలైంది, భరించలేని బాధ నిలువునా తోడేస్తోంది, ఇంతటి ఆవేదనని జీవితంలో ఎన్నడూ అనుభవించ లేదు..' అంటూ తమిళ సినీనటుడు, టీవీకే పార్టీ అధినేత మంగళవారం నాటి వీడియో సందేశంలో తెగ వాపోయారు. ఉద్వేగాన్ని, బాధని బాగా దట్టించిన ఆ ప్రసంగంలో, ముఖ్యమంత్రి స్టాలిన్ మీద కూడా ఆయన విమర్శలు చేశారు. ప్రేమ పొంగిపొరలిన జనం తనను చూడటానికి వచ్చారని, సభ సురక్షితంగా చక్కగా జరిగి, ప్రజలు భద్రంగా ఉండాలని తాను కోరుకున్నానని, పోలీసుశాఖను అదే అభ్యర్థించానని, కానీ, కరూర్ ఘటనలో తమ తప్పు వీసమెత్తులేకున్నా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అంటూ ఆ చర్యను ఆయన తప్పుబడుతున్నారు. ఒక్క కరూర్ లోనే ఇలా ఎందుకు జరిగింది? అని ప్రశ్నించడం ద్వారా అధికారపక్షం కుట్రలే సామాన్యుల ప్రాణం పోవడానికి కారణమని చెప్పదల్చుకున్నారు. సీఎంగారూ, నాపై కక్ష తీర్చుకోవాలనుకుంటే నేరుగా నన్ను ఏదైనా చేయండి, అంతేకానీ, నా ప్రజల జోలికి వెళ్ళకండి అంటూ ప్రభుత్వ చర్యలను తప్పుబడుతున్నారు. తాను ఏ తప్పుచేయలేదనీ, తన రాజకీయ జీవితం మరింత ఉత్సాహంతో కొనసాగుతుందని కూడా ఆయన ప్రకటించాడు. ఇంతటి కష్టకాలంలో కూడా తన రాజ్యాధికార లక్ష్యాన్ని విస్మరించని విజయ్‌ను చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది.

ఆ దారుణం జరిగి మూడురోజులైనా రాజకీయం మరింత పండుతోంది. విమర్శలు, ప్రతివిమర్శలు, కుట్రసిద్ధాంతాలతో చెవులు చిల్లులుపడుతున్నాయి. మధ్యాహ్నం వస్తాడన్న విజయ్, అత్యంత ఆలస్యంగా, రాత్రి ఏడున్నరకు అక్కడకు చేరుకోవడం ఉద్దేశపూర్వకంగా జరిగిందంటున్నారు పోలీసులు. సోషల్ మీడియాలో అసలు సమయాన్ని తప్పుగా ప్రచారం చేసి, జనం కిటకిటలాడేట్టు చేయాలన్న నిర్వాహకుల ఆలోచనే ఇంతమంది ప్రాణాలు తీసిందని వారి వాదన. అనుమతి తీసుకున్న పదివేలమంది కాదు, ఏకంగా పాతికవేలమంది జమగూడినా కూడా మరింత జనాన్ని పోగేయాలన్న తాపత్రయమే తప్ప, విజయ్‌పార్టీకి ప్రజల భద్రత పట్ల పట్టింపు లేకపోయిందన్నది ఎఫ్ఐఆర్ సారాంశం. బలప్రదర్శన లక్ష్యంతో విజయ్ తన కరూర్ రాకను జాప్యం చేయడంతో, దీని తరువాత కార్యక్రమం జరగాల్సినచోటనుంచి కూడా జనం ఇక్కడకు తరలివచ్చారని పోలీసులు అంటున్నారు. గూండాలు, పోలీసులు, అధికారపార్టీ కార్యకర్తలు కట్టకట్టుకొని కరూర్‌లో కుట్రలు పన్నారని టీవీకే హైకోర్టులో ఆరోపించింది. సభను భగ్నం చేయడానికి కొందరు చెప్పులూ రాళ్ళూ రువ్వారని, పోలీసులు లాఠీచార్జీ చేశారని, విద్యుత్ నిలిపివేశారనీ, అనేక పరిణామాలు కలగలిసి ఈ ఘటన సంభవించినందున సీబీఐ విచారణజరపాలని టీవీకే డిమాండ్ చేస్తోంది. సీఎం స్టాలిన్ కరూర్ చేరుకొనేలోగా శవపేటికలను సిద్ధం చేయాలన్న రాజకీయకుట్రలో భాగంగా శవపరీక్ష హడావుడిగా జరిపించారని కూడా టీవీకే ఆరోపిస్తోంది. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి విజయ్ పార్టీ అసత్యాలను వండివారుస్తోందని ప్రభుత్వం అంటోంది.

ఈ శవ రాజకీయాలను అటుంచితే, ఒక సినీ హీరోగా విజయ్‌కు ఉన్న ప్రజాదరణ కాదనలేనిది. ఆయన రాకకోసం అల్లాడిపోతున్న అభిమానులు ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో కూడుతూంటే, టీవీకే నాయకులు పోలీసుల నియమనిబంధనలను బేఖాతరు చేస్తూ, నియంత్రణలను ఉల్లంఘిస్తూ, వారిని అధికారపార్టీ విధేయులుగా ముద్రవేస్తున్నమాట నిజం. భారీ వాహనం లోపలినుంచి దానిపైకి వచ్చి, చేతులు ఊపి, నాలుగు రాజకీయ విమర్శలు చేయడం ఎంతో సులువైన పని. కానీ, తన కోసం గంటల తరబడి ఎండల్లో వానల్లో నిరీక్షిస్తున్న అభిమానుల భద్రత, సంక్షేమం గురించి ఆలోచించడం, పట్టించుకోవడం కష్టమైన పని. విజయ్ వచ్చిరావడంతోనే జనం ఒక్కసారిగా ఎగబడటం, మరోపక్క ఆయన వాహనానికి దారి కల్పించడంకోసం కిటకిటలాడుతున్న జనాన్ని వెనక్కునెట్టాల్సి రావడం వంటి గొలుసుకట్టు చర్యలు ఈ దుర్ఘటనకు దారితీసిన మాట వాస్తవం. రోడ్‌షోలను బలప్రదర్శనకు వాడుకోవడంతోనే ఇంతమంది బలైనారన్నది నిజం. విజయ్‌సభల్లోకి అధికారపక్షం ఖాళీ అంబులెన్స్‌లు తరలిస్తోందన్న ఆరోపణలతో సహా ఈ దురదృష్టకర సంఘటనపై నిష్పక్షపాతంగా లోతైన దర్యాప్తు జరగాలి. అధికారపక్షంమీద ఎదురుదాడి చేయడం విజయ్‌కు సులువేగానీ, తనమీద వచ్చిన ప్రతీ విమర్శకూ, తాను చేస్తున్న ప్రతివిమర్శకూ ఆధారసహితంగా ప్రజలకు వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత మాత్రం ఆయన మీద ఉంది.

గాజాను ఛిద్రం చేస్తున్న మారణకాండపై అంతర్జాతీయంగా నిరసన వెల్లువెత్తుతోంది. తనను తాను విశ్వగురువుగా భావించుకునే భారత్ వైఖరి ఆ గౌరవ ప్రతిపత్తికి అనుగుణంగా లేదు. మొదటి నుంచీ మానవ హక్కులకు ప్రాధాన్యమిస్తూ నైతిక విలువలను ఔదలదాల్చిన భారత్ ఇప్పుడు ఫలస్తీన్ విషయంలో మౌనం వహిస్తోంది!

గాజా ఘోరకలిలో భారత్ నైతిక నేరం

ప్రతి దేశమూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణమైన విదేశాంగ విధానాన్నే అనుసరించడం పరిపాటి. దక్షిణాఫ్రికా, ఫలస్తీన్ అంశాలు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల వైదేశిక నీతిని ప్రభావితం చేశాయి.

అరబ్బు దేశాలతో భారతీయ దౌత్యంలో ముఖ్యభూమిక పోషించిన అంశం ఫలస్తీన్. ప్రస్తుతం గాజాను ఛిద్రం చేస్తున్న మారణకాండపై అంతర్జాతీయంగా నిరసన వెల్లువెత్తుతోంది. తనను తాను విశ్వగురువుగా భావించుకునే భారత్ వైఖరి ఆ గౌరవ ప్రతిపత్తికి అనుగుణంగా లేదు. వలస పాలనలో ఉన్న నాటి నుంచీ అంతర్జాతీయ వేదికలపై ఫలస్తీన్‌కు మద్దతుగా ఎలుగెత్తిన భారత్ ఇప్పుడు తద్విరుద్ధమైన వైఖరిని అనుసరిస్తోంది. ఆక్రమిత గాజాలో సైనిక దాడులు నిలిపివేసి సుస్థిర శాంతి నెలకొల్పాలన్న ఐక్యరాజ్యసమితి తీర్మానంపై ఓటింగుకు భారత్ వ్యూహాత్మకంగా దూరంగా ఉండిపోయింది. భారత్ తీరుపై అంతర్జాతీయ దౌత్యవర్గాలు విస్మయం వ్యక్తం చేయగా దేశీయంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఫలస్తీన్‌పై మోదీ ప్రభుత్వ వైఖరిని నిలదీసారు. ఓటింగులో పాల్గొనకపోవడంతో ప్రతిష్ఠ దెబ్బతిన్న భారత్, ఇటీవల సౌదీ అరేబియా, ఫ్రాన్స్ ప్రతిపాదించిన రెండు దేశాల తీర్మానానికి అనుకూలంగా ఓటింగ్ చేసింది.

గల్ఫ్ లేఖ

గాజా ప్రాంతంలో ప్రజల ఇళ్ళను ఇజ్రాయెల్ నిరాటంకంగా కూల్చివేస్తోంది. ప్రజలను మైదాన ప్రాంతాలకు తరలిస్తోంది. బయటి నుంచి ఆహారం, ఔషధాలు మొదలైన అత్యవసర సహాయ సామగ్రిని గాజాలోకి ప్రవేశించనివ్వడం లేదు, చిన్నారులతో సహా సమస్త ప్రజలను ఆకలిమంటల్లో దహించి పోయేలా చేస్తోంది. చివరకు అన్నం పొట్లాలు పంపిణీ చేస్తామంటూ పిలిపించి వచ్చిన అన్నార్తులపై కాల్పులు జరుపుతూ క్రూరంగా వధిస్తున్న ఇజ్రాయెల్‌ను ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ దేశాలు నిందిస్తున్నాయి. మొదటి నుంచీ మానవ హక్కులకు ప్రాధాన్యమిస్తూ నైతిక విలువలను ఔదలదాల్చిన భారత్, ఇప్పుడు ఫలస్తీన్ విషయంలో మౌనం వహిస్తోంది!

ఐరోపాలో యూదులకు అన్యాయం జరిగితే ఫలస్తీన్ ప్రజలు అందుకు పరిహారం ఎందుకు చెల్లించాలని గాంధీజీ ప్రశ్నించారు. ఫలస్తీన్ భూభాగంలో ఇజ్రాయెల్ ఏర్పాటును ఆయన వ్యతిరేకించారు. ఫలస్తీన్ విషయంలో పాశ్చాత్య దేశాల వైఖరిని జవహర్ లాల్ నెహ్రూ తీవ్రంగా నిరసించారు. ఫలస్తీన్ ప్రజలకు పాలస్తీనా ప్రత్యేక దేశంగా ఉండాలని బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజపేయి ఎన్నికల ప్రచార సభలలో పదేపదే చెప్పారు.



గల్ఫ్‌తో సహా సమస్త అరబ్బు దేశాలతో భారత మైత్రిలో ఫలస్తీన్ ఒక ప్రభావదాయక అంశం. కశ్మీర్ సమస్యను ఫలస్తీన్‌తో పోల్చుతూ భారత్‌ను అరబ్బు దేశాలలో ఏకాకిగా చేసేందుకు పాకిస్థాన్ చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే అరబ్బు దేశాలతో మైత్రిలో ఎలాంటి లోటు లేకుండా భారత్ విదేశాంగ విధానం వ్యూహాత్మకంగా కొనసాగింది. తత్ఫలితమే పాకిస్థాన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లిబియా మొదలు ఖతర్ దాకా భారత్‌కు ఉపాధి వీసాల జారీ పరంపర కొనసాగింది. అరబ్బు దేశాల తరహాలో ఫలస్తీన్‌కు భారత్ సంఘీభావం తెలపడమే కాకుండా సంపూర్ణ మద్దతు కూడా ప్రకటించింది. పాశ్చాత్య దేశాలన్నీ ఫలస్తీన్ విమోచన సంస్థ (పి.యల్.ఓ)ను ఒక ఉగ్రవాద సంస్థగా గుర్తిస్తే దాన్ని అసలయిన ఫలస్తీనా ప్రాతినిధ్య ప్రతినిధిగా 1974లోనే గుర్తించిన ప్రప్రథమ అరబ్బేతర దేశం భారత్. ఓస్లో శాంతి ఒడంబడిక అనంతరం 1995లో ఫలస్తీనా నగరం రమల్లాలో తన దౌత్య కార్యాలయం నెలకొల్పిన అతి కొద్ది ప్రపంచ దేశాలలో భారత్ ఒకటి. దౌత్య రంగంలో రాణించిన తెలుగువారయిన బొడ్డు బాలభాస్కర్, పర్వతనేని హరీష్‌లు భారత ప్రతినిధులుగా ఫలస్తీన్‌లో పని చేసారు. ఫలస్తీన్ విమోచన సంస్థ అధినాయకుడు యాసర్ అరాఫత్ భారత్‌కు ఆప్తుడు. ఇందిరా గాంధీ తన చివరి విదేశీ పర్యటనలో ట్యూనిసియాకు ప్రత్యేకంగా వెళ్లి అరాఫత్‌తో ఉభయ కుశలోపరి జరిపారు. ఉగ్రవాద సంస్థ అని అమెరికా, పాశ్చాత్య దేశాలు నిందిస్తున్నా, ఇందిరా గాంధీ పి.యల్.ఓకు ఆర్థిక అండదండలు సమకూర్చారు. ఇందిరా గాంధీ హత్యానంతరం ఆమె భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరు అయిన ఏకైక విదేశీ నాయకుడు యాసర్ అరాఫత్. కశ్మీర్ వైఖరిపై భారత్‌నే అరాఫత్ సమర్థించే వారు. ఈ కారణాన కశ్మీర్ వేర్పాటువాదులు, పాకిస్థాన్ నాయకులు ఫలస్తీన్ నాయకత్వంపై సదా అసంతృప్తి వ్యక్తం చేస్తుండేవారు.

భారత్ నుంచి ఇటువంటి సంఘీభావ నేపథ్యమున్న ఫలస్తీన్ అంశం నరేంద్ర మోదీ సర్కారు హయాంలో క్రమేణా ప్రాధాన్యం కోల్పోయింది. ఇజ్రాయెల్ వైపే మోదీ సర్కార్ మొగ్గుతోంది. గాజాలో మానవతను కాలరాస్తున్న ఇజ్రాయెల్‌కు ఇప్పుడు పాశ్చాత్య ప్రపంచంలో అమెరికా మినహా మిత్ర దేశాలు దాదాపుగా లేవు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రసంగిస్తుండగా ఎదురయిన సన్నివేశమే ఆ దేశ ప్రతిష్ఠ మసకబారిందనడానికి ఒక తిరుగులేని నిదర్శనం.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కొత్త రాజకీయ పొద్దుపొడుపు ఎప్పుడు?



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారత దేశ రాజకీయాలు సంధి దశలో ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా సంభవిస్తున్న పరిణామాలు భావి రాజకీయాల తీరుతెన్నులు మారబోతున్నాయన్న సంకేతాల నిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల్లో కదలికలు అనేక ఊహాగానాలకు దారి తీస్తున్నాయి.

ఓట్ చోరీ ఆరోపణల తర్వాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్ప కాంగ్రెస్‌లో మరో నేత కనపడడం లేదు. బీజేపీపై రాహుల్ తదుపరి ఆరోపణలు ఏమి చేయనున్నారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది. ఓట్ చోరీపై ఇప్పటి వరకూ రెండు సార్లు విలేఖరుల సమావేశం నిర్వహించి, ఆయన వెల్లడించిన అంశాలకు చాలా ప్రచారం లభించింది. రాహుల్ తదుపరి వదిలే హైడ్రోజన్ బాంబు గురించి కూడా ఆసక్తి వ్యక్తమవుతోంది. నిజానికి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో కంటే పార్టీ అధ్యక్ష పదవిని వదులుకున్న తర్వాతే రాహుల్ గాంధీ చాలా జాగ్రత్తగా తన వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకుంటూ వస్తున్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయయాత్ర రెండింటిలోనూ మేధావులు, ప్రజల దృష్టిని రాహుల్ విశేషంగా ఆకర్షించారు. డీలాపడ్డ కాంగ్రెస్ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని సమకూర్చారు. రాహుల్ గాంధీ ఏమి చేస్తారన్న దానిపైనే తమ భవిష్యత్ ఆధారపడి ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

భారత్ జోడో యాత్రల తర్వాత సామాజిక న్యాయంపై రాహుల్ దృష్టి సారించారు. శాస్త్రీయమైన కులగణన జరిపి వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌ను లేవనెత్తారు. మరో వైపు భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందన్న భావనను కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మోదీ తీసుకుంటున్న అప్రజాస్వామిక నిర్ణయాలను, చేస్తున్న వ్యవస్థల హననాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' సందర్భంగా రాహుల్ చేసిన విమర్శలు బాగా చర్చనీయాంశమయ్యాయి. నిన్నమొన్నటి దాకా కాంగ్రెస్‌కు వారసత్వమే గుదిబండగా కనిపించేది. అయితే ఇప్పుడు ఆ వారసత్వంపై నేతల ఆశలు చిగురిస్తున్నాయి.

గత ఏడాది అహ్మదాబాద్ లోనూ, ఈ ఏడాది పాట్నా లోనూ నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల ద్వారా పార్టీకి పూర్వవైభవం తేవాలన్న ఆకాంక్షను పార్టీ కార్యకర్తల్లో రాహుల్ ప్రగాఢంగా రేకెత్తించారు. ఒకప్పుడు గుజరాత్, బిహార్‌లో జరిగిన ప్రజా ఉద్యమాలు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌ను దెబ్బతీసేందుకు కారణమయ్యాయి. 'మోదీ స్వంత రాష్ట్రంలో బీజేపీని ఓడించడం అవసరం' అని గత నెలలో గుజరాత్‌లో రాహుల్ ప్రకటించారు. గుజరాత్, బిహార్, ఒడిషాతో పాటు దేశమంతటా 'సంఘటన్ సృజన్ అభియాన్' పేరిట కాంగ్రెస్‌ను పటిష్ఠం చేసి, వ్యవస్థీకృత మార్పులు తెచ్చేందుకు రాహుల్ కీలక చర్యలు చేపట్టారు. అనేక రాష్ట్రాల్లో జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి నేతలతో రాహుల్ విడివిడిగా సంభాషిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలకు అభ్యర్థుల ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పి వారిలో ఉత్సాహం నింపుతున్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో కూడా తొలిసారి ఏఐసీసీ పరిశీలకులను నియమించడం ఒక కీలక పరిణామం.

పాట్నాలో ఒకప్పుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడుగా ఉన్న, మహాత్మాగాంధీ ఎన్నో చరిత్రాత్మక పోరాటాలు ప్రారంభించిన 'సదాకత్ ఆశ్రమ్' నిన్న మొన్నటి వరకు పాడుపడిపోయి ఉండేది. ఇప్పుడు దానికి పూర్వ కళ వచ్చేసింది. ఇటీవల ఏఐసీసీ విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశం ఇదే భవనంలో జరపడం కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని కల్పించింది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇద్దరూ కలిసి అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం కల్పించే మేనిఫెస్టోను (అతిపిఛ్‌డా న్యాయ సంకల్ప్) విడుదల చేశారు.

ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే ప్రతిపక్షాల కార్యాచరణను ప్రధానంగా రాహుల్ గాంధీయే నిర్దేశిస్తున్నారని స్పష్టమవుతోంది. ఆయన లేవనెత్తిన సామాజిక న్యాయ ఎజెండాను ఇతర ప్రతిపక్షాలు కూడా స్వీకరించినట్లు కనపడుతున్నది. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీయే నిర్ణయించి, మిగతా ప్రతిపక్షాలను తనకు మద్దతుగా సమీకరించగలిగింది. రాహుల్ నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రతిపక్ష నేతలు అందరూ హాజరవుతున్నారు. ఈ దేశంలో ప్రత్యామ్నాయ నేత రాహుల్ తప్ప మరొకరు లేరన్న విషయమై ప్రతిపక్షాలు పెద్దగా విభేదించడం లేదు. ఆర్జేడీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

మోదీ ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న పరుష విమర్శలకు సోషల్ మీడియాలో కూడా అధిక ప్రాధాన్యం లభిస్తోంది. గతంలో బీజేపీ సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చాలా ప్రభావశీలమైన ప్రచారం చేసేది. ఇప్పుడు ఆ టెక్నిక్‌ను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కూడా నేర్చుకున్నాయి. రాహుల్‌ను అభిమానించే మీడియా విశ్లేషకుల బృందం ఆయన మాట్లాడిన మాటలకు సోషల్ మీడియాలో ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. రాహుల్ మాట్లాడిన వెంటనే ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్ నుంచి ప్రకాశ్‌రాజ్ వరకు అందుకుని ఆయనను సమర్థించడం ఒక పరిణామం.

స్పష్టంగా చెప్పాలంటే దేశం ఇప్పుడు రాజకీయంగా, సైద్ధాంతికంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల మధ్య విడిపోతోంది. మోదీని వ్యతిరేకించేవారు, ద్వేషించేవారు కాంగ్రెస్ శిబిరంలో అనివార్యంగా చేరిపోతున్నారు. పార్టీలు కూడా అదే విధంగా విడిపోతున్నాయి. 2019లో 52 సీట్లు సాధించిన కాంగ్రెస్, 2024లో 99 సీట్లకు చేరుకుంది. 21.2 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఏదో ఒక రూపంలో ఉన్నది. హిందీ బెల్ట్‌లోనూ, ఈశాన్యంలోనూ, మధ్య భారతంలోనూ, దక్షిణ భారతావనిలోను కాంగ్రెస్ ముద్రలు ఏదో ఒక రకంగా ఉన్నాయి. కాంగ్రెస్ ఎలాగైనా మరో 50 లేదా 60 సీట్లు అదనంగా సాధించగలిగితే 2029లో కాంగ్రెస్ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం నెలకొనడం ఖాయమన్న ఆత్మ విశ్వాసం ఆ పార్టీ నేతల్లో కనపడుతోంది.



మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే బీజేపీ అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడింది నిజమే కానీ, ప్రతిపక్షాలు ఊహించినంత వేగంగా మోదీ గ్రాఫ్ పడిపోలేదు. ప్రధానమంత్రి జనాదరణ 2021లో 70 శాతం నుంచి 2025లో 60 శాతం లోపునకు పడిపోయింది. మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడుగా రాహుల్ కానీ, మరో నేత కాని ఆవిర్భవించే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించడం లేదు. అందుకే ఇది సంధికాలం.

అయితే కాంగ్రెస్ పుంజుకుంటున్నదన్న వాతావరణం కాంగ్రెస్ నేతల్లో ఏర్పడినంతగా జనంలో ఏర్పడుతున్నదా? ఇప్పటి వరకూ కనపడుతోంది సంకేతపూర్వక మార్పే కానీ అది పార్టీని ఒక ప్రజా ఉద్యమంగా మార్చగలిగిన పరిణామం కాదు. కాంగ్రెస్ పుంజుకోవడం వాపా, బలుపా అన్నది తేలాల్సి ఉన్నది. రాహుల్ వ్యక్తిగత ప్రతిష్ఠ పెరిగి ఉండవచ్చు కాని అంతే వేగంగా సంస్థాగత బలం పటిష్ఠమైందా? ఇది సహేతుకమైన అనుమానమే! ఎందుకంటే కాంగ్రెస్‌లో పాత కాలం రాజకీయాలు ఇంకా సమసిపోలేదు. పదవులకై అదే కాట్లాట, వృద్ధ నేతలు వైదొలిగి కొత్త వారికి అవకాశం కల్పించే పరిస్థితి పూర్తిగా రాలేదు. రాహుల్ విశ్వసనీయత పెరిగి ఉండవచ్చు కానీ ఇందిరా గాంధీ లాగా ఒక ప్రజాప్రభంజనాన్ని సృష్టించగలిగిన నాయకత్వం కాంగ్రెస్‌కు రాలేదు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు రాహుల్ యత్నాలకు తోడుగా పార్టీని బలపరిచేందుకు అంతగా కష్టపడడం లేదు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతమై ప్రతి చోటా ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఇంకా ఏర్పర్చుకోవల్సి ఉన్నది. బిహార్, ఒడిషా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తదితర చోట్ల పార్టీ వ్యవస్థ బాగా బలహీనమై నాయకులు లేని దుస్థితికి చేరుకున్నది. నాయకత్వాన్ని మరింత వికేంద్రీకరించి, సాహసోపేతమైన సైద్ధాంతిక ఎజెండాను కల్పించి, విశ్వసనీయ జాతీయ ప్రత్యామ్నాయంగా రూపొందించే దారిలో కాంగ్రెస్ ఇంకా అనేక చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఏఐసీసీ కార్యాలయం ఇప్పటికీ జీవకళ కోల్పోయిన నెలవులా కనపడుతోంది. ఒకప్పుడు అక్కడకు ఎప్పుడు వెళ్లినా ఎంతో మంది తచ్చాడుతూ కనిపించేవారు. అక్కడ నాయకులను కలిస్తే తమ పనులు అయిపోతాయన్న ఆశతో వచ్చేవారు. మీడియాను కలిసి రాజకీయ పరిణామాలను విశ్లేషించే మేధావులు ఉండేవారు. ఇప్పుడు అక్కడికి వెళ్లడం అనవసరమనే భావన కనిపిస్తోంది. ఢిల్లీలోని దీనదయాళ్ మార్గ్‌లో బీజేపీ ఇప్పటికే ఒక అధునాతన ఆకాశ హర్మ్యాన్ని నిర్మించుకుని ఎవరికీ తెలియని రహస్య నిర్ణయాలు తీసుకునే నెలవుగా దానిని మార్చింది. ఒకప్పుడు అశోకా రోడ్ లోని బీజేపీ కార్యాలయానికీ, ఈ కార్యాలయానికీ ఎంతో తేడా కనిపిస్తోంది. అదే పరిస్థితి అక్బర్ రోడ్ లోని కాంగ్రెస్ కార్యాలయానికి, దీనదయాళ్‌లో కాంగ్రెస్ నిర్మించుకున్న అధునాతన కార్యాలయానికీ తేడా కనిపిస్తోంది. రెండూ కార్పొరేట్ భవనాల్లా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రెండు ప్రధాన పార్టీలు అవలంబిస్తున్న వైఖరి చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది.

నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే బీజేపీ అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడిందన్న విషయం వాస్తవం. అంతర్గత సమస్యలు, ఎన్నికల అక్రమాల నుంచి విదేశాంగ విధానం వరకు ప్రతిపక్షాలు లేవనెత్తే అనేక ప్రశ్నలకు ప్రభుత్వం సరైన సమాధానాలు చెప్పలేని స్థితిలో ఉన్నది. నిజమే కానీ ప్రతిపక్షాలు ఊహించినంత వేగంగా మోదీ గ్రాఫ్ పడిపోలేదు. మోదీ ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలు తాత్కాలికమైనవేనని, ఆయన వాటి నుంచి బయటపడి మళ్లీ పుంజుకుంటారని భావిస్తున్న వారు ఎందరో ఉన్నారు. హిందూత్వ ఆధారంగా మోదీని అభిమానించే జనం అంతగా తగ్గిపోలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వృద్ధులను గౌరవిద్దాం

'పుట్టినవాళ్లెవరైనా కాలక్రమంలో వృద్ధులుగా మారక తప్పదు' ఈ సత్యాన్ని గ్రహించకుండా వారిని హింసించడం, వేధింపులకు గురి చేయడం, వారి కష్టార్జితాన్ని స్వాధీనం చేసుకొని వాళ్లను రోడ్లపైన వదిలేయడం వంటి దుర్మార్గపు పరిస్థితులు సమాజంలో నేడు అధికమయ్యాయి. వృద్ధుల సంరక్షణను నిర్లక్ష్యం చేయడం చట్టరీత్యా నేరం. వృద్ధులను పట్టించుకోకపోతే, వారి ఆస్తి పొందే అర్హత, అనుభవించే హక్కు వారసులకు లేదని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. 'వృద్ధులకు చేయూత నివ్వడం కనీస బాధ్యత' అని తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే తమ పిల్లలకు నేర్పాలి. వయసు పైబడిన వారు చాదస్తం కారణంగా కొన్ని ఇబ్బంది కలిగించే పనులు చేయవచ్చు, వాటిని పిల్లలు విసుక్కోకూడదు. వృద్ధుల మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కనీస విచక్షణ, సహనం కలిగి ఉండాలి. వాళ్లను చిన్న పిల్లల వలె జాగ్రత్తగా చూసుకోవాలి. వారి మనసుకు ప్రశాంతత నిచ్చే మాటలే మాట్లాడాలి. అప్పుడే వృద్ధులు కాస్త సంతృప్తి చెందుతారు. వారు సంతోషంగా ఉంటే వయసు కారణంగా వచ్చే రోగాలు కూడా చాలా వరకూ దూరమవుతాయి. వృద్ధుల్లో సహజంగానే అరుగుదల క్షీణిస్తుంది కాబట్టి వాళ్లకు జీర్ణమయ్యే ఆహారాన్నే ఇవ్వాలి. ప్రభుత్వాలు కూడా వృద్ధుల సంరక్షణకు సంబంధించిన నైతిక విలువలను ప్రజల్లో పెంపొందించేందుకు తమ వంతు కృషి చేయాలి.

– వై. సంజీవ కుమార్
(నేడు ప్రపంచ వృద్ధాప్య దినోత్సవం)

రొమ్ము క్యాన్సర్‌పై అలుపెరుగని పోరాటం

అక్టోబర్‌ను ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన నెల'గా గుర్తిస్తారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాల్సిన ఆవశ్యకతను తెలియ చెప్పడం, దీని బారినుంచి బయటపడ్డవారిని గౌరవించడం, వారికి ఆశ-ధైర్యం అనే సందేశాన్ని ఇవ్వడం వంటివి ఈ నెలలో నిర్వహిస్తారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధిని ఎదుర్కొనేందుకు సమాజంలో అవగాహన కల్పించడం, చట్టాలను తయారు చేసే వారిని చైతన్యపరచి, ఈ జబ్బు నిర్మూలనకు చర్యలు తీసుకునేలా చేయడం ఎంతో అవసరం.

మన దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. లక్షమందికి పైగా మహిళలు ఏటా ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి స్పష్టమైన కారణాలు ఉన్నాయి. ఈ వ్యాధిపై మహిళలకు అవగాహన లేకపోవడం, దేశవ్యాప్తంగా ఒక బలమైన స్క్రీనింగ్ కార్యక్రమం లేకపోవడం, ఈ క్యాన్సర్ చికిత్సకు ఆస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వంటివి ఇందులో ప్రధానమైనవి. గ్రామీణ భారతంలో రొమ్ము క్యాన్సర్ ఇంకా 'రహస్య సమస్య'గానే మిగిలి ఉన్నది.



ఈ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, మహిళలకు శక్తి నివ్వాలనే దృఢ సంకల్పంతో 2007లో 'ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్'ను స్థాపించాను. మా అమ్మగారు కూడా ఈ వ్యాధితో వ్యక్తిగత పోరాటం చేసినందున, ఆమె ధైర్యాన్ని గౌరవిస్తూ ఈ ఫౌండేషన్‌ను ఆమె పేరుతో స్థాపించాను. ఫౌండేషన్ లక్ష్యాన్ని నాలుగు అంశాల్లో ఇలా వివరించవచ్చు. 1) సమాజంలో రొమ్ము క్యాన్సర్‌పై ఉన్న అపోహలు తొలగించి, దాని గురించి ప్రజలందరూ బహిరంగంగా మాట్లాడుకునేలా చేయడం. 2) ఈ సమస్యకు సంబంధించి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నమ్మకం ఏర్పరచడం. 3) రాజకీయ అవగాహనను కల్పించి, చట్టాలను తయారు చేసే వారు రొమ్ము క్యాన్సర్ నిర్మూలనా చర్యలు చేపట్టేలా ప్రభావితం చేయడం. 4) ఈ సమస్యను ప్రజా ఆరోగ్య చర్చల్లో చేర్చడం. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫౌండేషన్ తరఫున 'పింక్ రిబ్బన్' కార్యక్రమాన్ని ఆరంభించాం. గత పద్దెనిమిది సంవత్సరాల్లో ఇది దేశంలోనే 'అత్యంత ప్రభావవంతమైన ఆరోగ్య అవగాహన ప్రచారాల'లో ఒకటిగా నిలిచింది. సినీ, ఇతర ప్రముఖులు ఈ సమస్యపై తమ గళాన్ని వినిపిస్తున్నారు. 'పింక్ రిబ్బన్ వాక్', 'పెయింట్ ది సిటీ పింక్' వంటివి ఈ 'అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన' నెలలో ఏటా సంప్రదాయాలుగా మారాయి. హైదరాబాద్ నగరంలో వరుసగా 16 సంవత్సరాల పాటు అక్టోబర్ నెలలో ఏదైనా ఒక రోజున జీహెచ్‌ఎంసీ సిటీ మొత్తాన్ని పింక్ లైట్ల వెలుగుతో నింపుతోంది. తద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమాల నిర్వహణలో హైదరాబాద్ ప్రత్యేకంగా నిలుస్తోంది.

ప్రధానమంత్రి డిజిటల్ ఇండియా దృష్టి నుంచి ప్రేరణ పొంది బ్రెస్ట్ హెల్త్‌కు సంబంధించి ప్రపంచంలోనే మొదటి మొబైల్ యాప్ (ABCs of Breast Health)ను మా ఫౌండేషన్ రూపొందించింది. ఇంగ్లీష్‌తో పాటు, 11 ప్రధాన భారతీయ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది. మా 'పింక్ కనెక్షన్' దక్షిణాసియాలోనే మొదటి త్రైమాసిక బ్రెస్ట్ హెల్త్ మ్యాగజైన్.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల భాగస్వామ్యంతో మా ఫౌండేషన్ తరఫున 'క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' (సీబీఈ)ను నిర్వహించాం. 2012 నుంచి 2016 వరకు, నాలుగువేల గ్రామాల పరిధిలో 35–65 వయసు మధ్య ఉన్న రెండు లక్షలకు పైగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మా ఫౌండేషన్ స్క్రీనింగ్ నిర్వహించింది. క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించింది. రొమ్ము కాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద మహిళలకు ఇది తక్కువ ఖర్చు కలిగిన మార్గం. 2016లో నేను సభ్యుడిగా ఉన్న కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్టీరింగ్ కమిటీ, టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ దీన్ని జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ఆమోదించింది. మా 'పింక్ రిబ్బన్' కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎంతగానో ప్రభావం చూపింది. ఇటీవల ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మా ఫౌండేషన్ సేవలను అభినందించడం సంతోషాన్ని కలిగించే విషయం.

గత ఇరవై ఏళ్లుగా 'రొమ్ము క్యాన్సర్'కు సంబంధించి మా ఫౌండేషన్ విస్తృత కార్యక్రమాల్లో భాగస్వామ్యమైంది. అవగాహన కల్పించడం అంటే రొమ్ము క్యాన్సర్ సమస్యపై ఒక ఉద్యమాన్ని సృష్టించడమే. ఇప్పటికే ఈ కార్యక్రమాల ద్వారా ఎన్నో ప్రాణాలు రక్షించబడ్డాయి. ఒకప్పుడు నిశ్శబ్దంలో మునిగిన ఈ వ్యాధి గురించి నేడు ప్రతి ఒక్కరూ చర్చిస్తున్నారు. ఇంకా చర్చల్లోకి రావాలి. నేటి నుంచి అక్టోబర్ నెలంతా 'రొమ్ము క్యాన్సర్'పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. మా ఫౌండేషన్ ద్వారా లక్షలాది మంది రోగులకు ఆశ, ధైర్యాన్ని అందించడం నా జీవితంలో అత్యంత గౌరవంగా భావిస్తాను.



○ డా. పి.రఘురామ్
ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్

నవీన ఆలోచనల 'మంథన్ సంవాద్'

ఆలోచనలు స్వేచ్ఛగా పంచుకునే వేదికగా నిలిచిన 'మంథన్ సంవాద్' అక్టోబర్ 2న, హైదరాబాద్ శిల్పకళావేదికలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో రచయితలు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్య పౌరులు.. ఇలా అన్ని వర్గాల వారూ ఒకే వేదికపైకి చేరి 'మనకు నిజంగా ముఖ్యమైన విషయాలు' చర్చించనున్నారు. ఇది రాజకీయాలకు అతీతమైన వేదిక. మంథన్ ఇప్పటి వరకు 500కు పైగా ప్రసంగాలు నిర్వహించింది. 60,000 మందికి పైగా సభ్యులను కలిగివుంది. పౌరుల జీవితానికి నేరుగా సంబంధించిన ప్రజాస్వామ్యం, ఆర్థికవ్యవస్థ, పర్యావరణం, విజ్ఞానం, చరిత్ర, మానవ హక్కులు మొదలైనవి ఇక్కడ చర్చించే అంశాలు. ప్రతీ ఏడాది గాంధీ జయంతి రోజున ఈ చర్చ జరగడం కూడా దీని విలువను పెంచుతోంది.

ఈసారి వేదికపైకి రాబోతున్న వక్తలు అందరూ తమ రంగాల్లో గుర్తింపు పొందినవారు. రక్షణ రంగ నిపుణుడు ప్రవీణ్ సాహ్నీ దేశ భద్రత, సరిహద్దు పరిస్థితులు, అంతర్జాతీయ సంబంధాలపై అవగాహన కలిగించనున్నారు. అంతర్జాతీయంగా పేరుపొందిన కమెడియన్ వీర్ దాస్ తన హాస్యంతో కూడిన వ్యాఖ్యలతో సమాజంలోని అన్యాయాలపై గొంతు వినిపిస్తారు. చరిత్రకారుడు, అశోక యూనివర్సిటీ ఛాన్సలర్ రుద్రాంగ్షు ముఖర్జీ భారత చరిత్రలోని కీలక ఘట్టాలు మన ప్రస్తుత సమాజానికి ఎలా ముడిపడి ఉన్నాయో చెప్పనున్నారు. పౌరహక్కులు, మీడియా స్వేచ్ఛలపై 'ది వైర్' సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖానమ్ షెర్వాణీ మాట్లాడనున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.ఎస్. శశిధర్ మన దైనందిన జీవితంలో శాస్త్రం ఎంత ముఖ్యమో వివరించనున్నారు. ప్రజా విధాన ఆర్థికవేత్త రథిన్ రాయ్ భారత ఆర్థిక వ్యవస్థ దిశపై విశ్లేషణ ఇస్తారు. మానవ హక్కుల న్యాయవాది కాలిన్ గోన్సాల్వెస్ రాజ్యాంగం, న్యాయం, సమాన హక్కుల అంశాలను ప్రస్తావించనున్నారు. ఈ వక్తలంతా సమాజానికి అవసరమైన విస్తృత చర్చను తెరపైకి తీసుకువస్తారు. మంథన్ సంవాద్ ప్రత్యేకతలలో ఒకటి దాని ఉచిత ప్రవేశం, రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. మధ్యాహ్న భోజనం కూడా ఉచితం. హైదరాబాద్ నగరం ఒకవైపు సంప్రదాయ విలువలను కాపాడుకుంటూనే, మరోవైపు కొత్త ఆలోచనలను స్వీకరించే ధైర్యం కలిగినది. అదే మంథన్ స్ఫూర్తి కూడా. పాత, కొత్త ఆలోచనలను కలిపి కొత్త దిశలో ముందుకు తీసుకెళ్లడం. ప్రతి సంవత్సరం దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఆలోచనాపరులు హైదరాబాద్‌కి వస్తారు. ఇక్కడి చర్చలను విని కొత్త విషయాలు నేర్చుకుంటారు, తిరిగి వెళ్లిన తర్వాత ఆ ఆలోచనలను తమ సమాజంతో పంచుకుంటారు. మంథన్ కేవలం ఒక రోజు జరిగే సభ మాత్రమే కాదు, అది ఒక ఆలోచనల విత్తనం.

– విక్రమ్, మంథన్



నేటి అలంకారం మహిషాసుర మర్దిని దేవి

మహానవమి

దుర్గే దుర్గతినాశని..

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- రాత్రి 7 గంటలకు లక్ష దాటిన భక్తుల సంఖ్య
- ఉత్తరాంధ్ర నుంచి పెరిగిన భవానీల రాక
- నేడు మహిషాసురమర్దినిగా దర్శనం



శరన్నవరాత్రి మహోత్సవాల్లో దుర్గాష్టమి రోజైన మంగళవారం శ్రీదుర్గాదేవిగా విజయవాడ శ్రీకనకదుర్గమ్మ దర్శనమిచ్చారు. పంచ ప్రకృతి మహాస్వరూపాల్లో మొదటిదైన దుర్గా రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను కనులవిందుగా వీక్షించి తన్మయత్వం చెందారు. ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్యరూపిణి దుర్గమ్మను శరణువేడుకున్నారు. రాత్రి ఏడు గంటలకు లక్ష మంది వరకు భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు.



ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు







పారాచ్యూట్ రైడ్





నృత్య అభినయం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి భారీగా తరలి వస్తున్నారు. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దశమి గడియలు దగ్గర పడుతుండడంతో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భవానీల రాక పెరిగింది. అమ్మవారిని రాత్రి ఏడు గంటల మిగతా 6లో..

ఇన్నర్ రింగ్ రోడ్డు ఫ్లైఓవర్‌ల నిర్మాణంలో డొల్లతనం బయటపడుతోంది. అధికారులు ఎన్నిసార్లు ప్యాచ్ వర్క్‌లు చేపట్టినా నెలరోజులు తిరిగేసరికి కొత్త గుంతలు ఏర్పడటం తరచు జరుగుతోంది. నాణ్యతా లోపం వల్లే ఇలా జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. దానిని నిజం చేస్తూ మొదటి ఫ్లైఓవర్ స్లాబ్‌కు సోమవారం రాత్రి భారీ రంధ్రం పడింది. అది గమనించి స్థానికులు పూలకుండీలు అడ్డుపెట్టి వాహనాలను నియంత్రించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



ఇన్నర్ రింగ్ రోడ్డు స్లాబు కాంక్రీటు ఊడిపోయి ఏర్పడిన భారీ రంధ్రం

ఆహో!.. ఏమి నాణ్యత

ప్రారంభించి నిండా పదేళ్లు కాలేదు

- ఇన్నర్ రింగ్ స్లాబుకు భారీ రంధ్రం
- కాంక్రీటు పూర్తిగా ఊడి సువ్వలు బయటకు..
- రూ.122.36 కోట్ల వ్యయంతో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం
- బయటపడ్డ నాణ్యతా లోపం.. మరమ్మతులు చేపట్టిన వీఎంసీ

6

నదిలో హంస విహరించేనా!

దశమి రోజున అమ్మవారి తెప్పోత్సవంపై ఉత్కంఠ!

కృష్ణానదిలో క్రమంగా పెరుగుతున్న వరద

- ఎగువ నుంచి 6.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 7 లక్షల క్యూసెక్కులకు చేరువలో వరద ప్రవాహం
- ఎన్‌వోసీ ఇవ్వడానికి జలవనరుల శాఖ నిరాకరణ



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): విజయదశమి రోజున కృష్ణానదిలో హంస విహరిస్తుందా? అసలు ఉత్సవమూర్తులు ఈసారి ఊరేగింపుగా హంస ఎక్కుతారా? దశమి గడియలు దగ్గర పడుతున్న వేళ ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు ఇవి. గడచిన మూడేళ్లుగా తెప్పోత్సవానికి ఏదో ఒక ఆటంకం ఏర్పడుతోంది. ప్రస్తుతం వరద పరిస్థితి నేపథ్యంలో తెప్పోత్సవంపై మరోసారి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయదశమి రోజున శ్రీగంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రధానాలయంలో పూజలు చేసి ఊరేగింపుగా కనకదుర్గానగర్ నుంచి దుర్గాఘాట్‌కు తీసుకెళ్తారు. హంస వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తర్వాత ఉత్సవమూర్తులతో నదీ విహారం చేయిస్తారు. ఏటా ఈ ప్రక్రియ సాగుతోంది. 2022, 2023 సంవత్సరాల్లో దశమి రోజున హోరున వర్షం కురవడంతో తెప్పోత్సవాన్ని రద్దు చేశారు. ఉత్సవమూర్తులను మహామండపం లోని ఆరో అంతస్తులో ఉంచి మిగతా 6లో..

ఎనిమిది రోజుల్లో ₹3 కోట్ల ఆదాయం

దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో గత నెల 22 నుంచి 29వ తేదీ వరకు ఎనిమిది రోజుల్లో దేవస్థానానికి రూ.3,00,10,704 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శనం రుసుం రూ.300 టికెట్ల ద్వారా రూ.35,20,800, రూ.100 టికెట్ల ద్వారా రూ.12,65,700 సమకూరినట్టు పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదం (ఒక్కోటి రూ.15) విక్రయం ద్వారా రూ.28,37,145, రూ.100 లడ్డూ ప్రసాదం ప్యాకెట్ల విక్రయం ద్వారా రూ.2,05,04,600 వచ్చినట్లు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ ద్వారా రూ.4,11,000 (టికెట్ రూ.3000), ప్రత్యక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా రూ.1.75 లక్షలు (టికెట్ రూ.5,000), చండీ హోమం రూ.4,000 రుసుం ద్వారా లక్ష రూపాయలు, ప్రత్యక్ష, పరోక్ష శ్రీచక్రనవావరణార్చనకు (రూ.3,000 రుసుం) రూ.33 వేలు, ఖడ్గమాలార్చన ద్వారా రూ.2,76,264, పుస్తకాలు, ఫొటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.39,920, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.8,30,240, ఇతరత్రా ఆదాయం రూ.17,035 మేర వచ్చినట్టు పేర్కొన్నారు.

క్రౌన్ ఆఫ్ విజయవాడ పోటీల్లో ర్యాంప్ వాక్ చేస్తున్న అందాల భామలు





అందమైన భామలు

ర్యాంప్ వాక్.. క్యాట్ వాక్‌తో దద్దరిల్లిన క్రౌన్ ఆఫ్ విజయవాడ

- మిస్ విజయవాడగా రేష్మ, మిసెస్ విజయవాడగా సౌందర్య
- పోటీల్లో 300 మంది పాల్గొనగా.. 90 మంది ఫైనల్స్‌లో తలపడ్డారు
- ర్యాంప్ మీద క్యాట్‌వాక్‌లకు ప్రేక్షకుల కరతాళధ్వనులు, హర్షధ్వానాలు
- పున్నమిఘాట్‌లో మైమరపించిన కెమెలియన్ ఫ్లూట్ మోడ్రన్ మ్యూజిక్
- తుమ్మలపల్లిలో ఆకట్టుకున్న గాన కచేరీలు, శాస్త్రీయ నృత్యాలు
- ఘంటసాలలో రక్తి కట్టించిన నాటికలు, నాటకాలు



ఆకట్టుకుంటున్న తోలుబొమ్మలాట



కెమెలియన్ ఫ్లూట్ మోడ్రన్ మ్యూజిక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): 'అందమైన భామలు.. లేత మెరుపు తీగలు.. ముట్టుకుంటే మాసిపోయే కన్నెల అందాలు' అంటూ యువత పాడుకుంటూ చిందేసింది. క్రౌన్ ఆఫ్ విజయవాడ పోటీలను చూసి మైమరచిపోయింది. ర్యాంప్ వాక్‌లు.. క్యాట్ వాక్‌లతో విజయవాడ ఉత్సవ్ పీక్స్‌కు చేరింది. విజయవాడ అందాల పోటీలకు గొల్లపూడి వేదికగా మారింది. అశేషంగా వచ్చిన వీక్షకుల మిగతా 6లో..

---

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ — డీఈవో సుబ్బారావు 6

దసరా వచ్చిందయ్యా..!

- విజయవాడ ఉత్సవ్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- పవిత్ర సంగమం వద్ద హెలీరైడ్‌కు ఆదరణ

8









దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు 2025

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల తొమ్మిదో రోజు దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుర్గమ్మను పలువురు ప్రముఖులతో పాటు సినీనటి హేమ, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు దర్శించుకున్నారు.

దివ్య రూపిణి దుర్గమ్మా

భక్తులకు అమ్మ దర్శనం



ఆదాయం రూ.45.56 లక్షలు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి దసరా మహోత్సవాలలో ఎనిమిదో రోజు సోమవారం మూలా నక్షత్రంనాడు దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ.45,56,853ల ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,83,815లు, రూ.100 ప్యాక్ ద్వారా రూ.39,81,900లు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ(రూ.3000) ద్వారా రూ.54 వేలు, చండీహోమం (రూ.4000) ద్వారా రూ.24వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.15,348లు, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ.10,770, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.1,83,760, ఇతరత్రా ఆదాయం రూ.3,260లు మేరకు వచ్చింది. మొత్తం రూ.45,56,853లు ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. కాగా, తొమ్మిదోరోజు మంగళవారం సాయంత్రానికి వివిధ రూపాల్లో రూ.40,12,917లు ఆదాయం లభించినట్లు ఈవో ప్రకటనలో తెలిపారు.

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలలో మంగళవారం దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. క్యూలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధుల్లో ఉన్న సిబ్బంది మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్ సమన్వయంతో భక్తులు, దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లలకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రిపై ఎనిమిదోరోజు దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ దంపతులు, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కుటుంబసభ్యులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, పలువురు న్యాయమూర్తులు ఉన్నారు.

వర్షంలోనూ దుర్గమ్మ నామస్మరణ

నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంలోనూ భక్తులు దుర్గమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షంలోనూ భక్తులు అమ్మవారి దర్శనం కోసం పోటెత్తారు. దేవస్థానం అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.







హరి జవహర్‌లాల్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కుటుంబసభ్యులతో సీపీ రాజశేఖర్‌బాబు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



దివ్యాంగురాలికి సేవాదళ్ సేవ



పాలు అందజేస్తున్న స్వచ్ఛంద సేవకులు



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

జై భవానీ..

- దుర్గమ్మ నామస్మరణతో కిలోమీటర్ల నడక
- దారిలో అల్పాహారంతో దాతల ఆదరణ
- ఇంద్రకీలాద్రికి పాదయాత్రగా వస్తున్న భవానీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు దుర్గమ్మను మొక్కుతూ మాలాధారణ చేపడతారు. కోరిన కోర్కెలు తీర్చే జగన్మాతను దర్శించుకోవడానికి దసరా చివరి మూడురోజులు లక్షల్లో భవానీలు తమ తమ స్వస్థలాల నుంచి అకుంఠిత దీక్షతో తరలివస్తారు. పాదయాత్రగా వచ్చేవారు దూరప్రాంతాల నుంచి అమ్మ దర్శనానికి కొద్ది రోజుల ముందుగానే బయలుదేరి నగరానికి చేరుకుంటారు. వారిలో చిన్నపిల్లల నుంచి వృద్ధులు, మహిళలు ఉంటారు. గమ్యాన్ని చేరేవరకు ఎన్నో కష్టాలను భరిస్తూంటారు. మధ్యమధ్యలో సేదతీరుతూ దాతలు ఇచ్చిన ఆహారాన్ని స్వీకరిస్తూ నడక కొనసాగిస్తూ భక్తితో ఇంద్రకీలాద్రిని చేరుకుంటారు. కాళ్ల నొప్పులు వచ్చినా, బొబ్బలు కట్టినా కనకదుర్గమ్మ దర్శనమే పరమావధిగా ముందుకుసాగుతారు.ముఖ్యంగా కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికశాతం మంది భవాని భక్తులు ఉంటారు. దసరా సమయంలో 9 నుంచి 12 రోజులు మాలాధారణ వేస్తారు. దూరాన్ని బట్టి భక్తులు పాదయాత్ర ప్రారంభిస్తారు. కాలినడకన అమ్మవారిని దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణిస్తారు. అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ వస్తామని భక్తులు చెబుతున్నారు.



కాలినడకన అమ్మవారిని చేరుకోవడం ఓ అనుభూతి

- భవానీ భక్తులు (కాకినాడ)

కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఒక అనుభూతి. కనకదుర్గమ్మ దయ వల్ల ఆరుగురం కలిసి గురువారం సాయంత్రం కాకినాడ నుంచి నడక ప్రారంభించాం. ఎక్కువగా సాయంత్రం సమయంలో నడక సాగిస్తూ రాత్రి 9, 10 గంటల వరకు ప్రయాణిస్తాం. మధ్యాహ్నం ఎండ వేడికి అలసటతో పాటు పాదాలు తొందరగా బొబ్బలు కడతాయి. వాతావరణాన్ని బట్టి ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు, ఎనిమిది వరకు నడిచేవాళ్లం. అనంతరం విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు, ఐదు గంటలకు నడక ప్రారంభించేవాళ్లం. అమ్మ దయ.. ప్రజలు, దాతల ఆదరణతో మమేకం అవుతూ.. వారిచ్చే ఫలహారాలు స్వీకరిస్తాం. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే ఏటా పాదయాత్రగా వచ్చి అమ్మవారిని దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతుంది.



కాలినడకన వస్తున్న భవానీలు

వరుసగా మూడో ఏడాది వస్తున్నాం..

గోవింద, వీరబాబు, కనకరాజు (పెద్దాపురం)

ఏటా అమ్మ దీక్ష చేపడతాం. కాలినడకన రావడం ఇది మూడోసారి. పాదయాత్రగా అందరం కలిసి రావడం వల్ల అలసట తెలియదు. అందరం సరదాగా సాగడం నిజంగా ఒక అనుభూతి. ప్రజలు ఎక్కడికక్కడ పళ్లు, నీళ్ల బాటిళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారు. రాత్రి సమయంలో నిద్రించేందుకు స్థలం లేకపోతే మధ్యదారిలో గ్రామస్తులు కాని, షాపుల యజమానులు కాని వారికి తెలిసిన ప్రదేశాలు చూపించేవారు. అమ్మవారి దయవల్ల ఎక్కడా ఆటంకం కలగలేదు.



సర్పవరం నుంచి పాదయాత్రగా వచ్చిన భవానీలు

భవానీ భక్తులకు ప్రాధాన్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భవానీ భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. భవానీ మాలభక్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు రెండు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశామని తెలిపారు. గుంటూరు, కృష్ణాజిల్లాల కలెక్టర్లతో మాట్లాడి భవానీ భక్తులకు సరిహద్దుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయటంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలని సూచించినట్టు తెలిపారు. భవానీలు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

అమ్మ భక్తులకు అలుపెరగని సేవ

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించేందుకు దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లుచేశాయి. చిన్నారులకు వేడి పాలు, క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి బిస్కెట్లు అందిస్తున్నారు. మొదటి ఎనిమిది రోజుల్లో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, 3.60 లక్షల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలు భక్తులకు అందజేశారు. 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటుచేశారు. అధికార యంత్రాంగంతో పాటు వందలాదిమంది సేవకులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. పోలీసు యంత్రాంగం 'సేవాదళ్' పేరిట భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందిస్తోంది. 'శక్తి సేవ' వలంటీర్లు భక్తులకు సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థ నుంచి 1490 మంది పారిశుధ్య కార్మికులు రేయింబవళ్లు అలుపెరగకుండా ఆలయ ప్రాంగణంలో సేవలందిస్తున్నారు. మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కొండపై పరిశుభ్రంగా ఉండటం చూసి పారిశుధ్య సిబ్బందిని అభినందించి వారితో ప్రత్యేకంగా ఫోటో దిగారు.



కొండపైకి బస్సులు వెళ్లకుండా అడ్డంగా ఉన్న బారికేడ్లు

బారికేడ్లు తొలగించరూ..!

పాయకాపురం : మూలా నక్షత్రం రోజున పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు భక్తులకు ఇబ్బందిగా మారాయి. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీస్‌కు ఆటంకం ఏర్పడుతోంది. మూలా నక్షత్రం తర్వాత బారికేడ్లు అలాగే వదిలి వేయడంతో బస్సులు కొండపైకి వెళ్లే మార్గం లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా బారికేడ్లు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



జల్లు స్నానాల వద్ద గజ ఈతగాళ్లు

గజ ఈతగాళ్లు సిద్ధం..

పాత రాజరాజేశ్వరిపేట : దసరా పండుగను పురస్కరించుకుని భక్తులకు ఏర్పాటు చేసిన జల్లు స్నానాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

- జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు

విజయవాడ/మచిలీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో మెగా డీఎస్సీ-2025లో భాగంగా ఎంపికైన 1203 మంది అభ్యర్థులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారులు యూవీ సుబ్బారావు, డీఈవో పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన వెల్లడించారు. పామర్రులోని ప్రగతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో 945 మందికి, నిడమనూరులోని వాహిణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో 258 మంది అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ తమకు కేటాయించిన కేంద్రాల్లో ఎనిమిది రోజుల ఇండక్షన్ ట్రైనింగ్‌కు తప్పనిసరిగా హాజరవాలని ఆయన సూచించారు.

దుర్గే దుర్గతినాశని..

(5వ పేజీ తరువాయి)

సమయానికి 1,05,972 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. 32,006 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగుతోంది. వినాయకుడి ఆలయం నుంచి కెనాల్ రోడ్డు వరకు క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. అక్కడి నుంచి ఇంద్రకీలాద్రి వరకు మొత్తం క్యూ లైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. క్యూల్లో ఉన్న భక్తులు జై భవానీ నినాదాలు చేస్తూ ప్రధానాలయం వద్దకు చేరుకున్నారు.

తొమ్మిది రోజులు.. 10 లక్షల మంది

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఇప్పటివరకు 10,81,190 మంది భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సెప్టెంబరు 22 నుంచి మొదలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 లక్షలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మూలానక్షత్రం రోజున ఆలయం మూసివేసే సమయానికి 1,94,097 మంది భక్తులు సరస్వతీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. 22న 84,417 మంది, 23న 90,190 మంది, 24న 1,00,110 మంది, 25న 1,30,846 మంది, 26న 1,25,486 మంది, 27న 1,21,690 మంది, 28న 1,28,382 మంది, 29న 1,94,097 మంది అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శనం చేసుకున్నారు. మంగళవారం 1,05,972 మందికి అమ్మవారు దర్శనం ఇచ్చారు. మొత్తం ఇప్పటి వరకు 10,81,190 మంది కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అన్న ప్రసాదాన్ని 2,70,791 మంది స్వీకరించారు. కాగా, బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనం ఇవ్వనున్నారు.

నదిలో హంస విహరించేనా!

(5వ పేజీ తరువాయి)

పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గడచిన ఏడాది వరద ఉధృతి కొనసాగడంతో నదీ విహారాన్ని నిలుపుదల చేశారు. హంస వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి బ్యారేజీకి 6.50 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ వరద ప్రవాహం బుధవారానికి ఏడు లక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి మొత్తం వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహం హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. రెండు రోజులుగా ఇన్‌ఫ్లో ఆరు లక్షల క్యూసెక్కుల వద్ద నికరంగా ఉంది. ఈ వరద పెరిగే అవకాశాలు ఉన్నాయని ఫోర్‌కాస్ట్ విడుదల చేశారు. దశమికి ఇంకా ఒకరోజు సమయం మాత్రమే ఉండటంతో అధికారులు హంస వాహనాన్ని సిద్ధం చేయిస్తున్నారు. గడచిన ఏడాది కృష్ణా నదికి వరద కొనసాగినప్పటికీ హంస వాహనంపై పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి జలవనరుల శాఖ అధికారులు నిరభ్యంతర ధ్రువీకరణపత్రం ఇచ్చారు. నాడు వరద ప్రవాహం 70వేల క్యూసెక్కుల లోపు ఉండడం వల్ల పూజా కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే అనుమతి ఇచ్చినట్టు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరద ఆరు లక్షల క్యూసెక్కులు దాటడంతో పూజా కార్యక్రమాలను హంస వాహనంపై అనుమతించలేమని అధికారులు చెబుతున్నారు. ఇదే కనుక జరిగితే ఈ ఏడాది దసరాలో తెప్పోత్సవం రద్దవుతుంది. దశమి రోజున నిర్వంచాల్సిన తెప్పోత్సవం ఇప్పటి వరకు వర్షాలు, వరదల కారణంగా మూడు సార్లు రద్దయిందని దేవస్థాన వర్గాలు చెబుతున్నాయి.

ఆహా!.. ఏమి నాణ్యత!

గుణదల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్ రోడ్డుపై రాకపోకలు ప్రారంభించి నిండా పదేళ్లు పూర్తికాకముందే కాంక్రీటు ఊడిపోయి రంధ్రం పడ్డ ఘటనతో నాణ్యతా లోపం వెలుగుచూసింది. విజయవాడ సిటీ ట్రాఫిక్ తగ్గించేందుకు ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని రూ.122.35 కోట్ల వ్యయంతో చేపట్టారు. 2014లో నిర్మాణ సమయంలో పిల్లర్స్‌పై అమర్చిన ఓ గడ్డర్ ప్రమాదవశాత్తు రాత్రి సమయంలో విరిగి కిందపడిపోయింది. ఆ సమయంలో అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. గడ్డర్ విరిగిపడ్డ ప్రదేశంలోనే మరలా ఇప్పుడు సరిగ్గా స్లాబు కాంక్రీటు ఊడి కిందపడిపోవడంతో పెద్ద రంధ్రం ఏర్పడింది. అదృష్టవశాత్తు పైనుంచి ఏ వాహనం వెళ్లలేదు.. వెళ్లివుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. ఇన్నర్ రింగ్ రోడ్డును 2016 జూలై 27వ తేదీన ప్రారంభించారు. ఇప్పటికే పలుమార్లు స్లాబులకు మధ్యన ఉండే జాయింట్లు ఊడిపోవడంతో మరమ్మతులు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్‌పై రాకపోకలు మొదలు పెట్టి కనీసం 10 సంవత్సరాలు కూడా నిండకముందే ఏకంగా స్లాబుకు రంధ్రం పడటంతో నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో పాటించారన్నది తేటతెల్లమైపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమై పర్యవేక్షణ చేసి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకపోతే పెనుప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని నగరం వెలుపల నుంచే వాహనాలను బయటికి తరలించాలన్న ఆలోచనతో ఇన్నర్ రింగ్ రోడ్డు వైపునకు వాహనాలను మళ్లించడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఈ రంధ్రం మరింతగా పెరిగిపెద్దదయ్యే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోమారు నాణ్యతా పరీక్షలు జరిపి కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ ప్రదేశం నుంచి ద్విచక్ర వాహనం వెళ్లివుంటే వాహన చక్రం అందులో ఇరుక్కొని ప్రమాదం జరిగి ఉండేది. అదే భారీ వాహనం వెళ్లివుంటే ఆ ప్రమాదం ఊహించలేమంటున్నారు.

అందమైన భామలు

(5వ పేజీ తరువాయి)

నడుమ జరిగిన క్రౌన్ ఆఫ్ విజయవాడ పోటీలు దద్దరిల్లాయి. మిస్ విజయవాడ, మిసెస్ విజయవాడ, మిస్ టీన్ విజయవాడ, కిడ్స్, జూనియర్స్ మొత్తం ఐదు కేటగిరీలలో జరిగిన పోటీలు విజయవాడ ఉత్సవ్‌కే హైలెట్‌గా నిలిచాయి. 300 మందితో మొదలైన పోటీలు.. ఆడిషన్స్‌కు వచ్చేసరికి 150 మంది ఎంపికయ్యారు. అంతిమంగా 90 మంది ఆయా కేటగిరీలలో పోటీలు పడ్డారు. మిస్ విజయవాడగా కె.రేష్మ, మిసెస్ విజయవాడగా ఎస్.సౌందర్య ఎంపికయ్యారు. మరోవైపు పున్నమిఘాట్‌లో కెమెలియన్ ఫ్లూట్ మోడ్రన్ మ్యూజిక్ వీక్షకులను కట్టిపడేసింది. కెమెలియన్ భారతీయ సంగీతంతో పాటు ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఆధునిక సంగీతాన్ని ఫ్లూట్‌పై చేసిన ప్రదర్శన ప్రేక్షకుల నుంచి చప్పట్లు కొట్టించాయి. విజయవాడ ఉత్సవ్‌లో తొలిసారిగా కాంతారా చాప్టర్ - 1 మూవీ ప్రీ రిలీజ్, ఓ పాట విడుదల చేశారు. నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టితో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంతలు సందడి చేశారు. మిస్ విజయవాడ, మిసెస్ విజయవాడలుగా ఎంపికైన కే రేష్మ, ఎస్ సౌందర్యలకు జ్ఞాపికలు బహూకరించారు. గొల్లపూడిలో ఎగ్జిబిషన్ 12 సంవత్సరాల తర్వాత నూతన సొసైటీ పరిధిలో ఏర్పాటు కావటం విశేషం కాగా.. పూర్తిస్థాయిలో ఎగ్జిబిషన్ అందుబాటులోకి వచ్చింది. మొత్తం 600 స్టాళ్లతో వ్యవసాయ, పారిశ్రామిక ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎప్పటిలాగానే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించగా.. జానపద నృత్యాలు దుమ్ములేపాయి. శాస్త్రీయ సంగీత కచేరీలు మంత్ర ముగ్ధులను చేశాయి. మిమిక్రీలు, మ్యాజిక్ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఘంటసాల సంగీత కళాశాలలో నాటికలు, నాటకాలు రక్తి కట్టించాయి. ఖడ్గ తిక్కన పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.



కొండాలమ్మ ఉత్సవమూర్తిని పల్లకీపై మోస్తున్న వెనిగండ్ల, రావి

కొండాలమ్మ ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, కూటమి ప్రభుత్వానికి కొండాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలను వెనిగండ్ల రాము ఘనంగా ప్రారంభించారు. వేమవరం కొండాలమ్మ దేవస్థానంలో మంగళవారం అమ్మవారు కనకదుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి పంచలోహ ఉత్సవమూర్తి పల్లకీ ఉత్సవాన్ని ఎమ్మెల్యే రాము, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. అనంతరం 30 వేలమంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సంప్రదాయ డప్పులు, కేరళ వాయిద్యాలు, గరగర డప్పులు, కాళికా నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, భజనల నడుమ వేమవరం, వడ్లమన్నాడు, పద్మాలపాలెం, కౌతవరం గ్రామాలలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాను మరణించి.. నలుగురికి ప్రాణం

- బ్రెయిన్ డెడ్ అయిన ప్రదీప్ అవయవదానం



గన్నవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాను మరణించి నలుగురికి పునర్జన్మనిచ్చాడు. నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపాడు. ఆస్పత్రిలో బంధువును పరామర్శించేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురై కుటుంబానికి దూరమయ్యాడు మొవ్వ ప్రదీప్‌కుమార్. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్(46) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. సెప్టెంబరు 25న గన్నవరం మండలం చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వస్తుండగా శ్రీనివాస హేచరీస్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబరు 29న బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులకు వివరించగా ప్రదీప్‌కుమార్ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్‌ను కలిశారు. లివర్, ఒక కిడ్నీ తాడేపల్లిలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి, మరో కిడ్నీ గుంటూరు సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు, లంగ్స్ హైదరాబాద్‌కు తరలించారు. ప్రదీప్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. అవయవదానం చేసిన కుటుంబసభ్యులను పలువురు ప్రశంసించారు.

విజయవాడ తూర్పు

వర్షంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భక్తులకు వర్షంతో ఇబ్బందులు కలగకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారులపై నిలిచిన వర్షంనీటిని తొలగించాలని టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా ఉంటూ వర్షపునీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మరుగుదొడ్ల పాయింట్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించి వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

దసరా ఉత్సవాలకు వీఎంసీ ఏర్పాట్లు భేష్

●భక్తులు చెప్పులు, సామాన్లు భద్రపర్చుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ●కొండపైన, క్యూలైన్‌లలో, కొండ చుట్టూ మంచినీటి ఏర్పాట్లు

కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులకు దేశ, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు నగర పాలక సంస్థ అందిస్తున్న సేవలు భేష్ అని భక్తుల నుంచి మన్ననలు పొందుతుంది. కొండపైన, కొండ చుట్టూ పారిశుధ్య నిర్వహణతో పాటు, క్యూలైన్‌లలో మంచినీటి పంపిణీ, భక్తుల రద్దీని బట్టి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఎప్పటికప్పుడు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వీఎంసీ భేష్ అంటూ మన్ననలు అందుకుంటున్నారు. ఘాట్లతోపాటు ప్రధాన రహదారులు, హోల్డింగ్ పాయింట్లలో మంచినీటి సదుపాయాలతో పాటు కొండ చుట్టూ తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఏర్పాట్లను పరిశీలిస్తూ భక్తుల సమస్యలతోపాటు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా భక్తులకు సామాన్లు, చెప్పులు భద్రపర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..



చెప్పల స్టాండ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

1490 మంది శానిటరీ సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ

దసరా ఉత్సవాలకు సుమారు 1490 మంది సిబ్బంది పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఇంజనీరింగ్, ఎస్టేట్ ఇతర విభాగాలకు చెందిన సుమారు 700 మంది అధికారులు, సిబ్బంది దసరా విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలు అందిస్తున్నారు. 9 ప్రాంతాల్లో చెప్పల స్టాండ్, క్లోక్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. కొండ చుట్టూ సుమారు 19 ప్రాంతాల్లో 405 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. 45 వాటర్ పాయింట్లు ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీరుస్తున్నారు. కమిషనర్ ధ్యానచంద్ర. పలువురు అధికారులు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహిస్తూ భక్తుల నుంచి వీఎంసీ భేష్ అంటూ మన్ననలు పొందుతున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన పన్నుల భారాలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె , తదితరులు

భారతీనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు డబుల్ బెనిఫిట్స్ పొందుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణల- 2.0ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ జీఎస్టీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన కార్యాలయంలో జీఎస్టీ 3వ డివిజన్ జోనల్ కమిషనర్ కె.గోపిచంద్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న జీఎస్టీ -2.0సంస్కరణల వల్ల ప్రజలపై పన్నుల భారాలు బాగా తగ్గి డబ్బు ఆదా అవుతుందని అన్నారు. జీఎస్టీ సంస్కరణలతో మహిళా సాధికారతకు భరోసా కల్పించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేటేటి రాజమోహన్, పి.తరుణ్, సాయి, వేమూరి అనిల్, రాజ, పాల్గొన్నారు.

రిటైనింగ్‌వాల్ ప్రాంతాల పరిశీలన

రామలింగేశ్వరనగర్: రామలింగేశ్వరనగర్ శ్మశాన వాటిక దగ్గర నుంచి భూపేష్ గుప్తా నగర్ వరకు రిటైనింగ్‌వాల్ ప్రాంతాలను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడ వెంట వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు నీటిని తోడేందుకు ప్రత్యేకంగా మోటర్‌లను సైతం అందుబాటులో ఉంచామన్నారు. గోడ బయట ఉన్న స్థల యజమానులకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ కూడా ప్రభుత్వం చేపడుతుందని అయితే అందుకు కేంద్రం అనుమతులు కావాలన్నారు. జనసేన నాయకుడు గాదిరెడ్డి అమ్ములు. కార్పొరేషన్ జోనల్ కమిషనర్ షమీ, ఈఈ పాల్గొన్నారు.



దుర్గాదేవిగా కాళీమాత, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో, రాణిగారితోటలోని మహాశక్తి ఆలయంలో, ఆటోనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో, పటమట ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద, పటమట దత్తపీఠంలో, ముద్దిరావమ్మ తల్లి

దుర్గమ్మా..అభయమివ్వమ్మా

కృష్ణలంక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల తొమ్మిదవ రోజైన మంగళవారం త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు దుర్గా దేవిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి కుంకం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని సిద్ధేశ్వరీ పీఠ మహాసంస్థాన్‌లో పీఠదేవత సిద్ధేశ్వరీ అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

లబ్బీపేట: రాణిగారితోటలోని మహాశక్తి ఆలయంలో అమ్మవారు మంగళవారం కనకదుర్గమ్మగా దర్శన మిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజతో పాటు హోమాలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆటోనగర్‌లో దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం

ఆటోనగర్: జవహర్ ఆటోనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ప్రసాదం, తీర్థం స్వీకరించారు.

రామలింగేశ్వరనగర్: పటమట ఎస్ఎస్ఎం స్కూలు దగ్గర కౌండిన్యనగర్‌లో దేవీభక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సమత ఆధ్వర్యంలో కుంకుమ పూజ, అనంతరం చిన్న పిల్లల నృత్య ప్రదర్శన జరిగింది.

భారతీనగర్: దసరా మహోత్సవాల సందర్భంగా మంగళవారం కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో రామభక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ● గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీముద్దిరావమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు, ఆర్ఆర్ గార్డెన్‌లోని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దుర్గాదేవిగా, పటమట దత్తపీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండ మీద మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో మంళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారికి కనకాంబరం రంగు వస్త్రంతో అలంకరణ, ఎర్ర మందార పూలతో పూజ, కొబ్బరి అన్నంతో నివేదన చేశారు. సాయంత్రం లలితాపారాయణం, దశవిధ హారతులు, నీరాజన మంత్రపుష్పం, వేదస్వస్తి సమర్పించారు. అనంతరం అమ్మవారిని సిద్ధిధాత్రిగా గాయత్రీనగర్, మొగల్రాజపురంలో ఊరేగించారు. వేదిక అలంకార దాతగా విజయ డెయిరీ, స్వర్ణాభరణ అలంకరణ దాత పీఎంజే జ్యూయలర్స్ వారు ఉన్నారు.



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దుర్గాదేవిగా అమ్మవారు, శివాభిషేకం, ధనకొండ అమ్మవారు

కేఆర్ మార్కెట్‌లో ఎంపీకి సత్కారం



ఎంపీని గజమాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న కమిటీ సభ్యులు

వన్‌టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరరావు మార్కెట్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను గజమాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందచేసి, దుశ్శాలువా కప్పారు. కనకదుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్నవితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మైలవరపు కృష్ణ, ఉపాధ్యక్షుడు ఆకుల రాజు, కోశాధికారి ఎ.గంగాధర్, సభ్యులు పైడి కృష్ణ, ఎల్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు సత్కారం



ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

ఆటోనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 38ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన కె. ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆటోనగర్‌లోని ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో అధికారులు మోషే, రాంబాబు, కె. శ్రీనివాసరావు, పి. సురేష్ తదితరులు ప్రవీణ్‌కుమార్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన ఆర్టీసీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సెంథిని హాస్పిటల్ వెళ్లే రోడ్డులో ఒరిగిపోయిన మొక్కలు, చిన్ని మెడికల్ షాపు వద్ద మొక్కలకు ఫెన్సింగ్

మొక్కలు నాటారు...రక్షణ మరిచారు

భారతీనగర్,ఆంధ్రజ్యోతి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సెంథినీ హాస్పిటల్ రోడ్లో కాలనీ పెద్దలు, అధికారులు కలసి మొక్కలను నాటారు.

రమేష్ ఆసుపత్రి సెంటర్ నుంచి చిన్ని మెడికల్ షాపు వరకు నాటిన మొక్కలు జంతువుల బారిన పడకుండా వాటికి రక్షణగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. సెంథిని హాస్పిటల్ వైపు ఉన్న రోడ్డులోని మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో మొక్కలు ఒరిగిపోతున్నాయి. ప్రస్తుతం వీటిని పట్టించుకునే నాధుడే లేకపోవడంతో మొక్కలు నాశనం అయిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బందరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

వన్‌టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫైర్‌స్టేషన్ సమీపంలోని బందరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్లు మంగళవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంకలో 20వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కగ్గా వీరప్రసాద్ మంగళవారం ఉదయం విధుల్లో ఉండగా ఫైర్‌స్టేషన్ సమీపంలోని బందరు కాలువలో దుర్వాసన రావటం గమనించి వెళ్లి చూడగా మహిళ మృతదేహం ఉండటంతో పోలీసులకు సమాచారం తెలిపారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పరిశీలించగా ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించకపోవటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి సుమారు 60 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని, ఒంటిపై గ్రీన్ కలర్ చీర, అదేరంగు జాకెట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బోరుపంపు తొలగించారు



బోరు పంపు తొలగించడంతో అంబేడ్కర్ నగర్ కాలువ గట్టు ప్రాంత వాసులు తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. బోరు పంపు సరిగా పని చేయకపోవడంతో మరమ్మతులు చేయించకపోగా ఉన్న పంపును తొలగించారని ఆ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు పంపును యథాస్థానంలో ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

-రామలింగేశ్వరనగర్,ఆంధ్రజ్యోతి







దసరా వచ్చిందయ్యా!

● విజయవాడ ఉత్సవ్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు ● పవిత్ర సంగమం వద్ద హెలీరైడ్‌కు ఆదరణ

విజయవాడ కల్చరల్/విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో పుష్కర కాలం తర్వాత విజయవాడ వైబ్రెంట్ పేరుతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ అందరి ఆదరాభిమానాలు అందుకుంటోంది. పలు వేదికల్లో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. ఫుడ్ కోర్టుల్లోని వంటకాలను సందర్శకులు ఎంజాయ్ చేస్తున్నారు. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు, పర్యాటకులు తండోపతండాలుగా వచ్చి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ఆయా వేదికల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, విశేషాలను ఒకసారి పరిశీలిద్దాం.

ఇంద్రకీలాద్రి వేదికపై..

కనకదుర్గానగర్‌లోని దేవస్థానం కళావేదికపై ఆదివారం ఉదయం సూరంపల్లి గ్రామానికి చెందిన రత్నకుమారి బృందం భజన సంకీర్తన, ఆశ్రీత బృందం, జయరామ సుధాకర్ బృందం, మాధవీ కృష్ణబృందం, రూపనాగ తేజస్వి బృందం సంగీతార్చన చేశారు.తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వై.దుర్గాప్రసాద్ బృందం- శ్రీరామ జననం అనే బుర్రకథను గానం చేశారు. నగరానికి చెందిన భార్గవి, కృష్ణప్రియ, శ్రీవల్లి, పవిత్ర, బెంగళూరుకు చెందిన దివ్య, నెల్లూరుకు చెదిన జాహ్నవి, విజయవాడకు చెందిన రజితాదేవి, వైఎస్‌వీఎన్ అనురాధ బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ప్రదోషకాలంలో కమనీయంగా జరిగే దుర్గా మల్లేశ్వరుల నగరోత్సవంలో రేవతి బృందం ప్రదర్శించిన చెక్క భజన, కోలాట నృత్యం ఆకట్టుకున్నాయి. గుంటూరుకు చెందిన విజయగౌరీ, కర్నూలుకు చెందిన సాయి లిక్షిత, విజయవాడకు చెందిన దివ్య స్రవంతి, హర్ష, జావలి, రమాదేవి బృందాలు సంప్రదాయ నృత్యాంశాలు ప్రదర్శన చేశారు. కళా బృందాలకు దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కే గంగాధర్ ప్రశంసాపత్రం, అమ్మవారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తొమ్మిదో రోజు తొమ్మిది కళాప్రదర్శనలు నిర్వహించారు. నున్నకు చెందిన మందాడకు నాగమనోజ్ఞ, ఎస్ బెన్వికసాయి, నెల్లూరుకు చెందిన కే సంజనారెడ్డి, జగన్, కర్నూలుకు చెందిన గంగాధర్ శిష్య బృందాలు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను రంజింపజేశాయి. తిరుపతికి చెందిన వెంకటేశ్వర్లు ఆలపించిన వేంకటేశ్వర కల్యాణం, హరికథా గానం నవరస భరితంగా సాగింది. తబలాపై దేవశర్మ, కీబోర్డుపై ఎస్ మురళి వాయిద్య సహకారం అందించారు. తాపేశ్వరానికి చెందిన కే సత్తిబాబు బృందం వీరనాట్యంతో వీరంగం చేశారు. చివరగా ప్రదర్శించిన ఖడ్గ తిక్కన చారిత్రాత్మక నాటకం రక్తి కట్టించిది.

సంగీత కళాశాలలో..

నగరానికి చెందిన జీ సాహితి బృందం సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. వీరి గాత్రానికి శ్రీదేవి చింతల వయోలిన్‌పై, పాలెపు విమలేష్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. అనంతరం చింతా వెంకట సీతారామాంజేయుల బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యబృందం ఆకట్టుకున్నాయి. కాకినాడకు చెందిన కోటా సుబ్రహ్మణ్యం తోలుబొమ్మలాట ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. గంగాధర్ వెంట్రిలాక్విజం, మ్యాజిక్ ఆనందోత్సవాల్లో ముంచెత్తాయి. బావా ఎప్పుడు వచ్చితివి పేరిట భారతంలోని పడక సీను నాటక ఘట్టాన్ని చక్కగా ప్రదర్శించారు. సీహెచ్ అజయ్‌కుమార్ బృందం విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలతో మనోరంజకంగా నర్తించారు.

పవిత్ర సంగమంలో..

పవిత్ర సంగమంలో శతమయూరి నృత్యం కన్నుల పండుగగా సాగింది. కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయనర్తనలో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం 100 మంది నృత్య కళాకారులు బృందాల వారీగా తమ నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. నగరానికి చెందిన హంసధ్వని కూచిపూడి నృత్యాలయ బృందం 50 మంది, సత్తెనపల్లి తారక్, ఛత్రపతి నాట్య కళానిలయానికి చెందిన 30 మంది బృందం రుద్ర కళాక్షేత్రానికి చెందిన 20 మంది బృందం కళాకారులు నయానందకరంగా నర్తించి మెప్పించారు. సీహెచ్ అజయ్‌కుమార్ తన శిష్య బృందంతో నవదుర్గలు, అఖిలాండేశ్వరి చాముండేశ్వరి, ఊరూ పల్లెటూరు ఫోక్, హిమగిరి తనయే, గరుడ గమన, శ్రీకరముగా శ్రీదేవి వంటి అంశాలతో మంత్రముగ్ధులను చేస్తూ కూచిపూడి నృత్యాంశాలు ప్రదర్శించారు. చివరిగా సత్తెనపల్లికి చెందిన తారక్ చత్రపతి నాట్య కళానిలయం, తేనేటి కరుణాకర బృందం అన్నమయ్య కృతులకు చక్కని కూచిపూడి నాట్యాంశాలు నర్తించారు. మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన కూచిపూడి నాట్యానికి కృష్ణాతీరం పుట్టినిల్లు కావడం మన అదృష్టమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందించారు. నాట్యాచార్య నరేంద్ర, పావని నిర్వహించారు.



ఫ్లయింగ్ పారాచ్యూట్

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ నగరంలోను, పవిత్ర సంగమం వద్ద పారా మోటార్ ఫ్లైయింగ్ ఏర్పాటు చేశారు. ఒక ఫ్లైయింగ్‌కు ఒకరికి రూ.2 వేలు టిక్కెట్ ధర నిర్ణయించారు. మొదటిసారిగా పారా మోటార్ ఫ్లైయింగ్ ఏర్పాటుతో స్థానికులు, నగరానికి వచ్చే పర్యాటకులు కృష్ణా నదీ తీరంలో విహరించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. క్వాలిఫైడ్ పైలెట్స్ నిర్వహణతోపాటు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర టూరిజం ఎక్సలెన్స్ అవార్డును సీఎం చంద్రబాబు విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ నిర్వాహకుడికి అందించారు.



పున్నమీ ఘాట్‌లో..

వేణువుపై ఒకే ట్యూన్‌ను భారతీయ సంగితంతో ప్రారంభించి ఆఫ్రికన్ మ్యూజిక్‌తో మ్యాజిక్ చేసి, ఆస్ట్రేలియన్ సంగీతంతో ముగించిన కెమిలియన్స్ (ఊసరవెల్లి) సంగీతం ప్రేక్షకులను ఆద్యంతం అబ్బురపరిచింది. కేవలం వేణువు, డ్రమ్స్ సాయంతో ఇచ్చిన మురళీ గానం అబ్బురపరిచింది. దాదాపు అర గంట పాటు సాగిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. వేదికపై ముందుగా వీర నాట్య మండలి బృందం చేసిన వీర నాట్యం పురాణ కథ రక్తి కట్టించింది. తర్వాత నగరానికి చెందిన కిరణ్మయి, పల్లవి కూచిపూడి నాట్యంతో జయదేవుని ఆటను కళ్లకు కట్టారు. చివరిగా నలంద కాలేజీ కాలేజీ విద్యార్థులు కనకదుర్గాదేవి నాట్య ప్రదర్శన ఇచ్చి అలరించారు. తర్వాత దాండియా డీజే బృందం ప్రేక్షకులతో కలిసి దాండియా నృత్యాలు చేశారు.

ఎగ్జిబిషన్‌కు పెరుగుతున్న ఆదరణ

గొల్లపూడిలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. దేవీశరన్నవ రాత్రి రోజుకో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలతో, మ్యూజిక్ కన్సర్ట్‌లతో ఎగ్జిబిషన్‌కు వస్తున్న భక్తులు, ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్‌లో పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేసేందుకు పలు రకాల జెయింట్ వీల్స్ ఏర్పాటు చేశారు. ఇవి కాక ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో నార్త్ అమెరికాకు చెందిన మార్టినస్ యూనివర్సిటీ వారు, యూనివర్సిటీ ఆఫ్ గ్రీన్ విచ్ వారు, గన్నవరానికి చెందిన ఉషారామా కళాశాల వారు ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేశారు.

పలు రకాల రుచులతో ఫుడ్ కోర్టు

ఎగ్జిబిషన్‌కు వచ్చే వారికి పలు రకాల వంటకాలతో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. సుమారు 10 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఫుడ్‌కోర్టులోని ఫుడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. కృష్ణామిల్క్ యూనియన్ వారు పాల పదార్థాలను విక్రయిస్తున్నారు.

ఈఫిల్ టవర్ వద్ద సెల్ఫీల సందడి

ఎగ్జిబిషన్ ఎంట్రన్స్‌లో పారిస్ ఈపిల్ టవర్ నమూనాను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అలంకరించారు. దీంతో ఎగ్జిబిషన్‌కు వచ్చే వారు అక్కడ ఆగి దాని ముందు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు. మొత్తం మీద గొల్లపూడి ఎగ్జిబిషన్‌కు రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతుంది.



విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

గొల్లపూడిలో..
ప్రముఖ సింగర్ కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్
పున్నమిఘాట్‌లో..
సింగర్ రాహుల్ వెల్లాల్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్
డీజే చెండా అండ్ వాటర్ డ్రమ్స్
తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..
హైదరాబాద్ కు చెందిన మయూరి డ్యాన్స్ అకాడమీ బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన
సంగీత కచేరీ
కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన ప్రేమానందం బృందం బుర్రకథ
గుంటూరుకు చెందిన పీవీ రమణ జానపద గేయాలు
కాకినాడకు చెందిన అనపర్తి ఏడు కొండలు బృందంతో తోలు బొమ్మలాట
శ్రీ సత్యసాయి కళానికేతన్ సమర్పించు ప్రసిద్ధ పౌరాణిక పద్యనాటకం శ్రీ కృష్ణ రాయబారం
ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో..
విజయవాడకు చెందిన హవీషా చౌదరి బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన
సంగీత కచేరీ
విశాఖపట్నానికి చెందిన విజయ కుమార్‌తో డాల్ డ్యాన్స్ అండ్ రోబో డ్యాన్స్ ప్రదర్శన
అమలాపురానికి చెందిన వీ సత్యనారాయణ బృందంతో తోలు బొమ్మలాట
విజయవాడ సాంస్కృతిక సమితి విజయవాడ వారిచే సాంఘిక నాటిక 'కలహాల కాపురం'

కళాకారులను గుర్తించిన ఏకైక ప్రభుత్వం

విజయవాడ: కళాకారులకు చేయూతనిచ్చి గుర్తిస్తున్న ప్రభుత్వం ఒక్క కూటమి ప్రభుత్వమేనని కళా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రఘురామరాజు, నవనీతం సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో "సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ" సారథ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టీవ్ కార్నివాల్ విజయవాడ ఉత్సవ్‌కు రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికపై పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కూచిపూడి, సంగీత కచేరీ, మ్యాజిక్ షో, తోలుబొమ్మలాట, నాటక ప్రదర్శించిన కళాకారులకు చిరుసత్కారం నిర్వహించారు. కళావేదికపై రఘురామరాజు, నవనీతం సాంబశివరావు, దాసరి జయరాజ్, నాగేంద్ర సింగ్, మోహర్, పీహెచ్ అజిత్‌కుమార్, రఘునాథ్ కళాకారులను సత్కరించారు. ఈ నెల 2న జరిగే విజయవాడ ఉత్సవ్ ఊరేగింపును నగరంలో నిర్వహిస్తున్నామని ఈ ఊరేగింపులో 3వేల మంది కళాకారులు పాల్గొంటారన్నారు.



విజయవాడ ఉత్సవ్‌లో కాంతారా చాప్టర్ - 1



విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్ కళావేదికపై కాంతారా మూవీ టీమ్ మంగళవారం రాత్రి సందడి చేసింది. కాంతారా చాప్టర్ 1 మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి, అతడి సతీమణి ప్రగతి శెట్టి, హీరోయిన్ రుక్మిణి వసంత హాజరయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. హీరో రిషబ్ శెట్టి మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం వల్లే కాంతారా మూవీ విజయవంతమైందని, అలాగే అక్టోబర్ 2న విడుదలవుతున్న కాంతారా చాప్టర్ 1 మూవీని సినిమా థియేటర్లో తిలకించి విజయవంతం చేయాలని కోరారు. హీరోయిన్ రుక్మిణి వసంత, కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసిన ప్రగతి శెట్టి ప్రేక్షకులు తమ సినిమాను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుందని, అలాగే సినిమా విజయోత్సవాన్ని విజయవాడలో జరుపుకుంటారని ఆకాంక్షించారు.

గాంధీ కొండపై చకచకా అభివృద్ధి పనులు

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా విజయవాడ వన్‌టౌన్‌లోని గాంధీకొండపై నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో కొండపై చేస్తున్న పనులు చకచకా సాగుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ కేసీపీ గాంధీ, వైస్ ఛైర్మన్ జంధ్యాల శంకర్, అధికారులతో కలిసి మంగళవారం కొండపై జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటకులకు సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా ఉండేందుకు కొండను తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రోడ్డు విస్తరణ, లిఫ్ట్ నిర్మాణం, రైల్వే ట్రాక్, పార్కుల అభివృద్ధి పనులు పరిశీలించామని, గాంధీ స్మారకస్థూపం పరిసరాలను అందంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లైటింగ్ ఏర్పాటుతో కొండకు కొత్త కళ రానుందన్నారు. గాంధీ కొండను పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా సాంస్కృతిక కార్యకలాపాలకు వేదికగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా చేయాలని ఆదేశించారు.

రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్ ఫారంపై ఫోన్ నెంబరు తప్పనిసరి

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు రైలు టికెట్లను రిజర్వ్ చేసుకునేందుకు పూర్తిచేసే ఫారంపై వారి సెల్‌ఫోన్ నెం బరును తప్పనిసరిగా వేయాలని విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ మొబైల్ నెంబర్లను తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు. ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్) కౌంటర్ల వద్ద ఫారాలు పూర్తి చేసేటప్పుడు ఫోన్ నెంబర్‌ను వేయటం మర్చిపోకూడదన్నారు. ఇలా ఫోన్ నెంబరు వేయటం వల్ల ప్రయాణికులతో సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా వెయిట్ లిస్ట్ టికెట్‌ల వివరాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. రైళ్ల రాకపోకల సమయాలు, ఆలస్యాలు, దారి మళ్లింపులు, రైళ్ల రద్దు ఇతరత్రా సమాచారాన్ని అందించటానికి వీలుంటుందన్నారు. రైళ్లు పట్టాలు తప్పటం కానీ, ఇంకా ఇతరత్రా ఇబ్బందులను గానీ అత్యవసర పరిస్థితుల్లో వివరాలను రాబట్టుకుని, తక్షణం స్పందించటానికి వీలుంటుందన్నారు. టిక్కెట్లు రద్దయిన సమయాల్లో తిరిగి చార్జిల చెల్లింపు వివరాలు తెలుసుకోవటానికి వీలుంటుందన్నారు.

సుంకాల పేరుతో ట్రంప్ ప్రపంచ యుద్ధం

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యు డు బీవీ

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో దెబ్బతిన్న పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని పునరుద్ధరించుకునేందుకే ట్రంప్ సుంకాల పేరుతో ప్రపంచ యుద్ధం చేస్తున్నారని, ఉగ్రవాద యుద్ధంగా ఇది సాగుతోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. పరోక్షంగా భారత్ విదేశాంగ విధానాన్ని ట్రంప్ దెబ్బతీస్తున్నారన్నారు. "ట్రంప్ ఉగ్రవాద నిర్ణయాలు... మోదీ మౌనం" అనే అంశంపై సీపీఎం విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బాలోత్సవ భవన్‌లో జరిగిన సభలో రాఘవులు మాట్లాడారు. ప్రపంచదేశాలపై ఒత్తిడి తెచ్చి లొంగదీసుకోవాలని ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అన్ని పేపర్లలోనూ ట్రంప్ గురించి చర్చ జరుగుతోందని, భారత విదేశాంగ విధానంలోని డొల్లతనం బయటపడుతుందని ఆరోపించారు. ఈ సమయంలో ఒత్తిడి పెరిగితే వెనక్కు తగ్గుతారని, అందువల్లే సీపీఎం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేయాలని కేంద్రం కమిటీ నిర్ణయించిందన్నారు. భారతదేశం వ్యవసాయ ఉత్పత్తులను, ముఖ్యంగా పత్తిని జీరో ట్యాక్స్‌తో దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చారని, మొక్కజొన్న, డెయిరీ ఉత్పత్తుల దిగుమతికి అనుమతులు ఇస్తున్నారని, దీని వల్ల ఆయా రంగంలో ఉన్నవారు దెబ్బతింటారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకవైపు విదేశాలపై ఆధారపడటమే దేశానికి ప్రధాన శత్రువని చెప్పిన మోదీ పత్తి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సుంకాల లేకుండా దిగుమతి చేసుకుంటున్నారన్నారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.వి.కృష్ణ, వీఎంసీలో సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు, సెంట్రల్ జోన్ నేతలు బి.రమణ, తూర్పుజోన్ నాయకులు కృష్ణ పాల్గొన్నారు..

వీనుల విందుగా చతుర్వేద పారాయణం





ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి ప్రత్యేక కుంకుమార్చన మంటపంలో మంగళవారం జరిగిన చతుర్వేద పారాయణ సభ వీనుల విందుగా సాగింది. బ్రహ్మశ్రీ చింతపల్లి ఆంజనేయ ఘనపాటి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సన్మాన సభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 450 మంది వేద పండితులు, వేద విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన దుర్గగుడి ఈవో శీనానాయక్ మాట్లాడుతూ 50ఏళ్లుగా దసరా మహోత్సవాల్లో చతుర్వేద పారాయణ సభ జరుగుతోందన్నారు. వివిధ దేవస్థానాల నుంచి వేద పండితులు ఒకేచోటకు రావటం వల్ల వివిధ అంశాల గురించి చర్చించే అవకాశం లభిస్తుందన్నారు. గత ఏడాది కంటే ఎక్కువమందికి పారితోషికం అందిస్తున్నట్టు తెలిపారు. రూ.6వేల చొప్పున 120 మంది ఘనపాటిలకు, రూ.5 వేల చొప్పున 302 మంది క్రమపాటిలకు, రూ.4వేల చొప్పున 20 మంది ఆహితజ్ఞులకు అందజేసినట్టు తెలిపారు. దుర్గగుడి ఛైర్మన్‌గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణలో వేద పండితుల పాత్ర కీలకమన్నారు. కాణిపాకం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పీ కిషోర్ కూడా పాల్గొన్నారు. 450 మంది పండితులు ఒకే గొంతుకతో చేసిన ఋగ్వేద, యజుర్వేద, సామవేద పఠనం ఆకట్టుకుంది.

కేబీఎన్‌లో శాస్త్రోక్తంగా చండీ హోమాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ రుద్ర యాగ సహిత అష్టోత్తర శత చండీయాగ మహోత్సవం మంగళవారం 9వ రోజుకు చేరింది. వేద పండితులు గరిమెళ్ల శరవణ దీక్షితులు, ప్రధానార్చకులు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీ సప్తశతి హోమాలు, శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ప్రధాన యాగశాలలో ఏర్పాటు చేసిన మంటపంలో అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనల్లో 150 మంది ముత్తయిదవులు లలిత అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కుమారీపూజ, సువాసినీ పూజ, దంపతీపూజతో ముగిశాయి. హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గొపిశెట్టి మల్లయ్య, ట్రెజరర్ గోళ్ల బాబా విజయ్ కుమార్, కేబీఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు పాల్గొన్నారు

ఏఐ టెక్నాలజీతో 200 వంటల తయారీ

● విజయవాడ ఎక్స్‌పోలో ప్రధాన ఆకర్షణ

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: కోరిన వంటలను కమ్మని రుచులతో చేసిపెడుతున్న ఆటోమేటెడ్ రోబోటిక్ చెఫ్ విజయవాడ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్రైడ్ రైస్, బిర్యానీ.. ఇలా ఏ వంట అయినా తయారుచేసి మన ముందుంచుతోంది. చేతివంటకు ఏమాత్రం తగ్గకపోవడం, వేగంగా చేసి పెడుతుండటంతో ఈ రోబో వంటకాలు ఆహారప్రియులను ఆకట్టుకుంటున్నాయి. కృత్రిమమేధ టెక్నాలజీ సాయంతో ఏ వంటకు ఏ దినుసులు.. ఎంత సెగ.. ఎన్ని నీళ్లు.. అనేది చకచకా గ్రహించేసి ఘుమఘుమలతో అందిస్తోంది. ఎక్స్‌పోలో ఫుడ్‌కోర్టు విభాగంలో ఈ రోబోటిక్ చెఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిని నాలా రోబోటిక్స్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త అనిల్ సుంకర "నాలా చెఫ్.. వింగ్‌మాన్" పేరిట రూపొందించారు. మొత్తం 200 రకాల వంటకాలను ఇది తయారు చేస్తుంది. చైనీస్, దక్షిణాది వంటకాలను ప్రత్యేకంగా చేస్తుంది. మెనూలో వంటకాన్ని మీరు ఎంపిక చేసుకుని డబ్బులు చెల్లిస్తే వెంటనే, అది తన పని ప్రారంభిస్తుంది. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఎక్స్‌పోను సోమవారం ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు రోబోటిక్ చెఫ్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ఇది తొలి ఆటోమేటెడ్ రోబోటిక్ చెఫ్ అని నిర్వాహకులు తెలిపారు.

సూర్య, చంద్ర ప్రభలపై ఊరేగిన శ్రీనివాసుడు

- నేడు మహా రథోత్సవం, ముగియనున్న వాహన సేవలు



చంద్రప్రభ వాహనంపై నవనీత కృష్ణుడిగా దర్శనమిస్తున్న మలయప్ప

తిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు మంగళవారం శ్రీనివాసుడు సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభపై బద్రీనారాయణుడి అలంకారంలో మలయప్ప స్వామి భక్తులను అనుగ్రహించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై నవనీత కృష్ణుడిగా శ్రీమలయప్పస్వామి భక్తులను అనుగ్రహించారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో మరో ప్రధాన వాహనమైన మహా రథోత్సవం (చెక్కతేరు) బుధవారం ఉదయం జరుగనుంది. రాత్రి జరిగే అశ్వ వాహన సేవతో బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ముగుస్తాయి.

సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి

- నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం



శ్రీశైలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల్లో 9వ రోజు మంగళవారం భ్రమరాంబికాదేవి అమ్మవారు సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవారు కైలాస వాహనంపై విహరించారు. బుధవారం స్వామి అమ్మవారు రమావాణీ సేవిత రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారు. బుధవారం భ్రమరాంబికా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

సీఎం గారూ.. మీరే ఆదుకోవాలి!

- సౌదీలో 'అనంత' వాసికి చిత్రహింసలు
- సెల్ఫీ వీడియోలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌కు బాధితుడి విజ్ఞప్తి
- స్వదేశానికి తీసుకువస్తామని మంత్రి భరోసా



సౌదీ నుంచి సెల్ఫీ వీడియోలో నిజాం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సౌదీలో యజమాని చిత్ర హింసలు పెడుతున్నాడని, జీతం ఇవ్వకుండా వేధిస్తున్నాడని, తనను స్వదేశానికి రప్పించాలంటూ ఓ వ్యక్తి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌కు సెల్ఫీ వీడియోలో వేడుకున్నాడు. ఈ వీడియో మంగళవారం వైరల్ కావడంతో మంత్రి లోకేశ్ స్పందించారు. అనంతపురం నగరంలోని ఆజాద్ నగర్‌కు చెందిన నిజాంకు భార్య రేష్మ, కుమారుడు సొహైల్ ఉన్నారు. గతంలో ఓసారి నిజాం సౌదీ వెళ్లారు. కుమారుడి ఆపరేషన్ కోసం సుమారు రూ.12 లక్షలు అప్పు చేశారు. వాటిని తీర్చేందుకు నిజాం రెండు నెలల క్రితం మళ్లీ సౌదీకి వెళ్లారు. ఓ వ్యక్తి వద్ద డ్రైవర్‌గా చేరారు. ఆ వ్యక్తి జీతం సరిగా ఇవ్వకపోగా, నిత్యం కొడుతూ హింసిస్తున్నాడు. దీంతో నిజాం పది రోజుల క్రితం తప్పించుకున్నారు. ఈ నేపథ్యంలో తన కష్టాలను వివరిస్తూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ విషయం తెలిసి ఢిల్లీలో ఉన్న లోకేశ్ నిజాం భార్య రేష్మకు ఫోన్ చేసి పరామర్శించారు. ఇండియన్ ఎంబసీతో మాట్లాడి, నిజాంను స్వదేశానికి తీసుకొస్తామని భరోసా ఇచ్చారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశం
- ఎల్లుండి తీరం దాటుతుందన్న వాతావరణ శాఖ
- కోస్తాలో నేడు, రేపు వర్షాలు



వేలేరుపాడు మండలంలో వరద నీట మునిగి దెబ్బతిన్న మిరప చేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనిలో ఉపరితల ఆవర్తనం కూడా విలీనమైంది. అల్పపీడనం వాయవ్యంగా పయనించి గురువారం నాటికి ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా మారనుంది. శుక్రవారం తెల్లవారుజామున ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశా మధ్య వాయుగుండం తీరం దాటనుందని వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో 4, కృష్ణా జిల్లా పెడనలో 3.95, అనకాపల్లి జిల్లా కొప్పాకలో 3.47, నర్సీపట్నం, కాకినాడల్లో 3.4 సెంటీమీటర్ల వాన పడింది. బుధవారం ఉత్తర కోస్తాలో, గురువారం కోస్తాలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం మన్యం, అల్లూరి, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయంది. కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. తీరం వెంబటి గంటకు 40-60కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

కృష్ణా, గోదావరిలో వరద ఉధృతి

కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతంగా ఉన్నట్టు విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6.69లక్షల క్యూసెక్కులు ఉండగా, 7 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50.30 అడుగులకు చేరింది. రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కూడా రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బ్యారేజీ అన్ని గేట్లు ఎత్తి సముద్రంలోకి 10,96,937 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం నుంచి రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరిలోకి 12,51,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కోనసీమ జిల్లాలోని లంక భూములను వరదనీరు ముంచెత్తుతోంది. లంక గ్రామాలకు రాకపోకలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వద్ద ప్రజానీకం నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. వందలాది ఎకరాల్లో మిరప పంట నీట మునిగి, భారీగా నష్టం ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 10,73,087 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33, దిగువన 24.600 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

బల్క్ డ్రగ్ పార్కుపై ఉన్నత స్థాయి కమిటీ వేయాలి: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుపై ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని వేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన చేశారు. 'అనకాపల్లి మత్స్యకారులది ఆవేదన నుంచి పుట్టుకొచ్చిన పోరాటం. నక్కపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై పునరాలోచన చేయాలి. డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే వాయు, జల కాలుష్యం పెరుగుతుంది, క్యాన్సర్ల బారిన పడతామని, ప్రాణాలు పోతాయని మత్స్యకారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. నక్కపల్లి మత్స్యకారుల ఉద్యమాన్ని కూటమి ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకోవాలి. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పరిశ్రమలు పెట్టి అమాయకుల ప్రాణాలు తీస్తామంటే ఊరుకునేదిలేదు. మత్స్యకారుల ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది' అని షర్మిల ప్రకటించారు.

పత్తికొండలో లారీ బీభత్సం

ఇంజన్ ఆగి.. వెనక్కి వెళ్లి.. ఆటోను తొక్కేసిన బియ్యం లారీ

- ఆటోలో ఉన్న ముగ్గురు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



తల్లీకూతుళ్లు భూమిక, శ్రీనితిక, శిరీష



సంఘటనా స్థలంలో లారీ, ఆటో

పత్తికొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బీభత్సం సృష్టించింది. ఇంజన్ ఆగిపోవడంతో వెనక్కి వెళ్లిన లారీ.. ఓ ఆటోను తొక్కేసి.. ముగ్గురి ప్రాణాలు తీసింది. కర్నూలు జిల్లా పత్తికొండలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదోని సివిల్ సప్లైస్ గొడౌన్ నుంచి రేషన్ బియ్యం లోడుతో ఓ లారీ మంగళవారం పత్తికొండ చేరుకుంది. అప్పటికే పలుమార్లు ఇంజన్ ఇబ్బంది పెట్టినా.. డ్రైవర్ మొండిగా ముందుకే వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే గుత్తి రోడ్డులోకి లారీ చేరుకుంది. పంచాయతీరాజ్ కార్యాలయం దాటాక ఎత్తుగా ఉండే ప్రాంతంలో ఇంజన్ ఆగిపోయింది. దీంతో పలు వాహనాలను తాకుతూ దాదాపు వంద మీటర్ల దూరం వెనక్కి వెళ్లింది. సాయిబాబా ఆలయం గేటు వద్ద ప్రయాణికులతో నిలిచి ఉన్న ఆటోను ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జుకాగా, ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి అక్కడికక్కడే చనిపోయారు. మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు తుగ్గలి మండలం ముక్కెళ్లకు చెందిన తల్లీకూతుళ్ల భూమిక(25) శ్రీనితిక (5), అదే గ్రామానికి చెందిన శిరీష (25)గా గుర్తించారు. భూమిక తల్లి, అక్క, ఆమె రెండేళ్ల కుమారుడు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. దసరా పండక్కి దుస్తులు కొనేందుకు వచ్చి ప్రమాదం బారిన పడ్డారని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పత్తికొండ సీఐ జయన్న చెప్పారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారయ్యాడు.



సంతోష్‌కుమార్

ఈఎంఐలు చెల్లించలేక ఆత్మహత్య

- అమెజాన్‌లో ఉద్యోగం పోవడంతో ఆర్థిక కష్టాలు
- మృతుడు సికింద్రాబాద్ వాసి.. ఆకివీడులో ఘటన

ఆకివీడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. నెలకు రూ.65 వేల జీతం. హైదరాబాద్, ఏలూరుల్లో ఇళ్లు కొనుగోలు చేశాడు. మూడు నెలల క్రితం ఉద్యోగం పోయింది. నాలుగు నెలలుగా ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఒత్తిడి పెరిగింది. ఫలితంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సికింద్రాబాద్‌కు చెందిన పాలకుర్తి సంతోష్‌కుమార్ చదువుకునే సమయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన కీర్తనను ప్రేమించి 2018లో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సంతోష్ హైదరాబాద్‌లో అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. హైదరాబాద్‌లో ఒకటి, ఏలూరులో రెండు ఇళ్లు కొనుగోలు చేశాడు. బ్యాంకులకు నెలకు సుమారు రూ.55 వేలు ఈఎంఐలు చెల్లిస్తున్నాడు. కొంత మొత్తాన్ని ఆయన తండ్రి, మామగారు సర్దేవారు. ఈ క్రమంలో వర్క్ ఫ్రం హోం చేసుకునేందుకు ఇటీవల కుటుంబ సమేతంగా అత్తగారింటికి ఆకివీడు వచ్చాడు. అయితే మూడు నెలలు క్రితం అమెజాన్ నుంచి సంతోష్‌కుమార్‌ను తొలగించారు. బ్యాంకులకు ఈఎమ్ఐలు చెల్లించలేకపోవడంతో ఒత్తిడి పెరిగింది. దీంతో మంగళవారం తెల్లవారుజామున ఇంటి వరండాలో సంతోష్‌కుమార్(35) మెడకు చీర బిగించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయే ముందు సెల్ఫీ సూసైడ్ వీడియోను భార్య ఫోన్‌కు పంపించాడు.

10న సచివాలయ ఉద్యోగుల బెజవాడ మార్చ్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో అక్టోబరు 10న బెజవాడ మార్చ్ నిర్వహించనున్నట్టు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ వెల్లడించారు. గుంటూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ వలంటీర్ల విధుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు విముక్తి కల్పించాలన్నది తమ ప్రధాన డిమాండ్ అన్నారు. సచివాలయం ఉద్యోగులను మాతృశాఖల్లో విలీనం చేయటంతో పాటు, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, బకాయిలు వెంటనే విడుదల చేయాలని, బదిలీల కోసం పారదర్శక విధానం తీసుకురావాలన్న డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

కిరాణా దుకాణంలో బాణసంచా పేలుడు

- భార్యాభర్తలు మృతి.. కుమారుడికి తీవ్ర గాయాలు

అయినవిల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కిరాణా షాపులో బాణసంచా సామాగ్రి పేలి భార్యాభర్తలు మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసకు చెందిన కంచర్ల శ్రీనివాస్(50), భార్య సీతామహలక్ష్మి(48) భార్యభర్తలు. వీరు స్థానికంగా కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. పదేళ్లగా వీరు తాత్కాలిక లైసెన్సు తీసుకుని దీపావళికి బాణాసంచా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో భార్యభర్తలు వంట గదిలోని అటక మీద గతేడాది మిగిలిన మందుగుండు సామాగ్రిని దింపుతున్నారు. ఈ సమయంలో పేలుడు సంభవించి భారీ శబ్దంతో ఇల్లు కూలిపోయింది. దీంతో ఇద్దరి మృతదేహాలూ శిథిలాల కిందే ఉండిపోయాయి. వారి కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వర్షాలకు కూలిన రథశాల గోడ

- కర్నూలు జిల్లాలో ముగ్గురి మృతి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం రథశాల గోడకూలి ముగ్గురు మృతి చెందారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రథశాల మట్టిగోడలు పూర్తిగా నాని పోయాయి. సోమవారం అర్ధరాత్రి తర్వాత రథశాల మట్టిగోడ కూలి ఓ గుడిసెపై పడింది. ఆ గుడిసెలో నిద్రిస్తున్న నాగరాజు (39), ఆయన కుమారుడు లక్ష్మీ నరసింహ(15) అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన నాగరాజు తల్లి లక్ష్మి, సోదరుడు రాజు (32)లను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజు చనిపోయాడు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 1 అక్టోబరు 2025

నేటి అలంకారం

శ్రీ మహిషాసురమర్దిని

ఆశ్వయుజ శుద్ధ నవమి (మహర్నవమి) బుధవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. అమ్మవారి నవఅవతారాల్లో మహిషాసుర మర్దినిని మహోగ్రరూపంగా భావిస్తారు. అమ్మ మహిషాసురుడిని సంహరించిన ఆశ్వయుజ శుద్ధ నవమిని 'మహర్నవమి'గా జరుపుకొంటారు. 'చండీ సప్తశతి' ప్రకారం దుర్గాదేవి అష్టభుజాలతో, సింహవాహినిగా మహిషాసురుడి సేనాపతులైన చిక్షురుడు, చామరుడు, ఉదగ్రుడు, భాష్కలుడు, బిడాలుడు తదితర రాక్షసులందర్నీ సంహరించింది. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో అవలీలగా మహిషాసురుణ్ణి



చంపి, అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రి మీద స్వయంభువుగా వెలసింది. సింహవాహనాన్ని అధిష్ఠించి, ఆయుధాలను ధరించిన ఆమె సకల దేవతల అంశలతో మహాశక్తి స్వరూపంగా దర్శనమిస్తుంది. ఈ తల్లిని పూజిస్తే సర్వ దేవతల అనుగ్రహం కలుగుతుందంటారు. మహిషాసురమర్దిని ఆరాధన వల్ల భయాలన్నీ తొలగిపోతాయనీ, శత్రు పరాజయం కలుగుతుందనీ, అంతఃశత్రువులు కూడా నశిస్తాయని, ధైర్యం కలుగుతుందనీ, సర్వ కార్యాల్లో విజయం సిద్ధిస్తుందనీ భక్తుల నమ్మకం.

దుర్గా నవరాత్రులు

నైవేద్యం: బెల్లపు అన్నం, పులిహోర, గారెలు, పాయసం, అప్పాలు

అలంకరించే చీర రంగు: గోధుమ, ఎరుపు

అర్చించే పూలు: తామర పుష్పాలు, ఎర్రటి అక్షతలు

పారాయణ చెయ్యాల్సింది: శ్రీ మహిషాసురమర్దినీ స్తోత్రం

ఫ్యాషన్

జందానీ జబర్దస్త్



ప్రతి పండుగకూ పట్టు చీరేనా? ఇంకేదైనా వెరైటీ చీర కట్టుకుందామా? అని ఆలోచించే మహిళలు నిస్సందేహంగా జందానీ చీరను ఎంచుకోవచ్చు.

జందానీ అసలు పేరు 'ఢకాయి'. ఢాకా నగరం నుంచే ఈ పేరొచ్చింది. ఈ అద్భుతమైన చీరలు ఢకాయి జందానీ లేదా ఢకాయి అనే పేరుతో ప్రజాదరణ పొందాయి. జమ్దాని అనే పదం మూలాలు పర్షియాలో ఉన్నాయి. బెంగాలీ చేనేత కళాకారులు జందానీ నేత పనితనాన్ని పెంపొందించుకున్నారు.

- మోటిఫ్స్, తయారీ ప్రాంతం ఆధారంగా జందానీ చీరలను వర్గీకరిస్తారు. పన్నా హజార్ లేదా వెయ్యి పచ్చలు, కల్కా లేదా పెయిస్లీ, బుటిదార్ లేదా చిన్న పువ్వులు, ఫుల్వార్, టెర్సా, జలాల్, దురియా, కర్కేనా మోటిఫ్స్ అత్యంత ఎక్కువగా ప్రజాదరణ పొందాయి
- గతంలో జందానీ చీరలు కేవలం రాజ కుటుంబాలకే పరిమితమై ఉండేవి. కానీ నేడు ఫ్యాషన్‌ను ఇష్టపడే మహిళలందరూ ఈ చీరల మీద మక్కువను ప్రదర్శిస్తున్నారు. కుటుంబ వేడుకలు, పండుగల్లో ఈ చీరలకే పెద్ద పీట వేస్తున్నారు
- బంగ్లాదేశ్‌లో రూపొందే ఢకాయి జందానీ చీరలు, తంగాయి జిల్లాలో రూపొందిన జందానీ చీరలు పెద్ద బార్డరును కలిగి ఉండి, పద్మం, దీపం, చేప పొలుసుక మోటిఫ్స్‌ను కలిగి ఉంటాయి. హుందాగా కనిపించే ఈ చీరలు సాయంకాలం వేళ వేడుకలకు అనువుగా ఉంటాయి.

'నిన్ను తొలిచూపులోనే ప్రేమించేశా' అన్నప్పుడు అతన్ని నమ్మలేకపోయింది. 'డేటింగ్ చేయను పెళ్లాడతా' అన్నప్పుడు కాస్త మెత్తబడింది. 'అందర్నీ ఒప్పించి పెళ్లాడతా' అన్నప్పుడు మరో ఆలోచన లేకుండా పెళ్లికి తల వంచేసింది. అలా వెంటపడి, పట్టుబట్టి పెళ్లాడిన అబ్బాయి 'నికొలస్' అమెరికన్ అయితే, అతన్ని తొలి చూపులోనే గెలుచుకున్న మన తెలుగమ్మాయి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ 'శ్వేత' కావడం విశేషం. ఊహకందనంత వేగంగా మలుపు తిరిగిన తన జీవితం గురించీ, తెలుగు భాషనూ, వంటలనూ, సంప్రదాయాలనూ ఇష్టపడే భర్త నిక్ గురించి, టెక్సాస్‌లో స్థిరపడిన 'రమిణి శ్వేత నికొలస్ అర్నీని' నవ్యకు ఇలా వివరించింది...



పడమట శ్వేతా రాగం

అమెరికాలో చదువు అనగానే, అది సంపన్నులకే సాధ్యపడుతుందని అనుకుంటారు. కానీ నేను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎలాగైనా అమెరికాలో ఉన్నత చదువు చదవాలనే కోరిక బలంగా ఉండేది. కానీ నాన్న అందుకు ఒప్పుకోరు. ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే కాబట్టి కలను నిజం చేసుకోవాలంటే కష్టాన్నే నమ్ముకోవాలని నిర్ణయించుకున్నాను. అలా పగటివేళను చదువుకూ, రాత్రివేళను ఉద్యోగానికీ కేటాయించాను. కొద్దికొద్దిగా డబ్బు కూడబెట్టుకుంటూ, సాధ్యమైనంతగా పొదుపు చేసుకుంటూ క్యాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీలో ఎమ్‌బిఎ చదువు కోసం దరఖాస్తు చేసుకున్నాను. మొదటి ప్రయత్నంలోనే సీటొచ్చేసింది. అయితే వీసా వచ్చేవరకూ ఇంట్లో చెప్పకూడదని అనుకున్నాను. అలా వీసా వచ్చిన తర్వాత ఇంట్లో చెప్పినప్పుడు అమ్మా నాన్న నిర్ఘాంతపోయారు. నిజానికి వీసా ఖర్చులకూ, ఫ్లైట్ టిక్కెట్‌కు అవసరమైన డబ్బును మాత్రమే దాచలిగాను. ఆ తర్వాత ఏం చేయాలో స్పష్టత లేకుండానే ప్రయాణానికి సిద్ధపడిపోయాను. కానీ చివరి నిమిషంలో అమ్మ మొదటి సెమెస్టర్‌కు అవసరమైన డబ్బును సమకూర్చి అందించింది. అలా ఓ పక్క భయంతో, మరోపక్క ఆనందంతో 2014లో అమెరికాలో అడుగుపెట్టాను. చదువు సాగినంత కాలం సొంత ఖర్చులు, చదువు కోసం రేయింబవళ్లూ కష్టపడ్డాను. సబ్‌వే రెస్టారెంట్లు, ఇండియన్ రెస్టారెంట్లు... ఇలా వీలున్న ప్రతి చోటా ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటలవరకూ 12 నుంచి 14 గంటల పాటు పని చేశాను. అలా ఇంట్లో ఒక్క రూపాయి అడగకుండా చదువు పూర్తి చేయగలిగాను. కొన్నిసార్లు ఇంటికి కూడా డబ్బు పంపించాను. అలా చివరకు 2016లో ఐటి సబ్జెక్టు కలిగిన ఎమ్‌బిఎ డిగ్రీ సాధించాను. ఆ తర్వాత ఏడాదిలోపే శామ్‌సంగ్‌లో ఉద్యోగం వచ్చేసింది. మొదటి ఉద్యోగం బోస్టన్‌లో. దగ్గర్లోని మాంచెస్టర్‌లో ఉన్న స్నేహితురాలిని తరచూ కలుస్తూ ఉండేదాన్ని. 2019లో ఓ పుట్టిన రోజు వేడుక కోసం మాంచెస్టర్ బయల్దేరినప్పుడు, అక్కడొక అద్భుతమైన వ్యక్తిని కలవబోతున్నట్టు నాకు తెలియదు.

తొలిచూపులోనే ప్రేమ

ఆ పార్టీలో నికొలస్ తప్ప మిగిలిన వాళ్లందరూ భారతీయులే! దాంతో నా స్నేహితులందరూ నిక్‌ను చుట్టుముట్టి అతన్ని సరదాగా ఆట పట్టించడం మొదలుపెట్టారు. నేను స్వతహాగా సిగ్గరిని కాబట్టి అదేమీ పట్టించుకోకుండా ఓ సోఫాకి పరిమితమై కూర్చుండిపోయాను. కానీ నిక్ అంతమంది అమ్మాయిలను వదిలేసి నా దృష్టిలో పడే ప్రయత్నం చేస్తూ, మాటలు కలపడం మొదలుపెట్టాడు. మొదట్లో భయపడి, దూరంగా పారిపోయాను. ఆ తర్వాత ఇంట్లో నాకు పెళ్లి ప్రయత్నాలు జరుగుతున్నట్టు స్నేహితుల ద్వారా తెలుసుకున్న నిక్, నన్ను ఇష్టపడుతున్నట్టు చెప్పి, ఒక కాగితం మీద తన ఫోన్ నంబర్ రాసిచ్చి వెళ్లిపోయాడు. ఆ తర్వాత నా స్నేహితులు నన్ను అనుకరిస్తూ, నా ఫోన్ నుంచి అతనికి మెసేజెస్ పెడుతూ అతన్ని లంచ్‌కి పిలిచారు. ఆ లంచ్‌లో నిజం తెలిసినప్పటికీ, ఆయన ఏమాత్రం కోపగించుకోకుండా, నేరుగా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. కానీ తర్వాత ఆలోచించి, అతని ప్రేమను, ప్రపోజల్‌నూ అంగీకరించాను. ఆ తర్వాత రెండు వారాలకే మా పెళ్లి జరిగిపోయింది. నిజానికి మా పెళ్లికి ఎంతో మంది ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ అమ్మ మాత్రం, 'నువ్వు ప్రేమించే వ్యక్తికి బదులుగా, నిన్ను ప్రేమించే వ్యక్తిని చేసుకుంటే సుఖపడతావు' అంటూ ప్రోత్సహించింది. అమ్మ చెప్పిందే నిజమైంది.

కొడుకు లేని లోటు తీర్చి...

నిక్ జీవితం, నా జీవితం ఒక లాంటివే! జీవితంలో పైకి ఎదగడం కోసం నేనెన్ని కష్టాలు పడ్డానో, నిక్ కూడా అంతకంటే ఎక్కువ కష్టాలే పడ్డాడు. 13 ఏళ్ల వయసులోనే తల్లితండ్రులను కోల్పోవడంతో మంచి కుటుంబం కావాలని కోరుకున్నాడు. మా అమ్మానాన్నలను తన అమ్మానాన్నల్లా ప్రేమించాడు. ఎంతో ఆప్యాయంగా ఆదరించాడు. అన్నిటికంటే ముఖ్యంగా ఆయనకు మన తెలుగు భాష, సంప్రదాయాలు, వంటలంటే ఎంతో ప్రాణం. ఇంట్లో పిల్లలతో తెలుగులోనే మాట్లాడమంటాడు. టివిలో కూడా తెలుగు కార్యక్రమాలే చూపించమంటాడు. తాను కూడా కష్టపడి తెలుగు నేర్చుకున్నాడు. ప్రస్తుతం కొద్దికొద్దిగా మాట్లాడగలుగుతున్నాడు. ఓసారి నాకు తెలియకుండానే అమ్మానాన్నలను అమెరికాకు పిలిపించి నన్ను సర్‌ప్రైజ్ చేశాడు. కొడుకు లేని లోటు తీర్చాడని అమ్మ ఎంతో మురిసిపోతూ ఉంటుంది.



మాది హైదరాబాద్. అక్కడే పుట్టి పెరిగాను. నాన్న రామకృష్ణ ఫైనాన్స్ బిజినెస్ చేస్తారు. అమ్మ సంధ్యారాణి ప్రస్తుతం గృహిణి. భర్త నిక్, సైన్యంలో ఐటి డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. ప్రస్తుతం నేను యుఐ డెవలపర్‌గా ఇంటి నుంచే పని చేస్తున్నాను. మాకు ముగ్గురు పిల్లలు. మొదటి బాబు అయాన్ష్‌కు నాలుగేళ్లు. రెండో వాడు, అరిహాన్‌కు రెండేళ్లు. పాప ఆష్నాకు ఏడాది వయసు. నాకొక అక్క కూడా ఉంది. పేరు దివ్య.

• గోగుమళ్ల కవిత

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వర రావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.



సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



నేడు విజయనగరం జిల్లాకు ముఖ్యమంత్రి

» దత్తిలో పింఛన్ల పంపిణీ

విజయనగరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పేదలకు స్వయంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేయనున్నారు. అనంతరం పేదలతో ముఖాముఖి, టీడీపీ శ్రేణులతో సమావేశం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస రావు మంగళవారం గ్రామంలో పర్యటించారు. కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసీ ఎస్.సేతుమాధవన్, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు.

ప్రభుత్వ బడులకు లక్ష నోటు పుస్తకాలు, పెన్నులు

» కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ విరాళం

» పంపిణీని ప్రారంభించిన మంత్రి లోకేశ్



ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పథకంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ కంపెనీ దాదాపు రూ.40 లక్షల విలువైన లక్ష నోటు పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందజేసింది. పుస్తకాలు, పెన్నులను తీసుకొచ్చిన లారీకి విద్యాశాఖ మంత్రి లోకేశ్ మంగళవారం జెండా ఊపి.. వాటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ ఎండీ కేఎల్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ కె.ప్రీతమ్‌రెడ్డి, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరికెపూడిసెలను పూర్తి చేద్దాం: సీఎం

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లావాసుల చిరకాల వాంఛ వరికెపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు జల వనరుల శాఖను ఆదేశించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగులకుంట్లలోని వరికపూడి వాగుపై ఈ ఎత్తిపోతలను తలపెట్టారు. వరద సమయంలో నాగార్జునసాగర్ ఫోర్‌షోర్ నుంచి రోజుకు 1.55 టీఎంసీల చొప్పున ఎత్తిపోసి.. పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా 24,500 ఎకరాలకు సాగు, 20,000 మందికి తాగునీటిని అందించడం ఈ పథకం ఉద్దేశం. దీనిపై సోమవారం రాత్రి సీఎం సమీక్ష జరిపారు. దీని ప్రారంభ అంచనా రూ.340 కోట్లు. ఇప్పుడు రూ.643 కోట్లకు పెరిగింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతుల కోసం దరఖాస్తు చేయనున్నారు.

యువతకు రాజకీయ వేదిక బీజేవైఎం: మాధవ్

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి వచ్చి దేశ సేవ చేయాలనుకునే యువతకు భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) సరైన వేదికని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. విజయవాడ బీజేవైఎం సదస్సులో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో జాతీయ భావజాలం ఉన్న యువత రాజకీయ ఆకాంక్షలకు బీజేవైఎం నిచ్చెన కావాలి. బీజేవైఎం కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లాలి. మోదీ నాయకత్వంలో దేశం బలోపేతమైన తీరు, ఎన్డీఏ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి. మరో వైపు స్థానిక సమస్యలపైనా బీజేవైఎం స్పందించాలి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలి' అని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అది.. దేవరగట్టు

కర్రల సమరం కాదు.. ఆధ్యాత్మిక జైత్రయాత్ర.. దసరా నాడు బన్నీ ఉత్సవాలు


దసరా రోజున దేవరగట్టులో కర్రల సమరంగా ప్రసిద్ధి చెందిన బన్నీ జైత్రయాత్ర

» చెడుపై మంచి సాధించిన విజయోత్సవం

» 3 గ్రామాల ప్రజలు నిష్ఠతో జరుపుకొనే వేడుక

» ఆంధ్ర, కర్ణాటక సరిహద్దున అనాదిగా ఆచారం

» ఉత్సవాలకు కర్నూలు జిల్లా దేవరగట్టు ముస్తాబు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

దసరా పేరు వినగానే.. రాయలసీమ సహా సరిహద్దు కర్ణాటక జిల్లాల ప్రజలకు గుర్తుకొచ్చేది దేవరగట్టు కర్రల సమరం. కర్రలతో కొట్టుకుంటూ.. తలలు పగిలి రక్తం చిందించే ఆటవిక ఆచారం..! సమాజానికి తెలిసిన విషయం ఇది! ఆ ఆచారం లోతుల్లోకి వెళితే.. చాలా విశిష్టత ఉంది. ఎంతో నిష్ఠతో ఆధ్యాత్మికంగా జరుపుకొనే వేడుక. మానవాళిని పట్టి పీడిస్తున్న దుష్ట శక్తులపై దైవశక్తులు సాధించిన విజయోత్సవ జైత్రయాత్ర. కర్నూలు జిల్లా దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి క్షేత్రంలో ఏటా విజయ దశమి పర్వదినాన బన్నీ పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలు ముగిసే వరకు పక్షం రోజుల పాటు అంటే.. దసరా శరన్నవరాత్రులు ప్రారంభానికి ముందు అమావాస్య నుంచి పౌర్ణమి వరకు మూడు గ్రామాలు నెరణికి, నెరణికితండ, కొత్తపేట ప్రజలు మద్యం, మాంసాహారం, దాంపత్య జీవితానికి దూరం. కాలికి చెప్పులు కూడా లేకుండా కఠోరదీక్ష, నియమ నిష్ఠలతో జరుపుకొంటారు. కొండపైకి చేర్చిన ఉత్సవమూర్తులు తిరిగి గ్రామానికి చేరుకున్న తరువాతే నియమ నిష్ఠలను వీడి సాధారణ జీవితం ప్రారంభిస్తారు. ఈ విషయాలు చాలామందికి తెలియకపోవచ్చు. పూర్వీకుల నుంచి వచ్చిన ఈ ఆచారాన్ని శతాబ్దాలుగా కొనసాగిస్తున్నారు అంటే.. నమ్మలేని నిజం. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో కర్నూలు జిల్లా ఆలూరు పట్టణానికి 15 కి.మీ. దూరంలో హొళగుంద మండలం దేవరగట్టులో దాదాపు 800 అడుగుల ఎత్తయిన కొండపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామి క్షేత్రం దసరా బన్నీ ఉత్సవాలకు సిద్ధమైంది. శనివారం ఉత్సవమూర్తులకు నెరణికి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలు, విజయోత్సవాలతో దేవరగట్టు క్షేత్రానికి చేర్చారు.

యుద్ధాన్ని తలపించేలా..


కర్నూలు జిల్లాలోని దేవరగట్టు క్షేత్రం

అడవిలోకి వెళ్లడానికి ముందు.. ఉత్సవమూర్తులను పల్లకీలో సింహాసన కట్ట వద్దకు చేర్చి మహా మంగళ హారతి ఇస్తారు. దేవుడ్ని తమ వశం చేసుకోవడానికి ఎల్లార్తి, సులావాయి, విరుపాపురం, అరికేర, అరికేర తాండ, బిలేహాలు, ఆలూరు గ్రామాల భక్తులు ఓ వర్గంగా నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామస్థుల్ని అడ్డుకుంటారు. క్షణాల్లో వేలాది కర్రలు తలపైకి లేస్తాయి. కాళరాత్రి కాగడాల వెలుతురులో ఓ వర్గం వెనుకడుగు వేస్తే.. తరువాత మరో వర్గం వెనక్కి తగ్గుతుంది. ఇనుప తీగ చుట్టిన పట్టుడుకర్రలు తలలపై నాట్యమాడుతుంటాయి. డిర్ర్‌ర్ర్‌ర్ర్.. గోపరాక్ (బహుపరాక్) అంటూ హోరాహోరీగా సాగించే బన్నీ జైత్రయాత్ర 45 నిమిషాలు కర్రల యుద్ధాన్ని తలపిస్తుంది. ఆచారం ప్రకారం ఇది ఒక ఆటే కానీ కర్రలతో కొట్టుకోరు. ఆలయ ప్రధాన అర్చకుడు గిరి మల్లయ్య మాట్లాడుతూ.. సంప్రదాయ బద్ధంగా సాగే బన్నీ ఓ ఆటే కానీ కర్రల సమరం కాదని అన్నారు. వేలాది మంది కర్రలు చేతపట్టి ఒకచోట చేరినప్పుడు.. ఆ కర్రలు తలలకు తగిలి చిన్నచిన్న గాయాలు అవుతున్నాయే కానీ కొట్టుకోవడం వల్ల కాదని అంటున్నారు. కొందరు స్వార్థపరుల ఆగడాల వల్ల చెడ్డపేరు వస్తుందే కానీ ఇది ఆధ్యాత్మికంగా సాగించే బన్నీ ఉత్సవమని అన్నారు. 2017-18 మధ్యలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు దీనిపై ఫిర్యాదులు వెళ్లాయి. విచారించిన కమిషన్ ఇది సంప్రదాయబద్ధంగా కొనసాగిస్తున్న ఉత్సవమని తేల్చిందని ఆయా గ్రామాల భక్తులు అంటున్నారు.

కర్రలు, కాగడాలు ఎందుకంటే..

దసరా రోజున అర్ధరాత్రి 12:15 గంటల తరువాత మాళ మల్లేశ్వరులకు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. కొండపై నుంచి దిగువన ఉన్న సింహాసన కట్ట వద్దకు స్వామివారి పల్లకీతో చేరుకుంటారు. బన్నీ (మొగలాయ్) ఆడుతారు. అక్కడి నుంచి దట్టమైన అడవిలో ఉన్న ముళ్ల బండ, పాదాల గట్టు, రక్షపడ, బన్నీకట్ట, వన్నె చెరువుకట్ట మీదుగా తెల్లవారు జామున బసవన్న గుడికి చేరుకుంటారు. ఆ క్షేత్రాలు చుట్టి రావాలంటే కారుచీకటిలో దాదాపు పది కిలోమీటర్లు స్వామివారి పల్లకీతో వెళ్లి రావాల్సి ఉంటుంది. పూర్వం క్రూరమృగాలు సంచరించేవి. ఆ క్రూర మృగాలు, అడవి జంతువుల నుంచి రక్షణ కోసం చేతిలో కర్రలు, వెలుతురు కోసం కాగడాలు తీసుకువెళ్లేవారు. ఇప్పటికీ ఆ ఆచారం కొనసాగిస్తున్నారు.

ఎనిమిది తరాలుగా మేమే అర్చకులం..

చెడుపై మంచి సాధించిన విజయోత్సవమే బన్నీ జైత్రయాత్ర. త్రేతాయుగం నుంచి ఈ ఆచారం వస్తోంది. ఎనిమిది తరాలుగా మా కుటుంబీకులే అర్చకులుగా ఉంటూ కొనసాగిస్తున్నాం. వేలాది మంది కర్రలతో చేరినా ఎక్కడా కొట్టుకోరు. బన్నీ ఆడే క్రమంలో కర్రలు తగిలి చిన్నచిన్న గాయాలు అవుతున్నాయి.

- గిరి మల్లయ్య, ప్రధాన అర్చకుడు, దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి క్షేత్రం, నెరణికి గ్రామం, హొళగుంద మండలం

21వ ఏట నుంచి బన్నీ ఆడాను



నా వయసు 84 ఏళ్లు. మా తాతముత్తాల కాలం నుంచి దేవరగట్టు బన్నీ ఉత్సవంలో పాల్గొంటున్నాం. 850 ఏళ్లకు పైగా ఈ ఉత్సవం జరుగుతోందని మా పూర్వీకులు చెప్పేవారు. నా 21వ ఏట నుంచి కర్ర చేతపట్టి బన్నీ ఆడాను. వయసు మీద పడడంతో ఐదారేళ్లుగా బన్నీకి దూరంగా ఉంటున్నా. కర్ర పట్టుకొని కొండకు పోతాను.

- గూలిపాలెం ఈరన్న, నెరణికి గ్రామం, హొళగుంద మండలం

రక్తతర్పణం చేస్తున్నాం



బన్నీ ఉత్సవాల్లో శివుడి ఆజ్ఞానుసారంగా శివభక్తులైన మా వంశస్థులు రక్తతర్పణం చేస్తున్నాం. మా నాన్న తరువాత 13 ఏళ్లుగా నేను ఆచరిస్తున్నాను. రక్షపడ ప్రాంతం వద్ద మీటరు పొడవుండే మందాటి ఇనుప కడ్డీని కాలి పిక్క వద్ద దూరించి, ఆ రంధ్రంలో 40 అడుగులకు పైగా ఉండే దారాన్ని లాగుతారు. ఏ మాత్రం నొప్పి, బాధ అనిపించదు. వెంటనే బండారు (పసుపు) పూసుకుంటే మానిపోతుంది. ఎలాంటి మందులు కూడా వాడం.

- కంచెవీర బసవరాజు (గొరవయ్య), నెరణికి గ్రామం

ఇదీ పురాణగాథ


ఉత్సవమూర్తులు మాళ మల్లేశ్వరస్వాములు

త్రేతాయుగంలో మునీశ్వరులు యజ్ఞయాగాలు నిర్వహిస్తే, వాటిని మణిమల్లాసుర రాక్షసుడు భగ్నం చేసేవాడట. మునులు శివపార్వతులను వేడుకోగా.. వారు మాళ, మల్లేశ్వరులుగా అవతరించి యుద్ధం ఆరంభించారు. శివుడి చేతిలో మరణం మహాభాగ్యమని భావించిన ఆ రాక్షసుడు శివుడి ఆజ్ఞతో మృత్యువుకు సమ్మతిస్తూనే.. ఏటా తనకు నరబలి ఇవ్వాలని కోరాడట. సమ్మతించని శివుడు విజయదశమి రోజున నా భక్తుల్లో ఒకరు (గొరవయ్యలు) పిడికెడు రక్తం ధారపోస్తారని అభయం ఇవ్వడంతో ఆ రాక్షసుడు మరణించాడని పురాణగాథలు చెబుతున్నాయి. ఆ తర్వాత యజ్ఞాలు నిర్విఘ్నంగా కొనసాగిస్తూ మునులు ఏటా విజయోత్సవం జరుపుకొనేవారు. ఆ ఆచారమే ఇప్పటికీ భక్తులు విజయదశమినాడు బన్నీ ఉత్సవం పేరిట జైత్రయాత్రగా జరుపుకొంటున్నారు.

వైరుధ్యాలు వీడి..

నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామస్థులు ఎంతో నిష్ఠతో ఉత్సవాలు నిర్వహిస్తారు. మనుషుల మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నా.. దైవకార్యార్థం వాటన్నింటినీ వీడి అన్నదమ్ముల్లా ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడం ఆ గ్రామాల ఐక్యతను చాటుతుంది. బన్నీ ఉత్సవానికి ముందు డొళ్ల బండ వద్ద ప్రధాన అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో కర్రలు, కాగడాలు, బండారు(అమ్మవారి పసుపు-కుంకుమ) చేతబూని మనలో ఏ ఒక్కరికీ కీడు తలపెట్టకుండా సోదరుల్లా దేవుడి కార్యం దిగ్విజయం చేద్దామంటూ పాల బాసలు చేస్తారు. కాగడాల వెలుతురులో డిర్ర్‌ర్ర్‌ర్ర్.. గోపరాక్ (బహుపరాక్) అంటూ దేవరగట్టుకు చేరుకుంటారు.


ఢిల్లీలో జరిగిన సమావేశంలో మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఎయిర్ బస్ ప్రతినిధులు

వెల్‌కం 'ఎయిర్ బస్'!

» పెట్టుబడులతో ఏపీకి రండి: మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత విమాన తయారీ సంస్థ 'ఎయిర్ బస్' పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మంగళవారం ఢిల్లీలో ఆ దిగ్గజ సంస్థ పూర్తిస్థాయి బోర్డు ఉన్నత స్థాయి సమావేశానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ హాజరయ్యారు. మొదటి సారి భారతదేశానికి వచ్చిన ఎయిర్ బస్ బోర్డుకు ఈ సందర్భంగా ఆయన స్వాగతం పలికారు. ఎయిర్‌బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తో పాటు ఆ సంస్థ ఇండియా, సౌత్ ఏషియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్‌లతో కూడిన బోర్డుకు లోకేశ్ పలు ప్రతిపాదనలు చేశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇస్తున్న ప్రాధాన్యాలు, పెట్టుబడుల విధానం, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సౌకర్యం, నిర్దిష్ట గడువులోగా ప్రాజెక్టు అమలు వంటి అంశాలు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్, ప్రపంచస్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించిన ఆయన ట్రాక్ రికార్డు గురించి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్ బస్ నేతృత్వంలో ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనికి అనుబంధంగా సప్లయ్ చైన్‌లో ఎండ్ టు ఎండ్ అనుసంధానానికి టైర్ 1, టైర్ 2 ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. ఏపీలో ఇప్పటికే పరిశ్రమలకు అందుబాటులో భూమి ఉందని వివరించారు. ప్రాజెక్టు వేగవంతంగా పూర్తి, గ్లోబల్ క్వాలిటీ మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌కు అనుకూలంగా ఉన్న రాష్ట్ర ఏరోస్పేస్ పాలసీని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను వివరించారు.

ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌నూ ఏర్పాటు చేయండి..

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన యూనిట్‌తోపాటు సరఫరాదారులు, ఎంఎస్ఎంఈలు, భాగస్వాములు కలిసి పనిచేయగల ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌ను సైతం ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో స్వర్ణ ప్రమాణానికి సూచికగా నిలిచే ఎయిర్‌బస్‌కు అవసరమైన పూర్తి ఎకో సిస్టమ్ అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా పాల్గొన్నారు. మొదటిసారిగా ఎయిర్‌బస్ బోర్డు భారత్‌కి వచ్చిన నేపథ్యంలో ఆ సంస్థతో దేశ ప్రత్యేక సంబంధాలను మరింతగా బలోపేతం చేసే దిశగా చర్చలు సాగాయని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రండి.. చూడండి!

(మొదటి పేజీ తరువాయి)

పిలుపిచ్చారు. మంగళవారం ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన 30వ భాగస్వామ్య సదస్సులో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. నవంబరు 14, 15వ తేదీల్లో సీఐఐతో కలిసి విశాఖలో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు రావాలని పారిశ్రామికవేత్తలను, వివిధ దేశాల రాయబారులను సీఎం సాదరంగా ఆహ్వానించారు. 'సంపద సృష్టికి పెట్టుబడులు రావాలి. సంపద సృష్టిస్తేనే పేదరికాన్ని నిర్మూలించగలం. ప్రధాని మోదీ వికసిత్ భారత్-2047 రూపొందిస్తే.. మేం స్వర్ణాంధ్ర విజన్-2047కు రూపకల్పన చేశాం. రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా విజన్ లక్ష్యం. దీని కోసం 10 సూత్రాలను ఆధారంగా చేసుకుని పనిచేస్తున్నాం. రాష్ట్రంలో పరిశ్రమలకు అనువుగా ఉండేలా లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రేవులు, విమానాశ్రయాలు, రహదారుల నిర్మాణం చేపడుతున్నాం. స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. విద్య, వైద్య రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. సమీకృత అభివృద్ధి అనేది ఇప్పటి నినాదం. పీ4 ద్వారా అది సాధ్యమే' అని స్పష్టంచేశారు.



సీఐఐ సమావేశంలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి పీయూష్ గోయల్

15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా..

'2026 జనవరి నాటికి ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. ఆ తర్వాతి రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్ పరికరాలను కూడా ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటాం' అని చంద్రబాబు తెలిపారు. 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పని చేస్తోందన్నారు. 'పునరుత్పాదక విద్యుత్ రంగంలో 500 గిగావాట్లను దేశంలో ఉత్పత్తి చేయాలని నిర్దేశిస్తే.. అందులో ఏపీలోనే 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యం పెట్టుకున్నాం. సులభతర వాణిజ్య విధానం అమలులో మా రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు చేపట్టాం. భారత కర్బన ఉద్గారాల రహిత ప్రయాణంలో మా రాష్ట్రం కీలక భాగస్వామిగా ఉంటుంది' అని వివరించారు.

సహజ పర్యాటక ప్రాంతాలు వనరులు

తీర ప్రాంతంలో ప్రపంచ ప్రమాణాలతో పోర్టులు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్ల నిర్మాణం చేస్తున్నామని సీఎం చెప్పారు. అడ్వాన్స్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహిస్తామన్నారు. రైతులకు లబ్ధి కలిగేలా బిగ్ టెక్ కంపెనీలకు ఏపీ కీలక స్థానంగా మారుతోందని చెప్పారు. సహజ పర్యాటక ప్రాంతాలు తమ రాష్ట్రానికి ఉన్న అతిపెద్ద వనరుగా పేర్కొన్నారు.

పెట్టుబడులతో రండి..

» లొట్టే, కియ ప్రతినిధులతో మంత్రులు నారాయణ భేటీ

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ప్రముఖ బహుళ జాతి కంపెనీ లొట్టే, కియ కార్ల పరిశ్రమ ప్రతినిధులతో మంగళవారం మంత్రులు నారాయణ, బీసీ జనార్దనరెడ్డి సమావేశమయ్యారు. 'రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం నెలకొంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలవుతోంది. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉంది. అభివృద్ధి దిశగా నడుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకుగాను ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా సీఐఐ ఆధ్వర్యంలో 30వ భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తున్నాం. ఆ సదస్సునకు పెట్టుబడి ప్రతిపాదనలతో రండి' అని ఆయా సంస్థల ప్రతినిధులను మంత్రులు కోరారు.

చంద్రబాబు.. అభివృద్ధికి చిరునామా

» అధునాతన సాంకేతికతను నమ్ముతారు: గోయల్

అంతకుముందు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. చంద్రబాబును ప్రజల జీవితాలను మార్చిన సంస్కరణల శిల్పిగా అభివర్ణించారు. దేశంలో అభివృద్ధికి ఆయన చిరునామా అని కొనియాడారు. ఏపీలో ఏడో సారి సీఐఐ సదస్సును నిర్వహించనుండడమే రాష్ట్రాభివృద్ధి పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఆయన అధునాతన సాంకేతికతను నమ్ముతారన్నారు. విశాఖ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాల్లో ప్లగ్-అండ్-ప్లే సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.


కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన, మంత్రి కేశవ్, ఎంపీలు సతీశ్, సీఎం రమేశ్, కృష్ణ ప్రసాద్, మాగుంట తదితరులు

అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

» రాజకీయ పరిణామాలు, అభివృద్ధిపై 45 నిమిషాలపాటు చర్చించిన సీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి అమిత్‌షాతో ఆయన నివాసంలో దాదాపు 45 నిమిషాల పాటు భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలను ఆయన దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజారపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు సానా సతీశ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్, మాజీ ఎంపీలు కనకమేడల, కంభంపాటి రామ్మోహన్‌రావు ఉన్నారు.

'పూర్వోదయ' నిధులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుందన్నారు. దీని కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన నివాసంలో చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం పనుల పురోగతిని గురించి కేంద్రమంత్రికి ఆయన వివరించారు. కాగా, చంద్రబాబు పర్యటనలో ఆయన వెంట కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు తెన్నేటి కృష్ణప్రసాద్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, సానా సతీశ్, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.


కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

జోష్ నింపిన విజయవాడ ఉత్సవ్!

» పున్నమిఘాట్‌లో ఆకట్టుకున్న సంగీత కచేరి

విజయవాడ సిటీ, విజయవాడ (ఇబ్రహీంపట్నం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్-2025 విశేషంగా అలరిస్తోంది. ఉత్సవ్‌లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం పున్నమి ఘాట్‌లో నిర్వహించిన 'కమిలియన్స్ స్వాప్ ది బీట్ లైవ్ కాన్సర్ట్' సంగీత ప్రియులను ఉర్రూతలూగించగా.. వేలాది ప్రేక్షకుల సమక్షంలో గొల్లపూడిలోని కళావేదిక ర్యాంప్‌పై జరిగిన 'క్రౌన్ ఆఫ్ ది విజయవాడ' గ్రాండ్ ఫినాలేకు ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి 'కాంతారా-2' టీమ్ హాజరుకావడంతో విజయవాడ ఉత్సవ్‌కు మరింత జోష్ వచ్చింది. గొల్లపూడిలో జరిగిన 'క్రౌన్ ఆఫ్ ది విజయవాడ' గ్రాండ్ ఫినాలే ధూమ్‌ధామ్‌గా ముగిసింది. మిస్ విజయవాడ, మిసెస్ విజయవాడతోపాటు టీన్స్ విజయవాడ, లిటిల్ మిస్, లిటిల్ జూనియర్ పోటీలు ప్రేక్షకులను అలరించాయి. మిస్ విజయవాడగా నగరానికి చెందిన కారుమంచి రేష్మ, రన్నర్ ఎగా బి.భవిష్య, మిసెస్ విజయవాడగా ఎస్ సౌందర్య, రన్నరప్‌గా హేమశ్రీ మేడూరి ఎంపికయ్యారు. వారికి కాంతారా-2 టీమ్ మెమొంటోలు అందించారు. మిస్ టీన్ కేటగిరీలో పీ యశస్విని విజేతగా నిలిచింది. విజయవాడ ఉత్సవ్‌లో కాంతారా-2 సినిమా టీమ్ సందడి చేసింది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించి, చిత్రంలోని పాటను విడుదల చేశారు. నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి, నటి రుక్మిణి వసంత, హోంబాలే ఫిల్మ్స్ అధినేత చలువే గౌడ్ హాజరయ్యారు. ఇక, పున్నమి ఘాట్ వేదికగా నిర్వహించిన 'కమిలియన్స్ స్వాప్ ది బీట్ లైవ్ కాన్సర్ట్' ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. వేణువు విద్వాంసుడు కమిలియన్ అద్భుత ప్రదర్శన చేశారు. భారతీయ సంగీతంతో మొదలైన ఈ కచేరి ఆఫ్రికన్, ఆస్ట్రేలియన్ మ్యూజిక్‌తో అందరినీ అలరించింది. 'విజయవాడ ఉత్సవ్' స్ఫూర్తితో తన నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తానని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటించారు. పున్నమిఘాట్‌లో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు




గొల్లపూడిలో జరుగుతున్న విజయవాడ ఎక్స్‌పోలో కామాక్షి వయోలిన్ ప్రదర్శన, యువత కేరింతలు



7 కిలోల బంగారం.. 5 కోట్లతో అలంకరణ

▸ శ్రీమహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విశాఖ వన్‌టౌన్‌ని శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారిని మంగళవారం ఏడు కిలోల బంగారు ఆభరణాలతో మహాలక్ష్మిగా అలంకరించారు. బంగారు చీర, స్వర్ణ కిరీటం, బంగారు పాదాలు, 12 కిలోల వెండి వస్తువులను అలంకరణకు వినియోగించారు. ఐదు కోట్ల రూపాయల కొత్త కరెన్సీతో తోరణాలు కట్టి, మండపాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మూల విరాట్‌కు 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం చేసి, 108 స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ మాట్లాడుతూ 23 ఏళ్లుగా అమ్మవారిని అలంకరిస్తున్నామని చెప్పారు.

- విశాఖపట్నం (మహారాణిపేట), ఆంధ్రజ్యోతి



పాల కలశాలతో మహిళల శోభాయాత్ర

పాల కలశాలతో దుర్గమ్మకు అభిషేకం

▸ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

వి.కోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు జిల్లా వి.కోటలో 4,501 కలశాలతో మహిళలు దుర్గమ్మకు పాలాభిషేకం చేసి రికార్డు సృష్టించారు. వి.కోటలో ఏటా దుర్గమ్మకు దుర్గాష్టమి రోజున పాల కలశాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా మంగళవారం మహిళలు పాల కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించి.. 4,501 మంది మహిళలు పాల కలశాలను 2 కి.మీ. మేర ప్రదర్శనగా తీసుకొచ్చి 4 గంటల్లో అమ్మవారికి సమర్పించడం రికార్డుగా నమోదు చేశారు.

జగన్ పాలనలో రైతు ఘోష

▸ నెలకు 77 మంది చొప్పున బలవన్మరణం

▸ దేశంలోనే మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్: ఎన్‌సీఆర్‌బీ

▸ మహిళ ఆత్మగౌరవ భంగంలో దేశంలోనే తొలిస్థానం

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతిగా పదే పదే ప్రకటించుకునే వైసీపీ అధినేత జగన్ పాలనలో నెలకు 77మంది చొప్పున రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారు. కౌలు రైతులతో పాటు వ్యవసాయ కూలీలు, సొంత భూమి సాగు చేసిన రైతులు సైతం సాగు గిట్టుబాటుగాక బలవన్మరణాలకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా 2023లో ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతల జాబితాలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంటే రెండో స్థానంలో కర్ణాటక, మూడోస్థానంలో ఆంధ్రప్రదేశ్(925 మంది) ఉన్నాయి. ఇది వైసీపీ ప్రభుత్వంలో రైతులకు లభించిన సహకారానికి నిదర్శనమని రైతు నాయకులు చెబుతున్నారు. కాగా, దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలోనే ఉన్న మన రాష్ట్రం 2020 నుంచి వరుసగా అదే స్థానాన్ని కొనసాగించింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, అప్పులు, వడ్డీలు, పురుగు మందుల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు వంటివి అన్నదాతల ఉసురు తీశాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారిలో 828మంది పురుషులతో పాటు 97మంది మహిళలు సైతం బలవన్మరణాలకు పాల్పడ్డారు. రైతుల కన్నా వ్యవసాయ కూలీలు ఎక్కువగా ప్రాణాలు తీసుకోవడంతో సాగు భూములు శ్మశానాలుగా మారినట్లు వివరించింది.

నేరాల్లోనూ రికార్డే!

మహిళల జోలికొస్తే 21 రోజుల్లోనే మరణ శిక్ష వేస్తామంటూ అసెంబ్లీలో ప్రకటించి చట్టం కూడా చేయలేక 'దిశ' యాప్‌తో సరిపుచ్చిన జగన్ పాలనలో మహిళలపై లైంగిక వేధింపులు, నేరాలు అధికమేనని ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. దేశంలో 2023లో మహిళలపై జరిగిన లైంగిక వేధింపుల్లో ఏపీ 7వ స్థానంలో ఉండగా, ఇతర నేరాల్లో(22,418 కేసులు) 9వ స్థానంలో నిలిచింది. వృద్ధులపై దాడులు, అఘాయిత్యాల్లో రోజుకు సరాసరి ఐదుకు పైగా కేసులతో ఏకంగా ఆరో స్థానం దక్కించుకుంది. అప్పట్లో రంగనాయకమ్మ, డాక్టర్ సుధాకర్ వంటి వారిపై జరిగిన దౌర్జన్యాల ఫలితమే రాష్ట్రాన్ని ఈ స్థానంలో నిలిపాయని తెలుస్తోంది. ఎస్సీలపై 2027కేసులతో 7వ స్థానం, ఎస్టీలపై ఆ తర్వాతి స్థానంలో ఏపీ నిలిచింది. ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించడంలో వైసీపీ పాలనలో(2023) ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 8,446 ఘటనలు జరగ్గా ఒక్క మన రాష్ట్రంలోనే 2,826 ఘటనలు జరిగాయని పేర్కొంది. దీంతో తొలిస్థానంలో రాష్ట్రం నిలిచిందని, రెండో స్థానంలో మహారాష్ట్ర ఉందని నివేదిక తెలిపింది.

సైబర్ నేరాల్లో టాప్ టెన్

2023లో రాష్ట్రంలో సైబర్ నేరాలు పెరిగాయి. 2,341 కేసులతో ఏపీ.. దేశంలోనే పదో స్థానంలో నిలిచింది. వీటిలో ఆర్థిక మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్ ఉన్నాయి. అయితే, హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు, బాలలపై నేరాలు దేశవ్యాప్తంగా తగ్గినట్టే ఏపీలోనూ తగ్గాయని ఎన్‌సీఆర్‌బీ తెలిపింది.

ప్రతిదీ ప్రజల కోణంలోనే!

అలా ఆలోచిస్తేనే వారికి మేలు చేయగలం.. జగన్ కరెంటు చార్జీలు పెంచితే మనం తగ్గించాం: సీఎం

▸ సమర్థ, అసమర్థ పాలనకు తేడా ఇదే

▸ రాష్ట్ర జనాభాలో 13% మందికి పింఛన్లు


▸ ఏటా రూ.33 వేల కోట్లకుపైగా నిధులు

▸ చేసిన మంచి పనులను చెప్పుకోవాలి

▸ అప్పుడే ప్రభుత్వంపై సానుకూలత పెరుగుతుంది

▸ మంత్రులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలతో చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'చేసిన పనులను ప్రజలకు చెప్పుకొన్నప్పుడే ప్రభుత్వం పట్ల ప్రజల్లో పాజిటివిటీ పెరుగుతుంది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లడాన్ని సీరియస్‌గా తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రతిదీ ప్రజల కోణంలో ఆలోచించాలి. అప్పుడే వారికి మేలు చేయగలం. గత ప్రభుత్వం ట్రూ-అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచింది. మన ప్రభుత్వం ట్రూ-డౌన్ పేరుతో చార్జీలను తగ్గిస్తోంది. పీక్‌లోడ్ కరెంటు కొనుగోలు చేయకుండా స్వాపింగ్ విధానాన్ని అనుసరించాం. ఫలితంగా తక్కువ ధరకు కరెంటు కొనుగోలు చేయగలిగాం. సమర్థ పాలనకు.. అసమర్థ పాలనకు ఉన్న తేడా ఇదే. సౌర, పవన వంటి సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిపై ఫోకస్ పెట్టాం. తద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడడం తగ్గించుకోవచ్చు. ఉత్పత్తి ఖర్చులూ తగ్గుతాయి. ఈ విషయాలను ప్రజలకు వివరించాలి' అని పిలుపిచ్చారు. 'ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు 4వ తేదీన రూ.15 వేలు ఇవ్వనున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. జీఎస్టీ



సంస్కరణలతో కలిగే లాభాలను ప్రజలకు వివరించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని, ఇదీ వారికి చెప్పాలని సూచించారు. 'ప్రజలతో మమేకం కావడమే కాదు.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలి. ప్రజాప్రతినిధులు, నేతలు, కేడరే పార్టీకి ప్రతినిధులు.. తమ వ్యవహార శైలితో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి' అని దిశానిర్దేశం చేశారు.

- ప్రభుత్వం చేసే మంచి పనులు ప్రజలకు తెలిస్తే వారు మనవైపే నిలుస్తారు. వారు మన వైపు ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. 2024 ఎన్నికల్లో కూటమిగా వెళ్లాం. జనం అద్భుత విజయాన్ని కట్టబెట్టారు. ఈసారి అంతకు మించిన స్థాయిలో మళ్లీ విజయం దక్కేలా కూటమి పార్టీలు బలపడాలి.
- రాష్ట్ర జనాభాలో 13 శాతం మందికి పెన్షన్ల ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నాం. అతిపెద్దదైన యూపీలో కూడా పింఛన్లకు కేవలం రూ.5,500 కోట్లే ఇస్తున్నారు. అదే మన ప్రభుత్వం ఏటా రూ.33వేల కోట్లకుపైగా నిధులను పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తోంది.

- సీఎం చంద్రబాబు

చంద్రయ్య కొడుక్కి ఉద్యోగం అడ్డుకుంటారా: మంత్రి పార్థసారథి

బడుగుల వంచనలో జగన్ మహాఘనుడని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని చెప్పుకొనే ఆయన ప్రేమ నేతి బీరలో నెయ్యి లాంటిది. బీసీ అయిన చంద్రయ్య కొడుక్కి ఉద్యోగం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే దాన్ని వైసీపీ వారు అడ్డుకోవడం దారుణం' అని ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

బనకచర్లలో మార్పులు!

▸ జలవనరుల శాఖకు చంద్రబాబు సూచన

▸ ఎగువ రాష్ట్రాల అభ్యంతరాల వల్లే!

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంలో కొన్ని మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు రాష్ట్ర జలవనరుల శాఖకు సూచించారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ, కర్ణాటక నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. సోమవారం రాత్రి జరిపిన సమీక్షలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ ఏడాది ఇప్పటికే 1200 టీఎంసీల కృష్ణా, 5,500 టీఎంసీల గోదావరి జలాలు(మొత్తం 6,700 టీఎంసీలు) సముద్రంలో కలిశాయని.. కేవలం 200 టీఎంసీలను కరువు సీమకు తీసుకెళ్తామంటే అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకి.. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు తరలించి.. ఆ తర్వాత నల్లమల సాగర్‌కు, బనకచర్ల రెగ్యులేటర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోయాలన్నది ప్రతిపాదన. దీనిని రెండు భాగాలుగా విభజించాలని.. నల్లమల సాగర్ వరకు నీటిని తరలించడం.. తర్వాత వెలిగొండ నుంచి రివర్స్ పంపింగ్ విధానంలో శ్రీశైలం జలాశయం సమీపంలోని కాలువల ద్వారా రాయలసీమకు తీసుకెళ్లడంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కాగా.. రాయలసీమలో చెరువులను నింపడంలో అధికారుల అలసత్వంపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువ పరిధిలో 680 ఎకరాలకు సాగునీరందించే చెరువును నింపకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



రేణుకతో తల్లిదండ్రులు సత్యనారాయణ, పద్మావతి

59 లక్షల ప్యాకేజీ

▸ గూగుల్‌లో జాబ్ కొట్టిన ఏలూరు జిల్లా అమ్మాయి

▸ ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

▸ భీమవరంలో బీటెక్ చదువుతుండగానే ఉద్యోగం

ముదినేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి గూగుల్‌లో జాక్‌పాట్ కొట్టింది. ఏలూరు జిల్లాకు చెందిన దేవకోటి రేణుకా గంగ ఆ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఏడాదికి రూ. 59 లక్షల ప్యాకేజీతో మంచి చాన్స్ అందుకుంది. ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన రేణుకా గంగ, బీటెక్ ఐటీ బ్రాంచి నాల్గవ సంవత్సరంలో ఉండగానే ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగానికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో అత్యధిక ప్యాకేజీతో ఎంపికైనట్లు గూగుల్ యాజమాన్యం నుంచి సెలక్షన్ ఆర్డర్ మంగళవారం రేణుకా గంగకు అందింది. ఆమె వడాలిలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివింది. అనంతరం వేలేరు జవహర్ నవోదయ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివి మంచి మార్కులు సాధించింది. ప్రస్తుతం భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆఫ్ క్యాంపస్ ద్వారా ఉద్యోగాల భర్తీకి గూగుల్ సంస్థ చేపట్టిన ఇంటర్వ్యూలకు ఆమె దరఖాస్తు చేసింది. గూగుల్ ప్లే స్టోర్‌పై తనకు అప్పగించిన ప్రాజెక్టు వర్క్‌ను 3 నెలల్లో విజయవంతంగా పూర్తి చేసింది. గంగ తండ్రి సత్యనారాయణ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు.

కలెక్టర్ అవుదామనుకున్నా

సాఫ్ట్‌వేర్ రంగంలో దిగ్గజ సంస్థ గూగుల్‌లో అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యి కలెక్టర్ అవుదామనుకున్నా. ఈలోగా గూగుల్ ఆఫ్ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాను. సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ఉద్యోగం అందిపుచ్చుకోవడం సంతోషం కలిగించింది.

- రేణుకా గంగ



విరిగిపడిన ఆర్చ్ దిమ్మెలు..
9 మంది దుర్మరణం

▸ ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం పనుల్లో ప్రమాదం

▸ మృతులంతా అసోం రాష్ట్ర వాసులు

చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనుల్లో ప్రమాదం సంభవించింది. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు విరిగిపడి తొమ్మిది మంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. బాధితులంతా అసోం రాష్ట్ర వాసులని పోలీసులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో నాల్గవ యూనిట్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో వెయ్యి మందికిపైగా కార్మికులు పాల్గొంటున్నారు. ఆర్చ్ నిర్మాణ పనుల్లో 30 మంది కార్మికులు ఉన్నారు. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు మంగళవారం సాయంత్రం హఠాత్తుగా కూలాయి. ఆ దిమ్మెలు 20 మంది కూలీలపై పడటంతో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన వారిని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో నలుగురు చనిపోయారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ రాష్ట్ర కార్యదర్శి జె.రాధాకృష్ణన్, పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.



ఆంధ్రా యువతిపై తమిళ ఖాకీల అత్యాచారం

▸ ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణం

▸ తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ.. నిందితుల అరెస్ట్, రిమాండ్



కానిస్టేబుళ్లు సుందర్, సురేష్‌రాజ్

చెన్నై, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన అరుణాచలం(తిరువణ్ణామలై)లో దారుణం చోటుచేసుకుంది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన ఆంధ్రాకు చెందిన ఇద్దరు యువతుల్లో ఒక యువతిపై ఇద్దరు స్థానిక పోలీసులు అత్యాచారానికి తెగబడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తిరువణ్ణామలై బైపాస్‌రోడ్డులో సోమవారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తిరువణ్ణామలై వైపునకు లోడుతో వెళుతున్న ఓ వాహనాన్ని ఆపిన కానిస్టేబుళ్లు.. అందులో ఉన్న ఇద్దరు యువతులను కిందికి దించారు. తెలుగులో మాట్లాడుతున్న వీరు అక్కాచెల్లెళ్లు కాగా, ఒకరికి 20, మరొకరికి 18 ఏళ్ల వయసుంటుందని సమాచారం. ఆ వాహనాన్ని అక్కడి నుంచి పంపించేసిన పోలీసులు తమ ద్విచక్రవాహనాలపై యువతులిద్దరినీ ఎక్కించుకుని సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏందల్ శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అక్కను బెదిరించి పక్కన కూర్చోబెట్టారు. ఆమె చెల్లెలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం రోదిస్తూ కనిపించిన ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లను గమనించిన స్థానికులు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి పంపించారు. తన చెల్లిపై జరిగిన దారుణం గురించి అక్కడ తిరువణ్ణామలై పోలీసులకు అక్క ఫిర్యాదు చేసింది. ఈ దారుణంపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. సుందర్, సురేష్‌రాజ్ అనే కానిస్టేబుళ్లను అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు.

పోలవరం నిర్వాసితులకు ఒకే దఫాలో పరిహారమివ్వకపోతే ఎలా?

▸ విడతలవారీ చెల్లింపులతో అసంతృప్తి

▸ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఒకే దఫాలో సహాయ పునరావాస మొత్తాన్ని అందజేయకపోవడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసహనం వ్యక్తం చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ల్యాండ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగం కమిషనర్ శైలేష్‌కుమార్ సింగ్ జాతీయ హోదా ప్రాజెక్టులు నిర్మిస్తున్న రాష్ట్రాలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష జరిపారు. ఆయా ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లింపులను పరిశీలించారు. మొదటి దశలో భూసేకరణ కోసం రూ.12,832 కోట్లను చెల్లించాల్సి ఉండగా.. రూ.6,609 కోట్లు మాత్రమే ఇవ్వడంపై పెదవివిరిచారు. నిర్మించిన పునరావాస కాలనీల నిర్వహణ జలవనరులశాఖ చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఒకేదఫాలో సహాయ పునరావాస పరిహారం చెల్లిస్తే.. ప్రభుత్వం తమకు సరైన నష్టపరిహారం ఇచ్చిందన్న సంతోషం వ్యక్తమవుతుందని కేంద్రం అభిప్రాయపడింది. విడతలవారీ చెల్లింపులతో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతుందని పేర్కొంది. నిర్వాసితులకు సహాయ పునరావాసం చెల్లింపులకు అధికప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

ఆలయాలు, టాయిలెట్లు ఒకటేనా..!

▸ ఇదే సలహా చర్చికో, మసీదుకో ఇవ్వగలరా?

▸ షర్మిల వ్యాఖ్యలు దురదృష్టకరం: మంత్రి ఆనం



నెల్లూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'ఆలయాలు కట్టే బదులు సమాజానికి అవసరమైన టాయిలెట్లు కట్టాలని సలహా ఇస్తారా? కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దృష్టిలో ఆలయాలు, టాయిలెట్లు ఒకటేనా..? ఇదే సలహా చర్చికో, మసీదుకో ఇవ్వగలరా..? అయినా షర్మిలకు ఆస్తుల గురించి తప్ప ఆధ్యాత్మికత గురించి ఏం తెలుసు?' అంటూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులో మండిపడ్డారు. 'హిందూ ధర్మంపై షర్మిల వ్యాఖ్యలు దురదృష్టకరం. ఆ వ్యాఖ్యలు ఆమె సొంత విధానమా? లేక కాంగ్రెస్ పార్టీ విధానమో స్పష్టం చేయాలి. మత మార్పిళ్లు చేయడమే వృత్తిగా పెట్టుకున్న వారికి దేవాలయాల నిర్మాణం నచ్చకపోవడమనేది ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. తిరుమల శ్రీవెంకటేశ్వరుని విరాళాల సొమ్ము దోచుకున్నప్పుడు సైలెంట్‌గా ఉన్న షర్మిల ఇప్పుడు దేవాలయాల నిర్మాణాలపై మాత్రం తెగ విమర్శలు చేస్తున్నారు. దళితవాడల్లో గుళ్లు నిర్మిస్తే ఇతర మతాలకు నష్టం జరుగుతుందనే ఆందోళన షర్మిలలో కనిపిస్తోంది. టీటీడీ అనేది ప్రభుత్వ ఖజానా కాదు. ఆ సంస్థకు వచ్చే విరాళాలను వినియోగించడానికి ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. వాటికి అనుగుణంగానే ఖర్చు పెట్టాలి' అని మంత్రి ఆనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తలెత్తుకునే పరిస్థితి లేదని, షర్మిల స్థాయికి మించి మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. వైఎస్ అన్ని మతాలను గౌరవిస్తే, వారి పిల్లలు హిందూ మతాన్ని ప్రతిసారీ ద్వేషిస్తున్నారని ఆనం మండిపడ్డారు.

ప్రజల నుంచే విరాళాలు...

'రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో దళిత, గిరిజన కాలనీల్లో 5,000 ఆలయాలను నిర్మించనున్నాం. వీటికి అవసరమైన నిధులను ప్రజల నుంచే విరాళాలుగా సేకరించనున్నాం' అని మంత్రి ఆనం తెలిపారు. నవంబరులో వెయ్యి ఆలయాల విస్తరణాభివృద్ధి పనులు చేపడుతున్నాం. 926దేవాలయాల్లో పాలకవర్గాలఏర్పాటుకు నోటిఫికేషన్లు జారీ చేశాం' అని మంత్రి తెలిపారు.

దళిత వాడల్లో ఆలయాలు వద్దా: వల్లూరు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకన్నకు భక్తులు సమర్పించిన ముడుపులతో దళిత వాడల్లో వెంకటేశ్వర స్వామి ఆలయాలు నిర్మిస్తే క్రైస్తవ మతాన్ని ఆచరించే పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ఇబ్బంది ఏంటి? అని బీజేపీ నేత వల్లూరు జయప్రకాశ్ నారాయణ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'తిరుమల కొండపై ఆమె కుటుంబం ఎప్పుడూ విషం కక్కుతూనే ఉంది. ఏడు కొండలు కాదన్న తండ్రి, లడ్డూను కల్తీ చేయించిన అన్న, దళిత వాడల్లో ఆలయాలే వద్దంటోన్న చెల్లి. హిందూ దళితులున్న కాలనీల్లో చర్చిల నిర్మాణంపైనా షర్మిల ఇలాగే స్పందిస్తారా?' అంటూ వల్లూరు నిలదీశారు.

ఆటో డ్రైవర్లకు 435 కోట్లు

▸ 2.90 లక్షల మందికి సాయం: నసీర్

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'జగన్ హయాంలో ఆటో డ్రైవర్లు రోడ్డెక్కాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. నేడు కూటమి ప్రభుత్వం వారికి ఆర్థిక భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటుంది' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. 'యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం క్యాబ్, ఆటోడ్రైవర్లకు అండగా నిలుస్తూ వారికి రూ.15 వేలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ పథకం అమలుకు రూ.435 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించింది. అక్టోబరు 4న సుమారు 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేయబోతున్నాం' అని ఎమ్మెల్యే తెలిపారు.

ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

▸ 'చిత్తూరు' అటవీశాఖ పార్కులో ఒంటరి జంటను బెదిరించి ఘాతుకం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. దుండగులు ఒంటరిగా ఉన్న జంటను బెదిరించి, అందులో యువతిని చెరబట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలివీ.. పూతలపట్టు మండలానికి చెందిన బాలిక చిత్తూరులో ఇంటర్మీడియట్ చదువుకుంటోంది. గత గురువారం స్నేహితుడితో కలిసి మురకంబట్టు సమీపంలో అటవీశాఖకు చెందిన 'నీవా నగర వనం' పార్కుకు వెళ్లింది. అక్కడ చిత్తూరుకు చెందిన ముగ్గురు స్నేహితులు హేమంత్, మహేష్, కిశోర్ ఆ ప్రేమజంటను చూసి టార్గెట్ చేశారు. వారి వద్దకు వెళ్లి అటవీశాఖ సిబ్బందిగా పరిచయం చేసుకున్నారు. అనంతరం వారిని ఫొటోలు, వీడియోలు తీసి వారి తల్లిదండ్రులకు పంపిస్తామని బెదిరించి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పగా సోమవారం పార్కు వద్ద ఆ ముగ్గురిలో ఇద్దరికి దేహశుద్ధి చేసి చిత్తూరు తాలుకా పోలీసులకు అప్పగించారు. మరొకడు పరారయ్యాడు. హత్యాయత్నం, పోక్సో, గ్యాంగ్ రేప్‌తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికను చెరబట్టిన బాబాయి

▸ భయపెట్టి లొంగదీసుకుని గర్భవతిని చేశాడు...పోక్సో కేసు నమోదు

విజయవాడ(పాయకాపురం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి చదువుతున్న బాలికపై బాబాయే కన్నేశాడు. మాయమాటలు చెప్పి భయపెట్టి లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. వివరాలివీ.. విజయవాడలోని పాయకాపురం ప్రాంతానికి చెందిన బాలిక(14) ఏడో తరగతి చదువుతుంది. ఆరేళ్ల క్రితం ఆమె తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించగా కొంత కాలానికే తల్లి అనారోగ్యంతో చనిపోయింది. దీంతో తల్లి సోదరి(పిన్ని) బాలికను తన ఇంటికి తీసుకువచ్చి పెంచుకుంటోంది. ఈ నేపథ్యంలో పిన్ని భర్త ప్రవీణ్(26) బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెకు మాయమాటలు చెప్పి, బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో అమ్మమ్మ ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలో 8 శాతం అధికంగా వర్షపాతం
కుమ్మేసిన నైరుతి

▸ అత్యధికంగా కురిసే చిరపుంజిలో వర్షాభావం

విశాఖపట్నం, సెప్టెంబరు 30: దేశంలో ఈ నైరుతి రుతు పవనాల సీజన్‌లో వర్షాలు అధికంగా కురిశాయి. సాధారణం కంటే 8 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. మేఘ విస్ఫోటనాలు(క్లౌడ్ బరస్ట్), కొండచరియలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వంటి పలు సంఘటనలు జరిగినా ఇది 'చాలా విజయవంతమైన రుతుపవనాల సీజన్' అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర మంగళవారం ఆన్‌లైన్ విలేకరుల సమావేశంలో చెప్పారు. జూన్‌లో 8.9%, జూలైలో 4.8%, ఆగస్టులో 5.2%, సెప్టెంబరులో 15.3% అధికంగా వర్షాలు కురిశాయన్నారు. భారత దేశ సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, 937.2 మిల్లీమీటర్ల(8% అధికంగా) వర్షాలు పడ్డాయన్నారు. తూర్పు, ఈశాన్య భారతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యిందని చెప్పారు. సాధారణ వర్షపాతం 1367.3 మిల్లీమీటర్లు కాగా 20 శాతం తక్కువగా 1089.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. బిహార్, మేఘాలయ, అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో తీవ్ర వర్షాభావం నెలకొందన్నారు. గత 20 ఏళ్లగా ఆ ప్రాంతంలో వర్షాలు తగ్గుతున్నట్టు తెలిపారు. ఇక వాయవ్య భారతంలో సాధారణం కంటే 27.3 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. వాయవ్య భారతంలోని అన్ని జిల్లాల్లోనూ జూన్, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిశాయన్నారు. మధ్య భారతంలో సాధారణం 978 మిల్లీమీటర్లు కాగా 15.1% అధికంగా 1125.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని, దక్షిణ భారతంలో (సాధారణం 716.2 మిల్లీమీటర్లు) కంటే 9.9% అధికంగా వర్షాలు కురిశాయని తెలిపారు.

వాతావరణ మార్పులతో హెచ్చుతగ్గులు

ఈఏడాది నైరుతి సీజన్‌లో అనేక అసమానతలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల కుంభవృష్టి వర్షాలతో అపార నష్టం వాటిల్లగా, మరికొన్నిచోట్ల దుర్భిక్షం నెలకొంది. ఇంకొన్నిచోట్ల రోజుల తరబడి పొడి వాతావరణం కొనసాగింది. ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే చిరపుంజిలో ఈ ఏడాది అనేకరోజులు వర్షాభావం కొనసాగింది. మహారాష్ట్రలోని పూణే జిల్లా సహ్యాద్రి పర్వత ప్రాంతాలకు చెందిన తమ్హిని ఘాట్‌లో 9,194 మి.మీ. వర్షపాతం కురవడంతో కొత్త రికార్డు నమోదైంది. తూర్పు, ఈశాన్య భారతంలో వర్షాలు తగ్గుతున్న తీరు ఆందోళనకరంగా ఉంది. మే 24న కేరళలోకి ప్రవేశించిన రుతుపవనాలు ప్రస్తుతం ఉత్తరాదిలో ఉన్నాయి. దేశం నుంచి నిష్క్రమించడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుంది. అయినా సెప్టెంబరు 30తోనే సీజన్ ముగిసినట్టు పరిగణిస్తారు. కాగా, వాతావరణ మార్పుల ప్రభావంతో 2021 నుంచి వర్షపాతం తీవ్రత పెరుగుతోంది. ఈ ఏడాది 2109 ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ, 303 చోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల అసాధారణ వర్షాలు (30 సెంటీమీటర్ల కంటే ఎక్కువ) కురిశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.